22-04-2024
సోమవారం
ఖమ్మం

సంపుటి 07, సంచిక: 141
పేజీలు: 8+8
వెల రూ. 5.00

Published from:
Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★






## మణిపూర్‌లో 11 చోట్ల నేడు రీపోలింగ్

**ఇంఫాల్ :** లోక్‌సభ తొలిదశ ఎన్నికలు ఈ నెల 19న ముగిశాయి. ఇందులో భాగంగా ఇన్నర్ మణిపూర్ పార్లమెంటు నియోజకవర్గంలోని 11 చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ కేంద్రాల్లోకి చొరబడిన దుండగులు కాల్పులు, బెదిరింపులు, ఇవిఎంల ధ్వంసం వంటి ఘటనలకు పాల్పడ్డారు. దీంతో ఆ 11 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 22న రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం (ఇసి) నిర్ణయించింది. ఈ మేరకు మణిపూర్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సిఇఒ) ప్రకటించారు. తొలి దశ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 19న ఈ స్టేషన్లలో జరిగిన ఎన్నికలు తరువాయి 2లో



## రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృత్యువాత

**కోటా :** రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాలవర్‌లో ఆదివారం తెల్లవారు జామున ఓ కారు ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందారు. బాధితులంతా 16–30 ఏళ్ల మధ్య వయస్సుగలవారేనని అధికారులు చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని దుంగ్రి గ్రామంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. బాధితుల్లో రోహిత్ (16), సోను (22), దీపక్ (24) సోదరులని ఎక్లేరా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ సందీప్ విషోని చెప్పారు. మిగతా బాధితులను తరువాయి 2లో



## మిర్యాలగూడ నుండి సిద్దిపేట వరకు

### 24 నుండి కెసిఆర్ రోడ్‌షోలు

ప్రజాపక్షం/హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఈ నెల 24 నుండి ''రోడ్‌షో''ను నిర్వహించనున్నారు. మిర్యాలగూడ నుండి సిద్దిపేట వరకు సుమారు 17 రోజుల పాటు రోడ్‌షో నిర్వహించనున్నారు. 24న మిర్యాల గూడ, సూర్యాపేట, 25న భువనగిరి, 26న మహబూబ్ నగర్, 27న నాగర్ కర్నూల్, 28న వరంగల్, 29న తరువాయి 2లో



## కరీంనగర్‌కు రాధాకిషన్‌రావు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో 'ఎ4' గా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావు ఆదివారం కరీంనగర్‌కు వచ్చారు. నగరంలోని సాగర్ రావు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాధాకిషన్‌రావు తల్లిని చూసేందుకు అనుమతి ఇవ్వాలని కోర్టును విన్నవించగా నాంపల్లి కోర్టు తరువాయి 2లో

## కేజ్రీవాల్‌ను చంపడానికి

# బిజెపి పాలకుల కుట్ర

### 'ఉలుగులన్ న్యాయ్ మహార్యాలీ'లో సునీతా కేజ్రీవాల్ విమర్శలు



**రాంచి :** బిజెపికి వ్యతిరేకంగా ఇండియా కూటమి జార్ఖండ్‌లోని రాంచీలో మెగా ర్యాలీ నిర్వహించింది. 'ఉలుగులన్ న్యాయ్ మహార్యాలీ' పేరుతో జార్ఖండ్ ముక్తి మోర్చా ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. జెఎంఎం అధినేత శిబు సోరెన్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, బీహార్ మాజీ డిప్యూటీ సిఎం తేజస్వీ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ బిజెపిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిం చారు. తన భర్తను తీహార్ జైలులో అంతమొందించేందుకు కాషాయ పాలకులు కుట్ర పన్నారని ఆమె సంచలన వ్యాక్యలు చేశారు. ఆప్ చీఫ్ తీసుకునే భోజనాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారన్నారు. కేజ్రీవాల్ తీసుకునే ఆహారాన్ని పసిగట్టేందుకు కెమెరాలను ఏర్పాటు చేశారని, ఢిల్లీ సిఎం కదలికలను అధికారులు పసిగడుతున్నారని ఆమె ఆరోపిం చారు. కేజ్రీవాల్ తీసుకునే ఆహారాన్ని పర్యవేక్షిస్తున్నారని, ఇది సిగ్గుచేటని ఆమె వ్యాఖ్యానించారు. మధుమేహంతో బాధపడుతూ 12 ఏండ్ల నుంచి రోజూ ఇన్సులిన్ తీసుకుంటున్న కేజ్రీవాల్‌కు జైల్‌లో ఇన్సులిన్‌ను నిరాకరిస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ సిఎంను చంపేయాలని వారు కోరుకుంటున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాంచీలో జరిగిన ఇండియా కూటమి మెగా ర్యాలీని ఉద్దేశించి సునీతా కేజ్రీవాల్ మాట్లాడారు. ఢిల్లీ సిఎం, జార్ఖండ సిఎం హేమంత్ సొరెన్‌లను తప్పు చేశారని తేలకుండానే వారిని జైల్లో పెట్టడం నియంతృత్వాన్ని తలపిస్తోందని సునీతా కేజ్రీవాల్ విమర్శించారు. తన భర్త చేసిన తప్పేమిటని ఆమె నిలదీశారు. మెరుగైన విద్యా, వైద్య సౌకర్యాలు సమకూర్చడమే ఆయన చేసిన తప్పా అని సునీతా కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఢిల్లీ ప్రజల కోసం కేజ్రీవాల్ తన జీవితాన్ని పణంగా పెట్టారని, ఐఐటీ గ్రాడ్యుయేట్ అయిన కేజ్రీవాల్ తలుచుకుంటే విదేశాలకు వెళ్లారని, కానీ ఆయన దేశభక్తికే మొగ్గుచూపారని చెప్పారు.

ప్రభుత్వాలను కూలదోసే కుట్ర :కల్పనా సోరెన్

వివిధ రాష్ట్రాల్లోని బిజెపియేతర తరువాయి 2లో

### కేజ్రీవాల్, సోరెన్ పేర్లతో ఖాళీ కుర్చీలు




ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ మాజీ సిఎం హేమంత్ సోరెన్ అరెస్టును నిరసిస్తూ ఇండియా కూటమి వినూత్నంగా నిరసన తెలిపింది. మెగా ర్యాలీలో 28 ప్రతిపక్ష పార్టీలు పాల్గొన్నాయి. జెఎంఎం కార్యకర్తలు సోరెన్ మాస్కులు ధరించి వచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోరెన్‌ను జనవరి 31న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) భూకుంభకోణానికి సంబంధించిన కేసులో అరెస్టు చేసింది. మార్చి 21న ఇడి ఢిల్లీ మద్యం కుంభకోణంలో సిఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. వారి అరెస్టుకు వ్యతిరేకంగా.. 'జైలు కా తాలా తూటేగా, హేమంత్ సోరెన్ చుటేగా' (జైలు తాళం పగలగొడతాం. హేమంత్ సోరెన్‌ను విడుదల చేస్తారు), 'జార్ఖండ్ జుకేగా నహీ' (జార్ఖండ్ తలవంచదు)' వంటి నినాదాలు చేశారు.

## బిజెపి, బిఆర్‌ఎస్‌ను

# బొందపెడదాం...

### కమ్యూనిస్టులు కలిసిరావాలి

### ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తా..

### భువనగిరి సభలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/యాదాద్రి ప్రతినిధి



ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలను బొందపెట్టడానికి కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో కలిసిరావాలని పిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి భువనగిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు సందర్భంగా భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన రోడ్‌షో కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. పార్లమెంటు వ్యవస్థలను, ప్రభుత్వ వ్యవస్థలను విధ్వంసం చేస్తున్న మోదీకి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. భువనగిరి పార్లమెంటు బిఆర్‌ఎస్ అభ్యర్థిగా క్యామ మల్లేశ్‌ను ముందు పెట్టి వెనుక నుండి బూర నర్సయ్య గెలుపు కోసం మాజీ సిఎం కెసిఆర్ బూర ఊదుతున్నాడన్నారు. తెరవెనుక గూడుపుటాని నడుపుతూ గొల్లకురుమలను కెసిఆర్ మోసం చేస్తున్నాడన్నారు. రాష్ట్ర అవతరణను తప్పుపట్టిన బిజెపికి తెలంగాణలో ఓట్లు అడిగే అర్హతలేదన్నారు. ఆగస్టు 15లోగా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని, యాదాద్రి లక్ష్మి నర్సింహ్మస్వామి సాక్షిగా మాటా ఇస్తున్నానని వెల్లడించారు. మూడు లక్షల మెజార్టీలో చామల కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపిస్తే గంధమల్ల, బ్రాహ్మణ వెల్లెంల, ఎస్ఎల్‌బిసి, బస్వాపూర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేసి మురికి నుండి విముక్తి చేస్తామన్నారు. కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి, వెంకట్‌రెడ్డిలు భువనగిరికి డబుల్ ఇంజిన్‌లాంటివారని పొగడ్తలతో ముంచెత్తారు. కోమటిరెడ్డి బ్రదర్స్ దొరగారి దొడ్లో దొరకు సారాలో సోడా పోసి రాజకియాల్లోకి రాలేదన్నారు. రక్తాన్ని చమటగా మార్చి భుజాలు కాయలు కాసేలా మూడు రంగుల జెండాను మోసి రాజకియాల్లో పైకి వచ్చారని వివరించారు. తన తోపాటు తరువాయి 2లో

### కాంగ్రెస్‌కే సిపిఐ మద్దతు : పల్లా

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుండి పోటీ చేస్తున్న చామల కిరణ్ కుమార్‌రెడ్డికి సిపిఐ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ పార్లమెంటు నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహించిన రావి నారాయణరెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, సురవరం సుధాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వారసుడిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకురావడానికి సిపిఐ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని వివరించారు.

# ఆలోచనా రాహిత్యం

### విజయన్‌పై రాహుల్ వ్యాఖ్యలను ఖండించిన సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా



**వాయనాడ్:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై కాంగ్రెస్ నాయకుడు, వాయనాడ్‌లో యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) లోక్‌సభ అభ్యర్థి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఆయన ఆలోచనా రాహిత్యానికి నిదర్శనమని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా వ్యాఖ్యానించారు. వాయనాడ్‌లో సిపిఐ అభ్యర్థిగా బరిలోకి దిగిన అన్నీ రాజాకు మద్దతుగా ప్రచారానికి వచ్చిన రాజా మీడియాతో మాట్లాడుతూ, విజయన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేయాలని రాహుల్ డిమాండ్ చేయడం దురదృష్టకరమని అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా రాహుల్‌కు సూచనలు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌కు హితవు పలికారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, జార్ఖండ్‌కు అప్పటి ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను ఇడి అరెస్టు చేసిన సమయంలో విజయన్‌ను అరెస్టు చేయాలని రాహుల్ సూచించడం అనుచితమని వ్యాఖ్యానించారు. ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, 2019 ఎన్నికల్లో రాహుల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన మంత్రి అభ్యర్థి అయినప్పటికీ, ఈసారి ఎన్నికల్లో మాత్రం కాదని రాజా స్పష్టం చేశారు. ప్రతిపక్ష తరువాయి 2లో

# నాలుగు రోజులు వర్షాలు

### జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న నాలుగు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఆదివారం, సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిసే అవకాశం ఉందని వివరించారు. సోమవారం నుంచి మంగళవారం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు నిజామాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డిలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. బుధవారం నుంచి గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్‌తో పాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశారు.



## ఖమ్మం, సూర్యాపేటలో గాలివాన బీభత్సం

### పలు చోట్ల వడగండ్లు : నేల కూలిన చెట్లు

ప్రజాపక్షం/ ఖమ్మం/సూర్యాపేట

అప్పటి వరకు భగభగలాడిన సూర్యుడు సాయంత్రానికి ఒక్కసారిగా చల్లబడ్డాడు. పెను గాలులతో కూడిన వర్షం తీవ్ర ఇబ్బందులు పెట్టింది. ఈ వర్షం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మంజిల్లా వ్యాప్తంగా కురిసింది. ఖమ్మం ఏజెన్సీలో వడగండ్లు పడ్డాయి. ఇల్లందు, కొత్తగూడెం, పినపాక ప్రాంతాల్లో గాలి తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, వైరా, ఖమ్మం రూరల్ ప్రాంతాల్లో సైతం గాలి దుమారానికి చాలా చోట్ల ఇండ్ల పై కప్పులు లేచిపోయాయి. అక్కడక్కడ మిర్చి, ధాన్యం తడిసిపోయాయి. అనుకోకుండా వర్షం రావడంతో రైతులు రక్షణ చర్యలు చేపట్టే లోపే ఏజెన్సీ ప్రాంతంలో మిర్చి తడిసిపోయింది. పలు చోట్ల ధాన్యం కూడా తడిసింది. ఆదివారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే తరువాయి 2లో

## 24న ఇంటర్ ఫలితాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇంటర్మీడియట్ ఫలితాలను ఈనెల 24న ఉదయం 11 గంటలకు ప్రకటించనున్నారు. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం పరీక్ష ఫలితాలను విద్యార్థులు ఇంటర్ బోర్డు అధికారిక వెబ్ సైట్ tsbie.cgg.gov.inలో చూసుకోవచ్చని తెలిపింది. ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 9,80,978 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మార్చి 10 నుంచి మూల్యాంకన ప్రక్రియను ప్రారంభించారు.


08

## బిఆర్‌ఎస్, బిజెపికి డిపాజిట్లు గల్లంతు

# ఇసుక తోడేళ్లు

### ఏజెన్సీలో ఇసుక మాఫియాకు తిరుగులేదా?

### అభయారణ్య పరిధిలో ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలు



ప్రజాపక్షం/ఏటూరు నాగారం

ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాలైన ఏటూరు నాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, మండలాలలోని ఆయా గిరిజన గ్రామాలలో ప్రజల అమాయకత్వం ఆసరా చేసుకుని, ఇసుక మాఫియా ఇష్టా రాజ్యాంగ రాజ్యమేలుతోంది. ఇసుక రీచ్‌ల మంజూరుకు అధికారులకు ముడుపులు ముట్ట చెప్పడం కోసం రేసింగ్ కాంట్రాక్టర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. అధికారులకు డబ్బులు ఎర చూపి వన్యప్రాణులకు ప్రాణహాని ఉన్నప్పటికీ ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక మైనింగ్ దందా కొనసాగిస్తున్నారు.

**అడుగంటుతున్న భూగర్భ జలాలు :** గిరిజన సొసైటీల పేరుతో అనుమతులు పొంది నేరుగా గోదావరిలో రోడ్లు వేసి రాత్రిపూట భారీ యంత్రాలతో టిప్పర్ల ద్వారా ఇసుకను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తూ రేజింగ్ కాంట్రాక్టర్లు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అధికారులు అక్రమ ఇసుక రవాణాను ప్రోత్సహిస్తూ పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. భారీ యంత్రాలతో ఇసుక తోడటం ద్వారా. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, బోరు బావుల నుండి చుక్కనీరు రావడంలేదని ఆయా గ్రామాల రైతులు బోరున విలపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో లారీ నుండి 3500 నుండి రూపాయలు ఐదువేల వరకు వసువులు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. డంపింగ్ చేసుకోవడానికి ఎలాంటి అనుమతులు లేకపోయినా అక్రమంగా డంపింగ్ చేస్తూ తవ్వకాలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

**ఎకో సెన్సిటివ్ జోన్ వర్తించదా :** వన్య ప్రాణులకు హాని కలిగించే అభయారణ్యం పరిధిలో ఏ సెన్సిటివ్ జోన్ నిబంధనలు పాతరేసి తప్పుడు పత్రాలతో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ ప్రశ్నించిన తరువాయి 8లో

# గాజాపై దాడులు

### 22 మంది పాలస్తీనియన్లు మృతి



**రఫా (గాజా స్ట్రిప్):** దక్షిణ గాజా నగరమైన రఫాపై ఇజ్రాయెల్ ఆదివారం తెల్లవారు జామున జరిపిన దాడిలో 22 మంది పౌరులు మృతి చెందినట్టు పాలస్తీనా ఆరోగ్య అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది పిల్లలు ఉన్నట్టు సమాచారం. తన సన్నిహిత మిత్ర దేశమైన ఇజ్రాయెల్‌కు బిలియన్ డాలర్ల అదనపు సైనిక సాయాన్ని అందించడానికి అమెరికా నిర్ణయించిన కొన్ని గంటల్లోనే ఈ దాడులు జరగడం గమనార్హం. గాజా జనాభాలు సగానికిపైగా, దాదాపు 2.3 మిలియన్ల మంది రఫాలోనే ఉంటున్నారు. ఈ నగరంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేసింది. సంయమనం పాటించాలని అంతర్జాతీయ సమాజం కోరుతున్నప్పటికీ ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదు. పైగా ఈజిప్టు సరిహద్దుల వరకూ దాడులను విస్తరింప చేయాలన్న పట్టుదలతో ఉన్నట్టు కనిపిస్తున్నది. అమెరికా హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ శనివారం ఇజ్రాయెల్‌కు 26 బిలియన్ తరువాయి 8లో

# ప్రపంచం

# నెతన్యాహు నాటకం



పాలస్తీనా ఉనికి లేకుండా చేసే లక్ష్యంతో, గాజా స్ట్రిప్‌పై ముమ్మర దాడులకు ఉపక్రమించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుకు అమెరికా సంపూర్ణ మద్దతు ఉన్నదనేది బహిరంగ రహస్యం. అమెరికా హౌస్ ఆఫ్ రిప్రజెంటెటివ్స్ కూడా ఇజ్రాయెల్‌కు భారీ మద్దతుగా భారీ ప్యాకేజీని ఆమోదించింది. నైతికంగా, సైనిక పరంగా, ఆర్థికంగా అండగా నిలిచిన అమెరికాను చూసుకొని ఇజ్రాయెల్ రెచ్చిపోతున్నదనేది బహిరంగ రహస్యం. అయితే, సంయమనం పాటించాలంటూ అమెరికా ఓ కంటితుడుపు ప్రకటన చేయడం, అది తమను హెచ్చరించినట్టుగానే భావించాల్సి వస్తుందని నెతన్యాహు ప్రకటించడం ఒక గొప్ప నాటకాన్ని తలపిస్తున్నది. హమాస్ ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించుకోవడానికి కృత నిశ్చయంతో ఉన్నామని, తమకు ఆంక్షలు విధించడం సరికాదని నెతన్యాహు ఆదివారం చేసిన ప్రకటన వెనుక కూడా అమెరికా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారంటూ ఇజ్రాయెల్ సైనికులను అమెరికా హెచ్చరించింది. కదలికలపై ఆంక్షలు విధిస్తున్నట్టు ప్రకటించింది. అయితే, ఈ మొత్తం వ్యవహారం చూస్తుంటే, ఇజ్రాయెల్‌కు అమెరికా ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించడమే లక్ష్యంగా కనిపిస్తున్నది. మొత్తం మీద అమెరికా నుంచి మద్దతు పొందుతూనే, తమ సైనికులపై ఆంక్షలు విధించడం అన్యాయమని ప్రకటనలు చేయడం ద్వారా నెతన్యాహు ఈ నాటకాన్ని బాగానే రక్తికట్టించారు. అమెరికా ఆంక్షలు ఒక నాటకం.. నెతన్యాహు స్పందన ఒక బూటకం అనడానికి గాజా స్ట్రిప్‌పై ఆదివారం తెల్లవారు జామున జరిగిన వైమానిక దాడులే నిదర్శనం.

# ఎట్టకేలకు మాల్దీవ్స్‌లో ఎన్నికలు



మాల్దీవ్స్ పార్లమెంటరీ ఎన్నికలు ఆదివారం ముగిశాయి. వాస్తవానికి ఈ ఏడాది మార్చి 17న ఈ ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే, దేశాధ్యక్షుడు మహమ్మద్ ముయిజు వాయిదా వేశారు. ‘పీపుల్స్ మజ్లిస్’ (పార్లమెంటు) ఆమోద ముద్ర కూడా వేయించుకోగలిగారు. ఇటీవల భారత్‌తో తలెత్తిన విభేదాలు, చైనాకు అనుకూలంగా తీసుకుంటున్న నిర్ణయాలతో ముయిజు అందరి దృష్టినీ ఆకర్షించారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. నిజానికి గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో చైనా అనుకూల మాజీ అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్‌కు ప్రాక్సీగా 45 ఏళ్ల ముయిజు గెలిచారు. అవినీతి ఆరోపణలపై యమీన్‌కు 11 సంవత్సరాల జైలు శిక్ష పడడంతో, ముయిజుకు అవకాశం వచ్చింది. అనుకోకుండా వచ్చిన ఈ అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేశారు. దేశాన్ని లగ్జరీ టూరిస్టు స్పాట్‌గా తీర్చిదిద్దేందుకు చైనా సాయం తీసుకున్నారు. 1,192 చిన్న పగడపు దీవులతో, భూమధ్యరేఖపై 800 కిలోమీటర్లు (500 మైళ్లు) మేర మాల్దీవ్స్ విస్తరించి ఉంది. భారతీయులు వేలాదిగా అక్కడికి విహారయాత్ర నిమిత్తం వెళతారు. ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ లక్షద్వీప్‌లో పర్యటించి, అక్కడ బీచ్‌లో దిగిన ఫొటోలను ‘ఎక్స్’లో పోస్టు చేయడం వివాదానికి కారణమైంది. ప్రకృతి అందాలతో కూడిన లక్షద్వీప్‌ను తిలకించేందుకు తరలి రావాలని మోదీ పిలుపునివ్వడంతో, మాల్దీవ్స్ అధ్యక్షుడు ముయిజు తీవ్రంగా స్పందించారు. భారత సైన్యాన్ని వెనక్కు పంపాలని నిర్ణయించారు. గత అధ్యక్షుడు ఇబ్రహీం మొహమ్మద్ సొలి భారత్ అనుకూల విధానాన్ని కొనసాగిస్తే, ముయిజు చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఆదివారం నాటి పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఎవరికి అనుకూలంగా ఓటు వేస్తారో చూడాలి.

# అమెరికా రూటే వేరు



అమెరికా చెప్పేదొకటి.. చేసేదొకటి. ఒకవైపు ప్రపంచ శాంతి మంత్రం పఠిస్తూనే, మరోవైపు యుద్ధాలను పెంచి పోషిస్తున్నది. రష్యాతో తలపడేందుకు ఉక్రేన్‌కు అన్ని రకాల ఆయుధాలను సమకూరుస్తున్నది. ఆర్థిక సాయాన్ని కూడా అందిస్తూ, ఆ దేశాన్ని తన గుప్పిట్లో ఉంచుకుంది. ఇజ్రాయెల్ విషయంలోనూ అమెరికా అదే సూత్రాన్ని అనుసరిస్తున్నది. మధ్య ప్రాచ్యంలో శాంతి స్థాపన జరగాలంటూ ప్రకటనలు గుప్పిస్తున్న జో బైడెన్ ప్రభుత్వం, అటు ఉక్రేన్‌కు, ఇటు ఇజ్రాయెల్‌కు ఆయుధాలతోపాటు ఆర్థిక సాయం కూడా అందిస్తున్నది. యుద్ధాలు ఎప్పటికీ కొనసాగుతూ ఉంటేనే తన ఆయుధ వ్యాపారం సక్రమంగా సాగుతుందనే అమెరికా ఆంతర్యం స్పష్టమవుతున్నది. తాజాగా, ఈ రెండు దేశాలకు ఆర్థిక ప్యాకేజీని అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. పాలస్తీనాకు న్యాయం జరగాలని, గాజా స్ట్రిప్‌లో పౌరులపై దాడులు అన్యాయమని పేర్కొంటూ, ఇజ్రాయెల్‌కు చేసిన సూచనలు, హెచ్చరికలు నామమాత్రమే. వాస్తవానికి పాలస్తీనా పట్ల అమెరికాకు ఎలాంటి సానుభూతిగానీ, అక్కడ నెలకొన్న పరిస్థితుల పట్ల సానుకూల స్పందనగానీ లేవు. ఐక్యరాజ్య సమితి సభ్యత్వం కోసం పాలస్తీనా చేసుకున్న బిడ్‌ను వీటో చేయడం అమెరికా తన వాస్తవ రూపాన్ని బయటపెట్టింది. ఇజ్రాయెల్ దాడులతో అల్లాడిపోతున్న పాలస్తీనాకు ఐక్యరాజ్య సమితి అండ కూడా లేకుండా చేయడమే అమెరికా ఆంతర్యం. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితిలో ‘నాన్‌మెంబర్ అబ్జర్వర్ స్టేట్’ (సభ్యత్వం లేని పరిశీలక రాజ్యం)గా పాలస్తీనా కొనసాగుతున్నది. సమితిలో 194వ దేశంగా సభ్యత్వం పొందడానికి పాలస్తీనా చేసుకున్న విజ్ఞప్తికి దాదాపు 140 దేశాలు అనుకూలంగా ఉన్నాయి. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించాయి. అత్యధిక దేశాల మద్దతు లభించిన నేపథ్యంలో, పాలస్తీనాకు సమితిలో సభ్యత్వం సులభంగానే వస్తుంది. అందుకే, ఆ ప్రతిపాదనను అమెరికా వీటో చేసింది. చైనా, ఫ్రాన్స్, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్, నార్త్ ఐర్లాండ్)తోపాటు అమెరికాకు కూడా ఐక్యరాజ్య సమితిలో వీటో అధికారం ఉంది. ఏదైనా ప్రతిపాదనను, ఎలాంటి కారణం చూపించకుండానే తిరస్కరించే అధికారం ఈ దేశాలకు ఉంది. ఆ అస్త్రాన్ని పాలస్తీనాకు వ్యతిరేకంగా ప్రయోగించిన అమెరికా, మధ్య ప్రాచ్యంలో శాంతి, గాజా స్ట్రిప్‌లో పౌరులకు భద్రత వంటి ప్రకటనలు చేయడం విడ్డూరం. స్వార్థాన్ని కూడా ప్రపంచ హితంగా ప్రకటించుకుంటున్న అమెరికా రూటే వేరు.





# పాకిస్తాన్ అతలాకుతలం



ఇప్పటికే ఆర్థికంగా కుంగిపోయి, సాయం కోసం ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వైపు ఆశగా ఎదురుచూస్తున్న పాకిస్తాన్‌కు మరో సమస్య వచ్చిపడింది. ప్రకృతి విలయం ఆ దేశాన్ని అతలాకుతలం చేస్తున్నది. ఈ నెల ప్రారంభం నుంచే విపరీతమైన వాతావరణ మార్పులు పాక్‌ను అల్లాడిస్తున్నాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఆస్తి నష్టం భారీగానే ఉంది. వ్యవసాయ భూములు ధ్వంసమయ్యాయి. ఈ సాధారణం కంటే భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఈ ఒరవడి మరికొంత కాలం కొనసాగుతుందని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పర్వత ప్రాంతాల వాయువ్య ప్రావీన్స్‌లోని అనేక జిల్లాల్లో హిమానీనదాలు కరిగిపోతున్నందున్నాయి. దీనితో వరద ప్రమాదాలు వచ్చిపడతాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికను జారీ చేశారు. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని కూడా వారు సూచించారు. వర్షాల కారణంగా గత వారం రోజుల్లో 33 మంది చిన్నారులుసహా 59 మంది ప్రాణాలు కోల్పోయారు. కనీసం 2,875 ఇళ్లు, 26 పాఠశాలలు పాక్షికంగా లేదా పూర్తిగా ధ్వంసమయ్యాయి. బెలూచిస్థాన్‌లోని నైరుతి ప్రావీన్స్ కూడా వర్షాల కారణంగా దెబ్బతిన్నది. 2022లో కూడా ఇదే విధంగా భారీ వర్షాలకు, వరదలు పోటెత్తడంతో 1,739 మంది మరణించారు. వరదల వల్ల 30 బిలియన్ డాలర్ల నష్టం కూడా జరిగింది. కాగా, ప్రస్తుతం ఆందోళన కరమైన పరిస్థితులు నెలకొండగా, వర్షాకాలం జూన్‌లో మొదలుకానున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు ముంచుకొస్తాయోనన్న ఆందోళన ప్రజలను వెంటాడుతున్నది.

## 11 చోట్ల నేడు రీపోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

శూన్యమని, లెక్కలోకి తీసుకోలేదని వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఈ రీపోలింగ్ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఖురాయ్ నియోజకవర్గంలోని మొయిరంగ్‌కంపు సాజేబ్, తొంగమ్ లైకై, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని క్షేత్రీగావ్‌లో నాలుగు, థోంగ్జులో ఒకటి, ఉరిపోక్‌లో మూడు, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని కొంతౌజామ్‌లో ఒక పోలింగ్ స్టేషన్లలో రీపోలింగ్ జరగనుందని వెల్లడించారు. కాగా లోక్‌సభ తొలి దశలో భాగంగా శుక్రవారం మణిపూర్‌లోని ఇన్నర్ మణిపూర్, ఔటర్ మణిపూర్ స్థానాల్లో 72 శాతం పోలింగ్ నమోదయింది. అయితే కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. మొత్తం 47 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నది. ఇన్నర్ మణిపూర్‌లో 36 చోట్ల, ఔటర్ మణిపూర్‌లో 11 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ చేయాలని ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసింది.

## ఆలోచనా రాహిత్యం

(మొదటి పేజీ తరువాయి)

‘ఇండియా’ కూటమి ఇంకా ప్రధాని అభ్యర్థిని ఖరారు కాలేదని అన్నారు. బిజెపిని గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఒకే వేదికపైకి వచ్చాయని, అయితే, రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా నిర్ణయించడంగానీ, ప్రకటించడంగానీ జరగలేదని రాజా చెప్పారు. ‘ఇండియా’ కూటమిలోనే ఉన్న సిపిఎం నాయకుడు, కేరళ ముఖ్యమంత్రి విజయన్‌ను అరెస్టు చేయాలని అదే బ్లాక్‌కు చెందిన రాహుల్ ఏ విధంగా డిమాండ్ చేస్తారని అడగ్గా, దానిని చాలా విస్తృత దృష్టికోణాన్ని కలిగిన ప్రశ్నగా రాజా అభివర్ణించారు. సార్వత్రిక ఎన్నికల్లో, కేరళలో సిపిఐ, కాంగ్రెస్ పరస్పరం తలపడడంపై ప్రశ్నించగా, ఇది యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్ మధ్య జరుగుతున్న పోరుగా పేర్కొన్నారు. ఎన్‌డిఎ, ‘ఇండియా’ కూటమికి సంబంధం లేదని వ్యాఖ్యానించారు. ఉత్తర భారతంలో పట్టుకోల్పోతున్న ఎన్‌డిఎ ఇప్పుడు దక్షిణ భారత దేశం వైపు చూస్తున్నదని అన్నారు. ఆ ప్రయత్నాలను అడ్డుకుంటామని రాజా స్పష్టం చేశారు.

## ఎనిమిది మంది మృత్యువాత

(మొదటి పేజీ తరువాయి)

అశోక్ (24), హేమరాజ్ (33), రవిశంకర్ (25), రాహుల్ (20)గా గుర్తించారు. వీరంతా జాలవర్ జిల్లా ఎక్లేరా గ్రామం బంగారి మోహల్లాకు చెందిన వారని సందీప్ చెప్పారు. కాగా, ప్రమాదం అనంతరం ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. ప్రమాదమంలో కారు నుజ్జునుజ్జు అయినట్లు డిఎస్‌పి హేమంత్ గౌతమ్ పేర్కొన్నారు. దాదాపు 35–40 బరాతీలు దంగ్రీ నుంచి మూడు ఒమ్మి కార్లు, రెండు పికప్ వాహనాల్లో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత 12.30 గంటలకు బయలుదేరారని బాధితుల బంధువు గోపాల్ బగారి తెలిపారు. మార్గమధ్యలో ఖమ్చి గ్రామంలో టీ తాగేందుకు రోడ్డుపక్కన కారును ఆపామని, మరో కారు అక్కడి నుంచి వెల్లిపోయిందన్నారు. దాదాపు 10 నిమిషాల తరువాత తాము కూడా బయలుదేరామని, ఆ తరువాత కొన్ని నిమిషాల తరువాత దాదాపు 2.15 గంటలకు పచాలో గ్రామం సమీపంలో ముందు వెళ్లిన కారు ప్రమాదానికి గురై నుజ్జునుజ్జు అయిందన్నారు. అప్పటికే స్థానికులు కారు వెనుక డోర్ తెరిచి గాయపడిన వారిని వెలికి తీశాయరని, అందులో ఐదుగురిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, మరో నలుగురిని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా, అందరూ మృతి చెందారన్నారు.

**ఛత్తీస్‌గఢ్‌లో బస్సు బోల్తా**

ఛత్తీస్‌గఢ్ బస్తర్ జిల్లాలో ఆదివారం ఓ బస్సు బోల్తా పడింది. ప్రమాదంలో ఎన్నికల విధుల్లో ఉన్న మధ్యప్రదేశ్‌కు చెందిన పంది మంది పోలీసులు గాయపడినట్లు ఓ సీనియర్ అధికారి చెప్పారు. గీడం–జగదాల్‌పూర్ రోడ్డుపై ఉన్న కాయికోట్ గ్రామ సమీపంలో ప్రమాదం జరిగిందన్నారు. బస్తర్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించి ఆ తరువాత అక్కడి నుంచి గరిబంద్‌లోని మహసముంద నియోజకవర్గంలో డ్యూటీ చేసేందుకు వెళ్తున్నారన్నారు.

## లోక్‌సభ ఎన్నికల్లో మద్దతునివ్వాలని కోదండరామ్‌ను కోరిన నీలం మధు





ప్రజాపక్షం/హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో తనకు మద్దతునివ్వాలని కాంగ్రెస్ మెదక్ ఎంపి అభ్యర్థి నీలం మధు టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను కోరారు. ఈ మేరకు మధు హైదరబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో కోదండరామ్‌ను ఆదివారం కలిసి మద్దతు కోరారు.అందుకు కోదండరామ్ స్పందిస్తూ త్వరలోనే మెదక్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ప్రజాసంఘాలన్నింటిన సమన్వయం చేసి,ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు ధర్మార్జున్, అంబటి శ్రీనివాస్, భైరి రమేష్, రమేష్ ముదిరాజ్, హనుమంత్‌రెడ్డి, పల్లె వినయ్ కుమార్, సర్దార్‌వినోద్ కమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట వరకు

(మొదటి పేజీ తరువాయి)

ఖమ్మం, 30న తల్లాడ, కొత్తగూడెం, మే 1న మహబూబాబాద్, మే 2న జమ్మికుంట, 3వ తేదీన రామగుండం, 4న మంచిర్యాల, 5న జగిత్యాల, 6వ తేదీన నిజామాబాద్, 7న కామారెడ్డి, మెదక్, 8న నర్సాపూర్, పటాన్ చెరువు,9 వ తేదీన కరీంనగర్, 10న సిరిసిల్లాతో పాటు సిద్దిపేటలో రోడ్ షో, బహిరంగ సభల్లో కెసిఆర్ పాల్గొననున్నారు.

## గాలివాన బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

సూర్యుడు భగభగలాడాడు. తీవ్రమైన ఉక్కపోత, వడగాలికి ప్రజలు అల్లాడారు. సాయంత్రం ఐదు గంటల వేళ ఒక్కసారిగా వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. భయంకరమైన గాలి దుమారంతో వర్షం కురిసింది.

సూర్యాపేటలో నేలకొరిగిన భారీ వృక్షాలు

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఒక్కసారిగా వాతావరణం మారింది. ఆకాశమంత కారుమబ్బులు కమ్మి ఈదురుగాలులు పెద్ద ఎత్తున వీచి బీభత్సం సృష్టించాయి. ఓ పక్కా గాలులు.. మరో పక్కా వర్షం కురిసింది. దాదాపు అర్ధగంటకుపైగా ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రజలను అతలాకుతలం చేసింది. పట్టణంలోని రహదారుల వెంట ఉన్న వృక్షాలు నేలకొరిగాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరగడంతో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమై సూర్యాపేట పట్టణంలో విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. సాయంత్రం 5గంటల నుండి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పట్టణం అంధకారంగా మారింది. అకాల వర్షంతో నల్లగొండ పట్టణంతో చుట్టుపక్కల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయానికి ఉంచిన వరి ధాన్యం తడవడంతో రైతులు కొంత ఇబ్బందులు పడ్డారు. ఒకేసారి వర్షం రావడంతో ధాన్యంపై టార్ఫాలిన్లు కప్పడానికి ప్రయత్నించినప్పటికీ భారీ వర్షం రావడంతో కొంతమేరకు ధాన్యం తడిసింది. ఏదేమైనా వర్షం పడటంతో చల్లదనం వచ్చిందని ప్రజలంతా ఉపశమనం పొందుతున్నారు.



## జర్నలిస్ట్ శ్రీనివాస్‌ను పరామర్శించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కారులో ఢిల్లీకి వెళ్లుతున్న సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ రావు(టివి 5), గోపి(స్వతంత్ర టివి) శనివారం రాత్రి మధ్యప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వారిని మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. గోపి స్వల్ప గాయాలతో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. శ్రీనివాస్ రావుకు బలమైన గాయాలు తగలడంతో చికిత్స పొందుతున్నారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నేత కె.విరాహత్ అలీలు యశోద ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాస్ రావును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యులకు మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

## బిఆర్‌ఎస్‌ను బొందపెడదాం...

(మొదటి పేజీ తరువాయి)





ఎవరికైనా ముఖ్యమంత్రి పధవికి అర్హత ఉందంటే అది కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికే ఉందని సంచలన వాఖ్యలు చేశారు.

**తెలంగాణ మీ అయ్య జాగీరా : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దింపుతామని అనడానికి బచ్చాగాడు కెటిఆర్‌కు బుద్ధిలేకున్నా కట్టెపట్టుకుని తిరుగుతున్న ఆయన తండ్రి కెసిఆర్‌కైనా బుద్ధి ఉండాలి కదా.. తెలంగాణ మీ అయ్య జాగీరా ఎట్లా దింపుతార్రా అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణలో బిఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే బిజెపి వేసినట్లు అని, బిఆర్‌ఎస్, బిజెపి వేరు వేరు కాదు రెండు ఒక్కటే అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి తెలంగాణకు విముక్తి కల్పించిన రావి నారాయణరెడ్డి నడియాడిన గడ్డ మీద మతోన్మాద పార్టీని మట్టికరిపించి కాంగ్రెస్ జెండా ఎగరవేద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కుడివైపు మంత్రి వెంకట్‌రెడ్డి, ఎడమవైపు రాజగోపాల్‌రెడ్డిలు భుజస్తంభాలుగా నిలబడడంతో కాంగ్రెస్ విజయాన్ని ఆపడం ఇంకెవరితరం కాదని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. భువనగిరి బహిరంగ సభ సాక్షిగా ఇక ఆట మొదలైందని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కాచుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. బతుకమ్మకు బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకుంటున్న కవితమ్మ వచ్చే ఏడాది బతుకమ్మ పండుగను జైల్లో జరుపుకుంటుందా అని ఎద్దేవా చేశారు.

**భువనగిరి సమస్యలు పార్లమెంట్‌లో వినిపిస్తా : చామల**

భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సమస్యలను పార్లమెంటులో గలమెత్తి వినిపించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. బిజెపి మోసపూరిత సోషల్‌మీడియా యూనివర్సిటీ నుండి వస్తున్న అసత్యప్రచారాన్ని తిప్పికొడదామన్నారు. బిజెపికి బూతుల్లో కూర్చునే నాయకులే కరువుకాగా బిఆర్‌ఎస్ పార్టీ నుండి పోటీ చేయడానికి బీఫాంలు తీసుకున్న నాయకులు చెత్తడబ్బాల్లో బీఫాంలు పడేసి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, మల్‌రెడ్డి రంగారెడ్డి, డిసిసి అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, కొమ్మూరి ప్రతాపరెడ్డి, మాజి జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, తంగళ్లపల్లి రవికుమార్, మహ్మద్ నజీర్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, వల్లందాస్ ఆదినారాయణ, రాసాల నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పాలకుల కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాలను కూలదోసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కుట్ర పన్నుతున్నారని జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ ధ్వజమెత్తారు. భూ కుంభకోణం ఆరోపణలపై జనవరి 31న హేమంత్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం జైల్లో ఉన్న హేమంత్ ‘ఇండియా’ కూటమి ర్యాలీ కోసం పంపిన సందేశాన్ని కల్పన చదివి వినిపించారు. అనంతరం మాట్లాడుతూ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, తన భర్త హేమంత్‌ను అరెస్టు చేయడం వెనుక, ఈ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చే కుట్ర ఉందని వ్యాఖ్యానించారు. ఇడి, సిబిఐ వంటి సంస్థలను కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటున్నదని ఆరోపించారు. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఇంటిదారి పట్టించాలని పిలుపునిచ్చారు. జార్ఖండ్ అసెంబ్లీకి గాండే నియోజకవర్గం నుంచి ఆమె పోటీ చేసే అవకాశం ఉంది. ఆ స్థానానికి మే 20న ఉప ఎన్నిక జరుగుతుంది.

**హేమంత్‌ను భయపెట్టాలనుకున్నారు: ఖర్గే**

ప్రతిపక్షాల ‘ఇండియా’ కూటమి నుంచి బయటకు రావాలని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) నేత, అప్పటి ముఖ్యంమత్రి హేమంత్ సోరెన్‌ను బిజెపి కోరిందని, అందుకు ఆయన నిరాకరించడంతలో భయపెట్టాలని చూసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఆదివారం ఇక్కడ జరిగిన సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఇడి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డు పెట్టుకొని, ప్రతిపక్ష నాయకులను బిజెపి బెదిరిస్తున్నదని అన్నారు. హేమంత్ సోరెన్ ధైర్యవంతుడని, అందుకే బిజెపి బెదిరింపులకు లొంగలేదని వ్యాఖ్యానించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదని అన్నారు. అయోధ్య రామమందిర ప్రతిష్టాపనా కార్యక్రమానికి ఆహ్వానించకుండా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును, తద్వారా గిరిజన జాతిని మోదీ అవమానించారని విమర్శించారు. బిజెపిని గద్దె దించడమే ‘ఇండియా’ కూటమి లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |



## మహారాష్ట్రలో షారుఖ్ ప్రచారం!

ప్రముఖ సినీ నటుడు షారుఖ్ ఖాన్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నాడా? సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోలు, ఫొటోలను చూస్తే ఈ అనుమానం కలగక మానదు. మహారాష్ట్రలోని షోలాపూర్ సెంట్రల్ నియోజకవర్గంలో జోరుగా సాగుతున్న కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో షారుఖ్‌ను పోలికలతో ఉన్న ఇబ్రహీం ఖాద్రీ స్టార్ అట్రాక్షన్‌గా మారాడు. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, పార్టీ అభ్యర్థి ప్రణితి షిండే తదితరుల ఫొటోలతో కూడిన బ్యానర్లు అలంకరించిన వ్యాన్‌లో ఖాద్రీ ప్రజలకు అభివాదం చేస్తూ కనిపించాడు. అచ్చంగా షారుఖ్ మాదిరిగానే ఉన్న అతనిని చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. కాగా, ఈ ఉదంతాన్ని చూసి బిజెపి ఉడుక్కుంది. ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తున్నదని విమర్శించింది. ఒక సినీ ప్రముఖుడి పేరును పరోక్షంగా ఎన్నికల్లో వాడుకోవడం దారుణమని ధ్వజమెత్తింది. బిజెపి విమర్శలు ఎలావున్నా... ఖాద్రీ తన పాత్రను సమర్థవంతంగానే పోషిస్తున్నాడు. ఎన్నికల ప్రచారంలో దూసుకెళుతున్నాడు.

# మోదీ ప్రయత్నం ఫలించేనా?

గతంలో మాదిరి ఈసారి బిజెపి సులభంగా గెలవడం సాధ్యం కాదని ప్రధాని నరేంద్ర మోడీకి స్పష్టమవుతున్నట్టు ఉంది. ‘మోదీ గ్యారంటీ’ అంటూ ఎన్ని హామీలు గుప్పిస్తున్నా, స్పందన అంతం మాత్రంగా ఉండడంతో, మరోసారి ‘మతం’ ఆయుధాన్ని బయటకు తీశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో విపక్షాలను ‘హిందూ వ్యతిరేకులు’, ‘ముస్లిం అనుకూలురు’గా అభివర్ణిస్తూ, మత సెంటిమెంట్‌ను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల పశ్చిమ బఎంగాల్ అమ్రోహాలో జరిగిన బహిరంగ సభలో ఆయన చేసిన ప్రసంగం ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నది. నిజానికి గత పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి ఏమిటో ఆయన ప్రజలకు వివరించారు. సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావించాలి. చేసిన పనులతో పాటు, రాబోయే కాలంలో అనుసరించబోయే ప్రణాళికలను, అభివృద్ధి పథకాలను సూచన ప్రాయంగానైనా ప్రస్తావించాలి. కానీ, ప్రధాని ఈ ప్రయత్నం చేయలేదు. మతపరమైన సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే రీతిలో ప్రసంగించారు. ‘భారత్ మాతా కీ జై’ అని నినాదాలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసినందుకు లోక్‌సభలో అడుగుపెట్టే అర్హత కోల్పోయారని, ముస్లిం అయిన కాంగ్రెస్ అభ్యర్థి, అమ్రోహా సిట్టింగ్ ఎంపి కున్వర్ డానిష్ అలీపై మోదీ ప్రత్యక్ష దాడి చేశారు. ‘భారత్ మాతా కీ జై’ అనడానికి నిరాకరించిన వ్యక్తి పార్లమెంటలో కూర్చోవడం సరైనదేనా?



అలాంటి వ్యక్తి భారత చట్టసభలో ప్రవేశం పొందాలా?’ అని ప్రశ్నించారు. అదే రోజు, ఏడు విడతల ఎన్నికల పర్వంలో తొలి ఘట్టం పోలింగ్ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్నది. అందులో పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో ఎనిమిది స్థానాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ, ప్రధాని ప్రతిపక్ష పార్టీలపై విచిత్రమైన దాడికి దిగారు. తనను ఓడించడానికి కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీసహా ‘ఇండియా’ కూటమిలోని పార్టీలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్‌తోసహా ఆ కూటమిలోని పార్టీలకు హిందూ మతం అంటే గిట్టదని ఆరోపణలు చేశారు. ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి ఈ విధంగా మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే రీతిలో మాట్లాడడం దురదృష్టకరం. అయోధ్యను దక్కించుకున్నామని, ద్వారక, కాశీ మిగిలి ఉన్నాయంటూ, మతపరమైన బిజెపి అజెండాను స్పష్టం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన ప్రసంగం యావత్తు మతం చుట్టూనే చక్కర్లు కొట్టింది. ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చగొట్టే ప్రయత్నం జరిగింది. ఈ ఏడాది జనవరి 22న అయోధ్యలో రామమందిర ప్రారంభం, విగ్రహ ప్రతిష్టకు హాజరుకపోవడాన్ని భయంకరమైన నేరంగా చూపుతూ, కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీలపై నిందారోపణలు చేశారు. ఈ పార్టీలు ముస్లింలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి కాబట్టే, బాల రాముడి ప్రతిష్టాపనకు రాలేదని విమర్శించడం ద్వారా, హిందువుల సెంటిమెంట్‌ను ఆ దిశగా మరల్చేందుకు సర్వశక్తులు ఒడ్డారు. ప్రతిసారీ మతం కార్డుతో లాభపడాలని చూడడం మోదీకి అలవాటుగా మారింది. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటూ, దేశ సంపదను కట్టబెడుతున్న వైనాన్ని ఎవరూ ప్రశ్నించకుండా ఆయన చేస్తున్న ప్రయత్నం ఇది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అస్తవ్యస్తమైన ఆర్థిక విధానాలు దేశాన్ని కుంగదీస్తున్న సమయంలో, కేవలం మతం ప్రాతిపదిక లోక్‌సభ ఎన్నికల్లో గట్టెక్కాలనుకోవాలని మోదీ అత్యాశ. అది నెరవేరడం సాధ్యమా అన్నదే ప్రశ్న.



## నేతిబీరకాయ పార్టీ జెడిఎస్

జనతాదళ్ సెక్యూలర్ (జెడిఎస్)ను నేతిబీరకాయ పార్టీగా పేర్కోవాలి. హిందుత్వ అజెండాతో ముందుకు వెళుతున్న బిజెపితో జతకట్టిన ఈ పార్టీ పేరులో ‘సెక్యూలర్’ అనే పదానికి అర్థం లేకుండా పోయింది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా విఫలమవుతున్న మాజీ ప్రధాని దేవగౌడ పార్టీ, తన ఉనికిని నిలబెట్టుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నది. అయితే, మతం రంగు పులుముకున్న బిజెపి పంచన చేరడం సమస్యకు పరిష్కారం కాదన్నది నిజం. బిజెపితో కలిసి వెళ్లడం వల్ల జెడియు లాభపడుతుందా లేక తనకు ఉన్న వొక్కలిగ సామాజిక వర్గం మద్దతును కూడా కోల్పోతుందా అన్నది ప్రశ్న. కర్నాటక జనాభాలో 14 శాతంగా ఉన్న వొక్కలిగాలపై బిజెపి పట్టు సంపాదించి, జెడియును పక్కకు నెట్టేసుందనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో బలంగా ఉన్నాయి. వొక్కలిగ కమ్యూనిటీ రాష్టంలోని 45 నియోజవర్గాల్లో బలంగా ఉంది. 2018 ఎన్నికల్లో జెడియు వాటిలో 25 స్థానాలను కైవసం చేసుకుంది. అయితే, 2023లో కేవలం 11 స్థానాలకు పరిమితమైంది. వొక్కలిగ సామాజిక వర్గం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటు వేసిందని గత ఏడాది అసెంబ్లీ ఫలితాలు స్పష్టం చేశాయి. లోక్‌సభ ఎన్నికల్లో జెడిఎస్‌ను ఆదరిస్తారా అన్నది అనుమానమే.

## ఎపిలో జోరుగా బెట్టింగ్‌లు!



సార్వత్రిక ఎన్నికలతోపాటు, అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగనున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ (ఎపి)లో బెట్టింగ్‌ల జోరు పెరిగింది. ఏజెన్సీ నివేదికలను అనుసరించి, ఎపి అంతటా ఇప్పుడు ఎన్నికల ఫీవర్ తారస్థాయిలో ఉంది. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికలు.. రాబోయే ఫలితాలపై చర్చలు జరుగుతున్నాయి. పనిలోపనిగా, చాలా మంది పందాలు కాస్తున్నారు. వైఎస్ఆర్‌సిపి మళ్లీ గెలుస్తుందా? జనసేన, బిజెపి, టిడిపితో కూడిన ఎన్‌డిఎ కూటమి అధికార పగ్గాలు చేపడుతుందా? కాంగ్రెస్ పరిస్థితి ఏమిటి? ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? ఇలా ఎన్నో అంశాలపై బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఎన్‌డిఎ కూటమికి వందకు పైగా సీట్లు వస్తాయంటూ ఒకటికి పది రూపాయలు చొప్పున బెట్టింగ్ నడుస్తున్నట్టు తెలుస్తోంది. అయితే, మేజిక్ ఫిగర్‌కు కాస్త అటు ఇటుగా వైఎస్ఆర్‌సిపికి సీట్లు వస్తాయని కొందరు బెట్టింగులు పెడుతున్నారని తెలుస్తోంది. జనశక్తి అధినేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం స్థానంపైన కూడా బెట్టింగ్ జరుగుతున్నట్టు సమాచారం. ముఖ్యంగా పవన్ మెజారిటీపై పందాలు కాస్తున్నారని అంటున్నారు. పులివెందుల నుంచి బరిలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఈసారి మెజారిటీ తగ్గుతుందని కొందరు అంటుంటే, ఆయన గెలుపుపై మరికొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్న నియోజకవర్గాల్లో ఇది కూడా ఒకటి.

## ‘రెండో దశ’కు ఏర్పాట్లు



ఏడు విడతల్లో పూర్తికానున్న సార్వత్రిక ఎన్నికల రెండో దశ పోలింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 26, 13 రాష్ట్రాల్లోని 89 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో పోలింగ్ జరగనుంది. అస్సాంలోని కరీంగంజ్, సిల్చార్, మంగళ్దోయ్, నాగాన్, కలియాబోర్, బీహార్‌లోని కిషన్‌గంజ్, కతిహార్, పూర్ణియ, భాగల్పూర్, ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్, మహాసముంద్, కంకేర్, కర్నాటకలోని చిక్కోడి, బెల్గాం, బాగల్కోట్, బీజాపూర్, గుల్బర్గా, రాయచూర్, బీదర్, కొప్పల్, బళ్లారి, హవేరి, ధార్వాడ్, ఉత్తర కన్నడ, దావణగెరె, షిమోగా, కేరళలోని కాసర్గోడ్, కన్నూర్, వడకర, వాయనాడ్, కోజికోడ్, మలప్పురం, పొన్నాని, పాలక్కాడ్, అలత్తూర్, త్రిస్సూర్, చాలకుడి, ఎర్నాకులం, ఇడుక్కి, కొట్టాయం, అలప్పుజ, మావేలిక్కర, పతనంతిట్ట, కొల్లం, అట్టింగల్, తిరువనంతపురం, మధ్యప్రదేశ్‌లోని తికమ్గఢ్, దామోహ్, ఖజురహో, సత్నా, రేవా, హోషంగాబాద్, బేతుల్, మహారాష్ట్రలోని బుల్దానా, అకోలా, అమరావతి, వార్ధా, యవత్మల్ వాషిం, హింగోలి, నాందేడ్, పర్భాని, మణిపూర్‌లోని ఔటర్ మణిపూర్, రాజస్థాన్‌లోని టోంక్‌సవాయి మాధోపూర్, అజ్మీర్, పాలి, జోధ్పూర్, బర్మేర్, జలోర్, ఉదయపూర్, బాన్స్‌వారా, చిత్తోడ్‌గఢ్, రాజస్‌మంద్, భిల్వారా, కోటా, ఝులావర్‌బరన్, త్రిపురలోని త్రిపుర తూర్పు, ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా, మీరట్, బాగ్‌పట్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్, బులంద్షహర్, అలీఘర్, మాథుర్, పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, రాయ్గంజ్, బాలూర్‌ఘాట్, జమ్మూకశ్మీర్‌లోని జమ్మూ నియోజకవర్గాల్లో రెండో దశ పోలింగ్ ఉంటుంది.

# ‘హస్తం’ వైపు ఓటర్ల మొగ్గు!

### నిజామాబాద్ లో కాంగ్రెస్ అభ్యర్థి కావాలంటున్న ప్రజలు

### సిట్టింగ్ ఎంపి అర్వింద్‌కు సొంత పార్టీలోనే ఎదురీత?

### బిఆర్ఎస్ పట్ల ఓటర్ల విముఖత!



**ప్రజాపక్షం / జగిత్యాల ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారనున్నాయా అంటే అవుననిపిస్తున్నది. తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసం పొందుతుండడం ఓటర్లు చేతి గుర్తు వైపు మొగ్గుచూపడం ప్రధాన కారణంగా చెప్పవచ్చనే చర్చ రాష్ట్రంలో జోరుగా సాగుతోంది. మూడు ప్రధాన రాజకీయ పార్టీలు బరిలో నిలిచినా కాంగ్రెస్, బిజెపి మధ్యే పోటీ ఉండే అవకాశాలున్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో సీనియర్ నేత జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ బరిలో నిలిపడం కలిసివచ్చే అంశంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజవర్గాలకు ముగ్గురు ఎంఎల్ఎలు బిజెపి నుంచి, కాంగ్రెస్, బిఆర్ ఎస్ నుంచి ఇద్దరు చొప్పున ఎంఎల్ఎలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ముగ్గురు అభ్యర్థులు గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన నాయకులనే ఎంపిలుగా బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు బరిలో దింపాయి. కాంగ్రెస్ నుండి ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్ రెడ్డి, బిజెపి నుండి సిట్టింగ్ ఎంపి ధర్మపురి అర్వింద్, బిఆర్ఎస్ నుండి బాజిరెడ్డి గోవర్ధన్‌లు పోటీపడుతూ ఎవరికి వారు ప్రచారం నిర్వహిస్తుండడంతో నిజామాబాద్‌లో ఎన్నికలు హీటెక్కిపోతున్నాయి. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీపడుతున్నప్పటికీ బిఆర్ఎస్ అవినీతి, అక్రమాల్లో కురుకుపోవడం, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతులను ఇబ్బందులకు గురిచేయడం, ధాన్యానికి మద్దతు ధరను చట్టబద్ధత చేయకపోవడం, ఖాయిలా పడ్డ చక్కెర పరిశ్రమలు తెరిపించకపోవడం, ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం, విదేశాల్లో ఉన్న నల్ల ధనాన్ని వెనక్కి తీసుకురాకపోవడం, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల్లో 4 అమలు చేసి చూపించడం వంటి కారణాలను నిశితంగా పరిశీలించిన ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయలు వ్యక్త మవుతున్నాయి.

కాంగ్రెస్ అభ్యర్థి సీనియర్ నేత, ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డి ప్రచారంలో భాగంగా ఇప్పటికే నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లను చుట్టివచ్చారు. నిజామాబాద్‌లో ఎక్కువ మంది రైతులు, బీడీ కార్మికులు, గల్ఫ్ కార్మికులు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ ప్రధానమైనది మూతపడ్డ ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీని ఎలాగైనా పునర్ ప్రారంభం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం జీవన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సాధ్యసాధ్యాలను అంచనవేయడానికి ఒక కమిటీని వేయడమే కాకుండా అధికారులు, రైతులతో పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు, ఎంఎల్ఎలు సమావేశాలు నిర్వహిస్తుండడంతో రైతులు కాంగ్రెస్ పార్టీ పట్ల మొగ్గ చూపే అవకాశాలున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీడీ కార్మికుల కోసం పిఎఫ్ కార్యాలయం, ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు, వెయ్యి బీడీలకు రూ.300ల చెల్లింపు, ఎలాంటి కటాఫ్ లేకుండా పిఎఫ్ ఉన్నవారందరికి రూ.4 వేల పింఛన్ సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి భరోసా ఇస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటుతో పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా, పిల్లలకు గురుకులాల్లో ప్రవేశం, వైద్యం తదితర కార్యక్రమాలు చేపట్టి ఆదుకుంటామని, యువతకు ఉద్యోగ అవకాశాలు, మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునే విధంగా స్కీమ్‌లు ప్రవేశపెతామని, బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలు, ఉద్యోగులను అన్ని విధాల ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెబుతూ జీవన్‌రెడ్డి ప్రచారంలో ముందున్నారు. ఎంపిగా గెలిపిస్తే నిజామాబాద్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తున్నారు. బిజెపి నుండి సిట్టింగ్ ఎంపి ధర్మపురి అర్వింద్ ఐదేళ్ల కాలం బిఆర్ ఎస్ నేతలైన మాజీ సిఎం కెసిఆర్, కెసిఆర్, కవితలను విమర్శించడానికే సరిపోయిందని ప్రజల నుండి విమర్శలున్నాయి. పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి చివరలో ప్రధాని మోదీ చేత పసుపు బోర్డు ప్రకటన చేయించారని అది ఎక్కడ ఏర్పాటు చేశారో చెప్పాలని కాంగ్రెస్, బిఆర్ఎస్‌తో పాటు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా అర్వింద్‌కు ఈసారి స్వంత పార్టీ బిజెపి నాయకులు సహకరించడంలేదనే చర్చ నియోజకవర్గంలో జోరుగా జరుగుతున్నది. జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాత క్యాడర్‌ను విస్మరించి కొత్త వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని బిజెపి పాత క్యాడరే విమర్శిస్తున్నారు. ఎన్నికల సమయంలోనైనా సీనియర్లను పట్టించుకోకపోవడంతో కోరుట్లలో సీనియర్ బిజెపి నేతలు పార్టీని వీడడం కొంత మైనస్ కావొచ్చనే చర్చ నడుస్తోంది. బిఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎంఎల్ఎ బాజిరెడ్డి గోవర్ధన్ పార్లమెంట్ పరిధిలో పార్టీ శ్రేణులను కలుపుకుని ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ అంతగా స్పందన లభించడంలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బిఆర్ఎస్ అధికారంలో ఉండగా చేసిన అవినీతి, అక్రమాలు ఒక్కక్కటి బయటపడుతుండడం ఓటర్లు పార్టీ పట్ల ఆసక్తి చూపకపోవడం కొంత ఇబ్బందికరంగా మారిందనే అభిప్రాయలున్నాయి. నాయకులు పెద్ద సంఖ్యలో కారు దిగి ఇతర పార్టీల్లో చేరుతుండడం కారణంగా గోవర్ధన్ ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోక తప్పదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### మాను‘కోట’ పై

# ఏ పార్టీ జండా ఎగేరేనో?



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** తెలంగాణ మలిదశ ఉద్యమంలో మానుకోట పాత్ర మరువలేనిది.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున జరిగే ఉద్యమంలో తెలంగాణ వ్యతిరేకులను తరిమికొట్టి చరిత్ర మానుకోటకు ఉంది. ప్రత్యేక రాష్ట్రసాధనోద్యమానికి ఊపిరులు పోసిన మానుకోట తిరుగుబాటు ఉద్యమం చారిత్రత్మాకంగా నిలిచిపోయింది. తెలంగాణలో తుపాకి గుళ్లకు ఎదురొడ్డిన ఇక్కడి యువత పోరాట పటిమను ప్రదర్శించిన ఘటన తెలంగాణ ఉద్యమకారులకు దివిటిగా పనిచేందనడంలో కాదనని వారెవరూ ఉండరు. అలాంటి ఉద్యమానికి సరికొత్త భాష్యాన్ని చెప్పిన మహబూబాబాద్ కేంద్రంగా మొత్తంగా ఏడు అసెంబ్లీ స్థానాలతో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం డీలిమిటేషన్ పుణ్యాన ఏర్పాటైంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే మెజారిటి నియోజకవర్గాలలో గెలుపొందారు. మూడు నెలల క్రితం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మహబూబాబాద్‌లో 50,191, డోర్నకల్‌లో 53,131, ఇల్లందులో 57,309, నర్సంపేటలో 18,889, ములుగులో 33,700, పినపాకలో 34,506 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందగా భద్రాచలంలో మాత్రమే తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ పార్టీ తరుపున గెలుపొందారు. అయినప్పటికీ ఆయన కూడా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థికి గెలుపుఅవకాశాలు మెండుగానే ఉన్నాయని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. దీంతో పార్లమెంట్ ఎన్నికలు కాంగ్రెస్ సులభంగానే విజయం చేకూరుతుందన్న నమ్మకంతో ఉంది. అంతేకాకుండా అదృష్టం కలిసొచ్చి కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వచ్చి బలరాం నాయక్ గెలిస్తే కేంద్రంలో మంత్రిగా కూడా అవకాశం లభిస్తుందన్న ఆశతో కాంగ్రెస్ అభిమానులున్నారు. కాగా సిట్టింగ్ సీటును దక్కించుకునేందుకు బీఆర్ఎస్ కూడా మాలోతు కవిత శ్రమిస్తున్నారు. ఆమె కూడా నిత్యం ప్రజల్లో మమేకమవుతూ అందర్ని పార్టీలకతీతంగా కలుపుపోతున్నారు. అయితే ఓటర్లు బీఆర్ఎస్ పార్టీ పట్ల ఈ ఎన్నికల్లో ఎలా స్పందిస్తారో అన్నది ఇప్పుడే చెప్పలేము. ఇక బిజెపికి గత ఓటింగ్ శాతాన్ని చూస్తే మాత్రం గెలుపొందే స్థానంగా కనిపించడం లేదనే చెప్పవచ్చు. అయోధ్య రామాలయం, మోడీపై అభిమానం మాత్రం పట్టణ ప్రాంతాల్లో కొంతమేర ఓటింగ్ శాతం పెరుగుతుందే తప్ప గెలిచే స్థాయిలో ఓటింగ్ నమోదు అవుతుందా లేదా అనే సందేహాన్ని ఆ పార్టీ నేతల్లోనే వ్యక్తం అవుతుండడం విశేషం.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సింగరేణికి మనుగడ

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సింగరేణి మనుగడ సాధ్యమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐఎన్‌టియుసి జాతీయ నాయకులు సంజీవరెడ్డి అన్నారు. ఐఎన్‌టియుసి జన ప్రసాద్ అధ్యక్షతన గోదావరి ఖని ఐఎన్‌టియుసి కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ కెసిఆర్ సింగరేణి ప్రైవేటీకరణ చేసే కుట్ర చేశారని, కెసిఆర్ కు కొన్ని ప్రైవేట్ కంపెనీలు బినామీలుగా ఉన్నాయని, సింగరేణి కార్మికులను నిలువునా దోచుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఉండేటప్పుడు సింగరేణి కార్మికుల కోసం ఎంతో చేశారని ఈ సందర్భంగా చెప్పారు. కాక గడ్డం వెంకటస్వామి 450 కోట్ల వడ్డీ లేని రుణాలను సింగరేణి కార్మికులకు అందించారని, లక్షకు పైగా ఉద్యోగాలను కాపాడారని, సింగరేణి కార్మికుల కోసం ఉద్యోగ విరమణ తర్వాత పింఛన్ ఇచ్చే లాగా కృషి చేసింది కాక నే అని చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గం పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ఒక పారిశ్రామిక వేత్తగా నిలదొక్కుకున్న యువ నేత అని వంశీకృష్ణను గెలిపిస్తే కాక ల పెద్దపల్లి నియోజకవర్గానికి సేవలు చేస్తారని, ఐఎన్‌టియుసి సంఘాన్ని బలోపేతం చేస్తారని అన్నారు. ఎమ్మెల్యే వినోద్ , రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ , వివేక్ వెంకటస్వామిలు మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను , సింగరేణి కార్మికులు, పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని సింగరేణి కార్మికులకు పిలుపునిచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గం పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ కార్యక్రమానికి వచ్చిన, కాంగ్రెస్ పెద్దలకు, కార్యకర్తలకు, సింగరేణి కార్మికులకు, ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాక సింగరేణి చేసిన సేవలను మరోసారి గుర్తు చేశారు. ఎన్నికల అనంతరం కొత్త బావుల ప్రారంభం, యువతకి ఉద్యోగాలు వచ్చేలా కార్యక్రమాలు ఉంటాయని, అంతేకాకుండా సింగరేణికి రావలసిన 30 వేల కోట్లు తీసుకొచ్చే బాధ్యత ఉన్నదని ఈ సందర్భంగా చెప్పారు. గత 15 సంవత్సరాలుగా పారిశ్రామరాతగా ఉన్న తనకి, కార్మికుల కష్టాలు ఇబ్బందులు బాగా తెలుసని చెప్పారు, తన సొంతంగా కంపెనీ పెట్టి 500 మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని గమనించాలని, పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలు, సింగరేణి కార్మికులు తనని గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ఐ ఎన్ టి యు సి నాయకులు, అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి ధన బలం.. కాంగ్రెస్‌కు జన బలం

### వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** బీజేపి అభ్యర్థి ఆరూరి రమేష్‌కు ధన బలం ఉంటే.. కాంగ్రెస్‌కు జన బలం ఉందని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. ఆదివారం హన్మకొండ హంటర్ రోడ్‌లో నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ డబ్బులతో అధికారంలోకి రాలేదని, ప్రజల అభిమానంతోనే వచ్చిందని అన్నారు. కానీ బీజేపి అభ్యర్థి కేవలం డబ్బును నమ్ముకుని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని అన్నారు. గతంలో వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ఉన్న ఆరూరి రమేష్ అనేక భూ కబ్జాలు, అరాచకాలకు పాల్పడ్డారని, అలాంటి వ్యక్తికి మరోసారి వరంగల్ ఎంపీగా అవకాశం ఇస్తే మొత్తం మింగేయడానికి సిద్ధంగా ఉన్నాడని అన్నారు. బీజేపీ అరాచక పాలన నుంచి దేశాన్ని కాపాడుకోవాలని, దేశంలో సంక్షేమ పాలన రావాలంటే రాహుల్ గాంధీని ప్రధాని చేసుకోవాలన్నారు. బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ ఎలాంటి నాయకుడో మీ అందరికి తెలుసునని, ఆయన భూ కబ్జాలు, రియల్ ఎస్టేట్ దందాలతో ఎంతో మంది పేదల ప్రజల కన్నీటికి కారణమయ్యాడని, వర్ధన్నపేటలో ప్రజలు ఓడించినా గుణపాఠం రాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీబి చైర్మన్ మార్నేని రవిందర్ రావు, నాయకులు దొమ్మాటి సాంబయ్య,వర్ధన్నపేట నియోజకవర్గ నాయకులు, ప్రజపతినిధులు పాల్గొన్నారు.




# అత్యున్నత సాహితీ శిఖరం షేక్స్పియర్


సత్యశ్రీ



ఆంగ్ల సాహిత్యం తెలిసినా.. తెలియకపోయినా.. విలియమ్ షేక్స్పియర్ పేరు వినని వారు అరుదు. ఆంగ్ల నాటక, కవితా ప్రక్రియల్లో ఆయనది బలమైన ముద్ర. వందలు కాదు.. వేలు కాదు.. లక్షలు కూడా కాదు.. కొన్ని శతాబ్దాలుగా కోట్లాది మంది రచయితలకు ఆయన మార్గదర్శకుడు. స్ఫూర్తిప్రదాత. దాదాపుగా ప్రపంచంలోని అన్ని ప్రధాన భాషల్లోనూ ఆయన రచనలు అనువాదమయ్యాయి. అందుకే షేక్స్పియర్ కేవలం ఆంగ్లంలోనేకాదు.. విశ్వసాహితీ సామ్రాజ్యానికే సార్వభౌముడయ్యాడు. నాలుగున్నర శతాబ్దాలుగా షేక్స్పియర్ రచనలను చదువుతునే ఉన్నామంటే, ఆయన అక్షరాలకు ఉన్న బలం, పదును ఏమిటో అర్థమవుతుంది. ఆయన ఎన్ని నాటకాలు రాశాడనే అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రెండు నాటకాలను ఆయన ఖాతాలోకి చేర్చడంతో అవి 38 అయ్యాయని, నిజానికి 36 నాటగాలే ఆయన రాశాడని వాదించేవారు ఉన్నారు. మరికొంత మంది నాటకాల సంఖ్యను 37గా పేర్కొంటారు. కనీసం 36 నాటకాలు రాశాడన్నది అందూ అంగీకరించే సత్యం. వీటితోపాటు 154 భావ ప్రణయ గీతాలు (సానెట్స్) కూడా రాశాడు. షేక్స్పియర్ నాటకాల మాదిరిగానే ఆయన కవితలు కూడా విఖ్యాతి చెందాయి. ఆయన నాటకాల్లో ఎక్కువ శాతం విషాదాంతాలే ఉన్నాయి. అంతమాత్రం చేత, కేవలం విషాదభరిత రచనలకే షేక్స్పియర్ పరిమితమయ్యాడని అనుకోవడానికి వీల్లేదు. 'మెజర్ ఫర్ మెజర్', 'మర్చంట్ ఆఫ్ వెనిస్', 'మెర్రీ వైవ్స్ ఆఫ్ విండ్సర్' వంటి నాటకాలు షేక్స్పియర్‌లోని మరో కోణాన్ని మనకు పరిచయం చేస్తాయి. ఎందుకంటే అవన్నీ హాస్యం, చమత్కారంతో కూడుకున్నవే. ఎక్కడా గుండెలను మెలిబెట్టే బాధలుగానీ, మనసులను బరువెక్కించే కన్నీళ్లుగానీ ఉండవు. 'ది కామెడీ ఆఫ్ ఎర్రర్స్'ను ఆయన రాసిన తొలి హాస్య నాటకంగా చెప్తారు. ఎందుకంటే ఇది ఆయన తొలిదశ నాటకాలలో ఒకటి. చక్కటి హాస్య కథాంశంతో సాగుతుంది. పాత్రను తప్పుగా గుర్తించడం, తద్వారా తలెత్తిన అపార్థాల చుట్టూ ఈ నాటకం తిరుగుతుంది. ఈ పొరపాట్లే హాస్యభరిత పరిస్థితులను సృష్టిస్తాయి. ఈ నాటకంలో ప్రహసనం లక్షణాలు కూడా కనిపాస్తాయి. షేక్స్పియర్ కాలంలో ఇలాంటి హాస్య రచనలు దాదాపు లేవు. ఆ రకంగా, షేక్స్పియర్ ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టాడనే అనుకోవాలి. కాగా, 'కొరియోలనస్' అనేది హాస్యంతో కూడిన విషాదాంతం. 'మర్చెంట్ ఆఫ్ వెనిస్'ను కూడా ఈ కోవకే చెందుతుందిగానీ, 'కొరియోలనస్' స్థాయిలో మాత్రం కాదు. హాస్యాన్ని, విషాదాన్ని ఒకే నాటకంలో నిక్షిప్తం చేయడం ఆయనకు మాత్రమే చెల్లింది.

1564 ఏప్రిల్‌లో జన్మించిన షేక్స్పియర్స్, 1616వ సంవత్సరం ఏప్రిల్ 23న తుదిశ్వాస విడిచాడు. ఆయన పుట్టిన తేదీపై స్పష్టత లేనప్పటికీ, చాలా మంది ఏప్రిల్ 23గానే పేర్కొంటారు. జయంతి, వర్ధంతి రెండూ ఒకే రోజుగా పేర్కొంటారు. మరికొంత మంది ఏప్రిల్ 26గా చెప్తున్నప్పటికీ, ఆ వాదనకు అంతగా సమర్థన లభించలేదు. ఏదిఏమైనా ఏప్రిల్ 23ను జయంతిగా పేర్కొంటూ, అదే రోజున ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని జరుపుకోవాలని 1995లో యునెస్కో అన్ని దేశాలను కోరింది. అప్పటినుంచి ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఆంగ్ల భాషా దినోత్సవాన్ని కూడా ఇదే రోజున నిర్వహించడం విశేషం. లండన్‌కు సుమారు 120 కిలోమీటర్ల దూరంలోని ఎవాన్ అనే గ్రామంలో జన్మించిన షేక్స్పియర్ కొంతకాలం స్థానిక పాఠశాలలో చదువుకున్నాడు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో చదువుకు స్వస్తి చెప్పాడు. విద్యాలయాలకు వెళ్లకపోయినా, ప్రకృతితో మమేకమై పెరిగాడు. పచ్చిక బైయళ్లతో సావాసం చేవాడు. సెలయేర్లతో మాటలు కలిపాడు. చెట్లతో, పుట్లతో తన ఆలోచనలను పంచుకున్నాడు. ఎవాన్ నది ఒడిలో పెరిగి, ప్రకృతి చెప్పే ఎన్నో పాఠాలు నేర్చుకున్నాడు. తదనంతరం జీవనోపాధి కోసం లండన్ చేరుకున్నాడు. గుర్రాలకు కాపలాదారుడిగా చేరాడు. నాటక ప్రదర్శనలకు రథాలు, గుర్రాలపైనే ప్రభువులు, రాచకుటుంబ ప్రముఖులు, ఉన్నత వర్గీయులు వెళ్లేవారు. ఆయా ప్రదర్శనలు పూర్తయ్యే వరకూ అశ్వాల సంరక్షణ బాధ్యత షేక్స్పియర్‌దే. తనకు అప్పగించిన పనిని సక్రమంగా నిర్వసిస్తూనే, నాటకాలకు వచ్చిపోయేవారిని గమనించేవాడు. వ్యక్తుల హావభావాలను బట్టి, వారి మనసులో మెదలుతున్న ఆలోచనలను అంచనా వేసేవాడు. అనుకోకుండా వచ్చిన అవకాశంతో ఒక నాటకంలో వేషం వేశాడు. అక్కడి నుంచి రంగస్థలంతో మమేకమయ్యాడు. ఎన్నో చారిత్రక, సాంఘిక నాటకాలు రచించాడు. షేక్స్పియర్ రచించిన చారిత్రక నాటకాల్లో కింగ్ హెన్రీ VIII, కింగ్ జాన్, రిచర్డ్ II , రిచర్డ్ III ప్రసిద్ధి చెందాయి. ఇవి వాస్తవంగానే సమకాలీన చరిత్ర ఆధారంగా రాసినవా లేక ఊహాజనితమా అనేది కూడా చర్చల్లోనే ఉంది. ఆయా నాటకాల్లో వాడిన పేర్లు మాత్రం చారిత్రక ధ్రువీకరణ ఉన్నవేకావడం గమనార్హం. నిజానిజాలు ఎలావున్నా, ఈ నాటకాలు ఆంగ్ల చరిత్రకు సంబంధించిన సంఘటనలను మన ముందు ఆవిష్కరిస్తాయన్నది వాస్తవం. అధికారం, రాజకీయాలు, చక్రవర్తుల పెరుగుదల, పతనం ఈ నాటకాల్లోని ప్రధాన ఇతివృత్తాలు. ఈ నాటకాల్లోని ఘట్టాలేకాదు.. పాత్రలు కూడా సంక్లిష్టంగా ఉంటాయి. అధికారం కోసం మానవ సంబంధాలు ఏ విధంగా తునాతుకలవుతాయో వివరిస్తాయి. మనిషిలో దాగివున్న స్వార్థాన్ని నిస్సంకోచంగా నిలదీస్తాయి.. ప్రశ్నిస్తాయి. సాధారణంగా షేక్స్పియర్ విషాద నాటకాల్లో నాయకులంతా బలహీనతలు కలిగి ఉన్నవారే. అంతేకాదు, భయంకరమైన తప్పులు చేస్తారు. తమకు మాత్రమేగాక, తమకు ఇష్టమైన వారి నాశనానికి కారణమవుతారు. 'ఒథెల్లో'లోని విలన్ ఒథెల్లోకి భార్యపై గల అనుమానాన్ని ఎగదోసి అమాయకురాలు, ఒథెల్లోను ప్రాణప్రధంగా ప్రేమించే భార్యను స్వయంగా హత్య చేసేలా అతనిని పురికొల్పుతాడు. ఆ తరువాత 'లియర్ రాజు'లో ముసలి రాజు కుమార్తె హత్యకు గ్లొసెస్టర్ డ్యూక్ చిత్రహింసలు అతని అంధత్వానికి కారణం అవుతాడు. 'మాక్బెత్'లో మాక్బెత్ దంపతులు తమ తీవ్రమైన, నిలపలేని కోరిక వల్ల మంచి రాజుని చంపి సింహాసనాన్ని అధిష్టిస్తారు. కానీ, తరువాత అదే వాళ్ళని నాశనం చేస్తుంది.

షేక్స్పియర్ చివరి పెద్ద విషాద రస ప్రధాన నాటకం 'ఆంటోనీ క్లియోపాత్ర' వివిధ దశల్లో మనిషి తనజీవితంలో అనుభవించే అన్నిరకాల అనుభూతులలో, అవస్థలలో ఏ ఒక్కటీ వదిలిపెట్టకుండా, షేక్స్పియర్ ఓ రసావిష్కరణ చేశాడు. ఎంత గొప్పగా రచనలు చేసినా, పాత్రలను, సన్నివేశాలను ఎంత అద్భుతంగా ఆవిష్కరించినా, సరైన విద్యార్హతలు లేకపోవడంతో సమకాలీనలు ఆయనను తిరస్కారభావంతో చూసేవారు. ఆయనను 'అప్‌స్టార్ట్ క్రో' అంటూ సంబోధించాడు. రాబర్ట్ గ్రీన్. ఎలాంటి అర్హతలుగానీ, నైపుణ్యంగానీ, ప్రావీణ్యంగానీ లేకుండానే, ఏదైనా రంగంలో హఠాత్తుగా ఉన్నత శిఖరాలను చేరుకోవడాన్ని 'అప్‌స్టార్ట్' అంటారు.

థియేటర్ లేదా నాటక రంగంపై ఎలాంటి అవగాహనగానీ, నటనపై పట్టుగానీ లేకుండానే షేక్స్పియర్ ఉన్నత స్థానాలకు ఎదిగాడన్న వ్యంగ్యం రాబర్ట్ గ్రీన్ మాటల్లో స్పష్టమవుతుంది. షేక్స్పియర్ రచనలకు లభించిన ప్రాధాన్యం, ఆయనకు దక్కిన కీర్తిప్రతిష్టలను కొంత మంది ఏ విధంగా జీర్ణించుకోలేకపోయారో చెప్పడానికి ఇదో ఉదాహరణ.



షేక్స్పియర్ తన రచనల్లో ఎన్నో కొత్త పదాలు వాడాడు. మరో రకంగా చెప్పాలంటే, ఎన్నో కొత్త పదాలు కనిపెట్టాడు. 'అసాసినేషన్,' 'బంప్', 'ఫ్యూక్' అనే పదాలు ఆయన సృష్టించినవే. ఆంగ్ల భాషకు తన విస్తృతమైన రచనల ద్వారా ఎంతో ఉన్నత సేవ చేసిన షేక్స్పియర్ కనుగొన్న అనేక పదాలు, పదబంధాలు ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉన్నాయి. 'అసాసినేషన్' (హత్య) పదాన్ని మాక్బెత్‌లో వాడాడు. ఆయన కనుగొన్న పదాలు ఆంగ్ల నిఘంటువులో భాగమయ్యాయి. విస్తృత గుర్తింపును సంపాదించాయి.

'టు బి ఆర్ నాట్ టు బి' అనే కోట్ షేక్స్పియర్ రచించిన హామ్లెట్ నాటకం నుండి వచ్చింది. ఇది యాక్ట్ III, సీన్ Iలోని అతని ప్రసిద్ధ స్వగతంలో హామ్లెట్ పాత్ర స్వగతంలో చెప్పిస్తాడు. జీవితానికి అర్థం, అతని ఉనికికి ఉన్న విలువ గురించి హామ్లెట్ ఆలోచిస్తాడు. ఆ సందర్భంలో 'టు బి ఆర్ నాట్ టు బి' (బతికి ఉండాలా? లేక ప్రాణాలు తీసుకోవాలా) అంటూ, ఏటూ తేల్చుకోలేని పరిస్థితిని అనుభవిస్తాడు. షేక్స్పియర్ కోట్స్‌లో ఇది అత్యంత ప్రసిద్ధమైనది. ప్రజాదరణ పొందింది.

'షేక్స్పియర్ ఇన్ లవ్' అనే సినిమాను ఆయన జీవిత చరిత్రగా ప్రచారం జరిగింది. కానీ, అది ఏమాత్రం నిజం కాదు. షేక్స్పియర్ పేరుతో, ఒక కల్పిత కథ ఆధారంగా నిర్మించిన చిత్రం అది. ఆయన జీవితానికి సంబంధించిన అంశాలుగానీ, ఘటనలుగానీ ఆ సినిమాలో లేవు. అయితే, షేక్స్పియర్ నాటకాల్లో శృంగారభరితమైన సంభాషణలు, పాత్రలు ఉంటాయి కాబట్టి, ఈ చిత్రం నిజంగానే జీవిత చరిత్రగా పొరపాటు పడే అవకాశం ఉంది. కానీ, ఇది ముమ్మాటికీ కల్పిత కథే.






'పిరికివాళ్ళు తమ మరణానికి ముందు చాలాసార్లు చనిపోతారు; పరాక్రమవంతులు ఎప్పుడూ మరణాన్ని రుచి చూడరు.. కానీ, ఒకసారి మరణిస్తారు.' అనే కోట్ 'జూలియస్ సీజర్' నాటకంలోనిది. పిరికివాళ్ళు జీవితాంతం అనేకసార్లు భయం, ఆందోళనను అనుభవిస్తారని, అయితే ధైర్యంగా, పరాక్రమంగా ఉన్నవారు ఒక్కసారి మాత్రమే మరణాన్ని ఎదుర్కొంటారని షేక్స్పియర్ తన ఆలోచనా తీరును ఈ మాటల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పాడు. నాటకంలోని ధైర్యం, మరణాలు వంటి విరుద్ధమైన వైఖరుల ఇతివృత్తాలకు ఈ కోట్‌ను కీలకంగా చెప్పుకోవాలి.

'ది లార్డ్ ఛాంబర్‌లైన్ మెన్' వ్యవస్థాపక సభ్యులలో షేక్స్పియర్ ఒకడు. ఈ థియేటర్ కంపెనీని తరువాత కాలంలో 'కింగ్స్ మెన్' అని పిలిచేవారు. 1594లో దీనిని నెలకొల్పడంలో షేక్స్పియర్ కీలక భూమిక పోషించాడు. ఈ థియేటర్‌లో నటించడమే కాకుండా, సంస్థ కోసం నాటకాలను కూడా రాశాడు.



షేక్స్పియర్ మొత్తం 154 సొనెట్లను రాశాడు. ఈ సొనెట్లు కవితల సంకలనం. ప్రతి ఒక్కటి ఐయాంబిక్ పెంటామీటర్‌లో ఉంటుంది. ప్రతి సోనెట్‌కు 14 పంక్తులు ఉంటాయి. ఆంగ్ల సాహిత్యంలో సొనెట్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రేమ, అందం, సమయం, మరణం.. ఇలా అనేకానేక ఇతివృత్తాలను సొనెట్లలో చేర్చవచ్చు.

విమర్శకులు షేక్స్పియర్ నాటకాలను, విషాదాలు, హాస్యాలు, చరిత్రలు, సమస్య నాటకాలు అనే నాలుగు రకాలుగా విభజించారు. ఈ జాబితాలో ఒక్కో వర్గంలోకి వచ్చే కొన్ని నాటకాలు ఉన్నాయి. అయినప్పటికీ, వేర్వేరు జాబితాలు కొన్ని నాటకాలను వేర్వేరు వర్గాలలో ఉంచినట్టు తెలుస్తోంది. ఉదాహరణకు, 'ది మర్చంట్ ఆఫ్ వెనిస్'లో హాస్యం ఉంది. విషాదం కూడా ఉంది. ఈ రెండు రసాలు కలగలిసి ఉన్నాయి కాబట్టి, ఇది ఏ రకానికి చెందిందో పాఠకులే నిర్ణయించుకోవాలి.

## ఈ వారం కవితలు

### పామర జన వాహిని నా కవిత

శ్రమజీవుల పొలంలోన
మొలకెత్తిన అక్షర బీజాలు
విరబూసిన... నా
కవితా కుసుమాలు
కూలీ జనం గొంతులోన
కోయిల నా గీతం...
పామర జన హృదిలోన
చైతన్య వాహిని నా హితం

గురజాడ అడుగు జాడలో
నడియాడిన కలం నుంచి...
రాలిన అక్షర పువ్వులతో
అల్లిన విప్లవ గీతం
కందుకూరి బాటలోనే
పదునెక్కిన నా కవనం
ప్రతి పదం ప్రజా పక్షం
ప్రజలే దీనికి సాక్ష్యం

దాశరథి దారిలోనే
ప్రస్తానం నా పాట
దోపిడి పాలనపై దరువే నా ఆట
సినారే, శ్రీ శ్రీ లు
ఆదర్శం నా కవితకు
ఉదయించే సూర్యుడై పయనించే నా కవిత

జాషువా గబ్బిలం నుంచి జాలువారిన
నిప్పుల కవిత....
శ్రమజీవుల చైతన్య ప్రవాహం నా కవిత
శ్రమను మరిపించే స్నేహం నా కవిత
తిరుగుబాటు నేర్పించే కావ్యం నా కవిత
పాటతోనే ప్రజలను ప్రభావితం చేయిస్తా...
ప్రభుత్వాల పనితీరు పై
తిరుగుబాటు చేయిస్తా...

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399.

### ఆకుపచ్చని కల!

ఆకుపచ్చని రంగుడబ్బా ఒలికిపోయిందో
ఏమో అక్కడంతా అలికేసినట్టు చెట్లు
మొలకెత్తాయి..
నేలపై సూర్యచంద్రులు తొంగి
చూడలేనంతగా వృక్షరాజాలు చెలిమి
చేస్తూ ధాటిగా నిలుచున్నాయి!
ఆ దాట్న పోతుంటే గాలి మంద
మారుతమైతే దృశ్యం పచ్చదనమౌతుంది
ఆ నిశ్శబ్ద సౌందర్యానికి పులకరించని
మది ఉండదు అక్కడ క్రూరమృగాలు
నివసిస్తాయి కానీ క్రూరత్వం ఉండదు!
అక్కడ ఇవ్వడమే తప్ప సంగ్రహణం
ఉండదు..
సెలయేళ్ళు గలగలా మాట్లాడతాయి..
ఔషధ వృక్షాలెన్నో అపర ధన్వంతరులై
ఆయుష్షు పోసే క్రతువులో అద్భుతాలు
ప్రదర్శిస్తాయి..
పర్యావరణం అక్కడే పట్టం కట్టుకొని
ప్రతిష్టాపన పొందింది!
స్వార్థ నరదృష్టికి నశించిపోతున్నా..
మాయలఫకీరు ప్రాణం చిలుకలో ఉన్నట్లు
నరుడి ప్రాణాలు తన గుండెల్లో దాచుకొని
కొనఊపిరితో గుట్టుగా బతుకుతుంది..!!

భీమవరపు పురుషోత్తమ్
9949800253

### ఇప్పుడు జరుగుతున్నది అదే...

దేశాన్ని నాశనం చేయాలంటే
అణు బాంబులు అవసరం లేదు
సుదూర క్షిపణులూ
ఎంతమాత్రమూ అవసరం లేదు
కేవలమువిద్యను నాశనం చేస్తే చాలు
ఆ వైద్యుల చేతిలో
పేషెంట్లు చనిపోవడం ఖాయం
ఇంజనీర్ల చేతుల్లో
భవనాలు కూలిపోవడం ఖాయం
న్యాయమూర్తుల చేతుల్లో
న్యాయం చచ్చిపోతుంది
మత పండితుల చేతుల్లో
మానవత్వం చచ్చిపోతుంది
అందుకే
విద్య నాశనమైతే చాలు
దేశమే నాశనం అవుతుంది
ఈ మాటలన్నీ
జాతి వివక్షత పోరాట యోధుడు
రాజనీతిజ్ఞుడు
దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు
నెల్సన్ మండేలాచే
దక్షిణాఫ్రికా విశ్వవిద్యాలయ
ప్రవేశ ద్వారం వద్ద రాయబడ్డాయి
సరిగ్గా
ఇప్పుడు భారత్‌లో
ఎన్‌ఈపి2020 ద్వారా
జరుగుతున్నది అదే

డా. మార్క శంకర్ నారాయణ
9908416664

### ప్రయివేట్ టీచర్

మేధావులంతా అంటూనే వున్నారు.
దేశనిర్మాణానికి గుండె కాయ గురువని..!
మన జాతీయ జెండా మతసామరస్యానికి
ప్రాణంపోసే తరువే గురువని..!
ఎంతో గొప్పగా అనిపిస్తుంటుంది
ఇలాంటివి మదిలో నెమరేసుకుంటూ
తరగతి గదిలో మనదేశ ఉపాధ్యాయ
సైనికుడిలా అజ్ఞానంపై
అక్షర సమరం చేస్తుంటే..!
ఫిజిక్స్ సూత్రం మారలేదు..కానీ
గురువే 'ప్రయివేటు', ప్రభుత్వం
రెండు పాయలుగా విడిపాయె
జీతపు కొలమానంలో..!
కరోనా వైరస్ కాలంపై చేసిన
సంతకపు దాడిలో ప్రయివేటు
పంతులు బ్రతకడానికి
బ్రతుకు పై గెలవడానికి
కూరగాయలు సైతం
నడిరోడ్డుపై అమ్ముతూ..
రియల్ ఎస్టేట్ ఎంప్లాయిగా..
ఎల్ఐసి ఏజెంట్లుగా..
ఇలాంటివి ఎన్నో పాత్రల చాటున
పోరాడుతూనే వున్నారు ఇంకా..!
చాలీచాలని జీతాలతో కడుపునింపుకొని..
తన కలంతో తెల్లకాగితాలపై
సివిరామన్ నోబెల్ కాంతి
బొమ్మలనుగీస్తూ..
'మీరంతా కలాం గారిలా ఎదగండని
విద్యార్థులకు ఆశయాల పాఠాలు సెబుతూ'
డెభై ఐదు వసంతాల స్వాతంత్ర్యపు సంబరాలతో
ప్రభుత్వాలు,పాలన పద్ధతులు మారుతున్నా
ప్రయివేటు గురువుల ఆర్థిక వృద్ధి,
ఆరోగ్య స్థితి పట్టించుకున్న నాథుడు,
నాయకుడు లేకున్నా..
ఇప్పటికీ కొంతమంది ప్రయివేటు
గురువులు పాఠాలు చెబుతూనే వున్నారు..!
జీసస్ శిలువ మోసినట్లు,
ఈ దేశ భవిష్యత్తు కోసం
మహానుభావుల ఆదర్శాలను మోస్తూ..!!
గురువులందరికి వందనాలతో...

ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

# ఐదు నవలలు.. వేటికవే ప్రత్యేకం
















ఆధునిక ఆంగ్ల సాహిత్యంలో క్రైమ్ థ్రిల్లర్లకు డిమాండ్ ఎక్కువ. రచయితలు కూడా పోటీపడి మరీ రాసేస్తున్నారు. రాశి ఎక్కువ కావడంతో, వాసి తగ్గడం ఖాయం. ఇలాంటి పరిస్థితుల్లోనే సరైన పుస్తకాలను ఎంపిక చేసుకోవాలి. క్రైమ్ థ్రిల్లర్లను ఇష్టపడే వారి కోసం ఓ ఐదు పుస్తకాలు.. వేటికవే ప్రత్యేకం. ముందుగా, స్టీగ్ లార్సన్ రచన 'ది గర్ల్ విత్ ది డ్రాగన్ టాటూ'ను పేర్కోవాలి. ఈ నవల ఒక శక్తివంతమైన స్వీడిష్ కుటుంబ చీకటి రహస్యాలను పరిశోధిస్తున్నప్పుడు, సమస్యాత్మక హ్యాకర్, లిస్బెత్ సలాండర్, ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ మైకేల్ బామ్‌క్విస్ట్‌ను మనకు పరిచయం చేస్తుంది. ఈ క్లిష్టమైన కథాంశంతో రూపొందించబడిన థ్రిల్లర్ మర్డర్ మిస్టరీని సామాజిక వ్యాఖ్యానంతో మిళితం చేస్తుంది, ఈ పుస్తకం పాఠకులకు ఆకట్టుకునే కథనంతో, ఉత్కంఠమైన మలుపులతో సాగిపోతుంది. రెండో నవల థామస్ హారిస్ రచించిన 'ది సైలెన్స్ ఆఫ్ ది లాంబ్స్'. ఎఫ్‌బిఐ ట్రైనీ క్లారిస్ స్టార్లింగ్, అపఖ్యాతి పాలైన నరమాంస మనోరోగ వైద్యుడు డాక్టర్ హన్నిబాల్ లెక్టర్‌ను పరిచయం చేసే చిల్లింగ్ మాస్టర్ పీస్ ఈ నవల. మరొక సీరియల్ కిల్లర్ బఫెలో బిల్‌ను పట్టుకోవడానికి స్టార్లింగ్ లెక్టర్ ఆలోచనలను, పరిశోధనలను కోరుతున్నప్పుడు థామస్ హారిస్ మానసికంగా తీవ్ర ఉత్కంఠకు గురవుతాడు. ఈ మానసిక ఘర్షణ చుట్టూ రచయిత కథను అల్లడం అద్భుతం. మిగతా థ్రిల్లర్ల మాదిరి ఈ నవల పాఠకులను భయపెట్టదు. అందుకు భిన్నంగా, ఉత్కంఠను క్రమంగా పెంచుతుంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది సైకలాజికల్ థ్రిల్లర్. ఈ కోవలో వచ్చిన అతి గొప్ప నవల్లో ఒకటి. హారిస్ రచనా శైలి అద్భుతం. 'గాన్ గర్ల్' నవల్లో రచయిత గిలియన్ ఫ్లిన్ ఒకవైపు సంప్రదాయాలను స్పృశిస్తూనే, మరోవైపు నమ్మశక్యంకాని కథనంతో, ఎవరూ ఊహించని ట్విస్టులతో రక్తి కట్టించాడు. అమీ డన్నే తన ఐదవ వివాహ వార్షికోత్సవ సమయంలో తప్పిపోయినప్పుడు, సహజంగానే ఆమె భర్తపై అనుమానం వస్తుంది. కానీ, రచయిత మోసపు పొరలు విప్పుతున్నప్పుడు, పాఠకులు సంభ్రమాశ్చర్యాలకు లోనవుతారు. ఫ్లిన్ కథా నైపుణ్యం అనన్య సామాన్యం కాబట్టే, "గార్ గర్ల్' అత్యధికంగా అమ్ముడైన నవలల్లో ఒకటిగా నిలిచింది. మానవ సంబంధాల్లో చోటు చేసుకుంటున్న చీకటి కోణాలను ఈ నవల వెలికితీసి, మనల్ని ఆలోచింప చేస్తుంది. డాన్ బ్రౌన్ రచించిన 'ది డా విన్సీ కోడ్' నవల కళ, చరిత్ర, రహస్యాలను మిళితం చేస్తూ, పాఠకులను ఉర్రూతలూగిస్తుంది. సింబాలజిస్ట్ రాబర్ట్ లాంగ్‌డన్‌ను అనుసరించే వేగవతమైన ఈ థ్రిల్లర్‌లో, అతను ఒక హత్య కేసును పరిష్కరించడానికి పూనుకుంటాడు. ఆ క్రమంలోనే క్రైస్తవ మత పునాదులను కదిలించే రహస్యాలను కనుగొంటాడు. పురాతన కాలంనాటి రహస్యాలతో కూడిన కోడ్లు, పజిల్స్‌ను ఛేదిస్తూ, కేసు లోతుల్లోకి వెళతాడు. ఈ నవల ఆరంభం నుంచి ముగింపు వరకూ, ప్రతి క్షణం ఏదో ఒక మలుపుతో పాఠకులను మునివేళ్ల మీద నిల్చోబెడుతుంది. వేగవంతమైన కథనంతో డాన్ బ్రౌన్ ఈ నవలను మరింత ఆసక్తికరంగా మలిచాడు. అంతేకాదు.. ఎంతో వినోదాత్మకంగానూ, ఆలోచింప చేసే విధంగానూ ఈ నవలను తీర్చిదిద్దాడు. ఇక ఈ జాబితాలో చివరిది 'ది బిగ్ స్లీప్'. రేమండ్ చాండ్లర్ రాసిన ఈ నవలను నోయిల్ జానర్‌లో క్లాసిక్‌గా పేర్కొంటారు. ప్రైవేట్ డిటెక్టివ్ ఫిలిప్ మార్లో మనకు ప్రారంభంలోనే పరిచయమవుతాడు. 1930లో, లాస్ ఏంజిల్స్‌లో హత్య, బ్లాక్‌మెయిలింగ్, మోసం చిక్కుముడిని విప్పడానికి చేసే ప్రయత్నాలు, సాధించిన విజయాలు ఈ నవల్లో అద్భుతంగా వర్ణించాడు చాండ్లర్. కఠినమైన నేర ప్రపంచంలోకి తన పదునైన వాక్యాలతో పాఠకులను తీసుకెళ్లే తీరు అనన్యసామాన్యం. కథాంశం చాలా క్లిష్టమైనది కాబట్టి, పాఠకుడు కూడా మార్లోతో కలిసిపోతాడు. వాస్తవాలను బయటపెట్టే దిశలో తన ఆలోచనలకు పదును పెట్టుకుంటాడు. కాగా, ఈ ఐదు క్రైమ్ థ్రిల్లర్ పుస్తకాలు, సాహితీ ప్రక్రియలోని విభిన్న శ్రేణిని సూచిస్తాయి. కథను చెప్పే విధానం గొప్పగా ఉంటుంది. క్షణక్షణం మారుతున్న పరిస్థితులు.. పాత్రల ప్రవర్తనల కారణంగా, పాఠకుడు చివరి వరకూ ఈ నవలలను చదువుతాడు. కాదు.. ఆ నవలలే పాఠకుడితో చదివిస్తాయి.

## సాహితీ పదనిసలు

- ప్రముఖ రచయిత ఫ్రెడరిక్ వాన్ షిల్లర్ తన డెస్క్‌లో కుళ్ళిన ఆపిల్ పండ్లను ఉంచేవాడు. తాను మెరుగైన రచనలు చేయడానికి ఆ మర్గాన్ని ఎంచుకున్నాడు. డెస్క్‌లోని ఆ ఆపిల్ నుంచి వచ్చే వాసన తన రచనలకు ప్రేరణగా చెప్పుకునేవాడు. మరో రచయిత ఎడిత్ సిట్వెల్ తన రోజు రచనను ప్రారంభించే ముందు, తెరిచిన శవపేటికలో పడుకునేవాడు. ఇలా చేయడం వల్ల తన ఆలోచనలు మెరుగవుతాయని అతని నమ్మకం.
- 'ఈస్ట్ ఆఫ్ ఈడెన్'న రాయడానికి జాన్ స్టెయిన్బెక్ 300 పెన్సిల్స్‌ను ఉపయోగించాడు. ఒక్క రోజులో 60 పెన్సిల్స్ వాడిన సందర్భాలు కూడా ఉన్నాయట.
- 'మోగిగ్రాఫియా' అనే పదానికి 'రచయిత యొక్క తిమ్మిరి' అని అర్థం.
- కోలిగ్రాఫియా' అనే పదానికి 'రైటర్స్ బ్లాక్' అని అర్థం.
- గెడ్‌రూడ్ స్టెయిన్ రచనలు చేస్తున్నప్పుడు, వాక్యాలు, పేరాగ్రాఫ్‌ల మధ్య వ్యత్యాసాన్ని చూపడం తన పెంపుడు కుక్క నీళ్లుతాగే విధానం నుంచి నేర్చుకున్నానని ప్రకటించింది. కుక్కలు కూడా రచనలకు ప్రేరణనిస్తాయనడం విచిత్రమే. గెడ్‌రూడ్‌కు మరో చిత్రమైన అలవాటు కూడా ఉండేది. పార్క్ చేసిన కారులో కూర్చొని రాయడానికి ఇష్టపడేది. రచయిత వ్లాదిమిర్ నబొకోవ్ కూడా ఎవరూ లేని ప్రాంతంలో కారును పార్క్ చేసి, రచనలు చేసేవాడు.
- కవయిత్రి అమీ లోవెల్ ఒకసారి 10,000 సిగార్లను కొనుగోలు చేసింది. తాను రాయడానికి సహాయంగా అవి అవసరమని పేర్కొంది. అన్ని సిగార్లను ఆమె తాగిందా? లేక వాటి వాసతోనే సరిపుచ్చుకుందా అన్నది సస్పెన్స్.
- గ్రాహం గ్రీన్ రోజుకు 500 పదాలు మాత్రమే రాసేవాడు. ఒక్కోసారి వాక్యం పూర్తికాకపోతే, మధ్యలోనే ఆపేవాడు.
- ఆంథోనీ ట్రోలోప్ ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు తన రచనా దినాన్ని ప్రారంభించేవాడు. ప్రతి 15 నిమిషాలకు 250 పదాలు రాయడం ఆయన అలవాటు. ఎప్పటికప్పుడు సమయం తెలుసుకోవడానికి ఒక గడియారాన్ని తన వెంట ఉంచుకునేవాడు.
- పరిచయం అవసరం లేని ప్రముఖ రచయిత్రి అగాథా క్రిస్టీ 'డైస్గ్రాఫియా'తో బాధపడేది. అంటే ఆమె స్పష్టమైన దస్తూరీలో రాయలేకపోయేది.
- డాక్టర్ స్యూస్‌కు ఓ వింత అలవాటు ఉండేది. కథగానీ, నవలగానీ రాస్తున్నప్పుడు, సరైన పదం దొరకకపోతే, వందలాది టోపీలతో నిండిన ఓ రహస్య గదిలోకి వెళ్లేవాడు. తాను అనుకున్న భావం వ్యక్తమయ్యే పదం గుర్తుకొచ్చే వరకూ, వాటిని ఒకదాని తర్వాత మరొకటిగా ధరిస్తూ ఉండేవాడు.
- ట్రూమాన్ కాపోట్ తరచుగా వెల్లికిలా పడుకుని, ఒక చేతిలో చెర్రీ గ్లాసును ఉంచుకొని, మరో చేత్తో పెన్సిల్ పట్టుకొని రచనలు చేసేవాడు
- ఎర్నెస్ట్ హెమింగ్వే, ట్రూమాన్ కాపోట్ మధ్య ఒక సారూప్యం ఉంది. ఇద్దరూ తాము రచనలు చేస్తూ, ఆలోచనల్లో మునిగిపోయినప్పుడు పెన్సిళ్లను చెక్కేవారు. పెన్సిళ్లను చెక్కడం వల్ల మంచిమంచి ఆలోచనలు వస్తాయని వారి అభిప్రాయం.

## వివిధ భాషల కలయిక..

స్కాండనేవియన్ సాహిత్యాన్ని వివిధ భాషల కలయికగా పేర్కోవాలి. స్వీడిష్, నార్వేజియన్, ఐస్లాండిక్, డానిష్, ఫారోస్ భాషల్లోని రచనలన్నీ ఈ సాహిత్యంలో చేరాయి. ఉత్తర జర్మనీ భాషల సమూహంలోని అన్ని భాషల సాహిత్యం కూడా స్కాండనేవియన్‌గానే పేర్కొంటారు. ఈ సాహిత్య రచనలు లోతైన భాషా సంబంధాలను మనకు అవగతం చేస్తాయి. ఫిన్నిష్‌కు ఉత్తర జర్మనీ భాషలతో సంబంధం లేదు. ఇది ఫిన్నో ఉగ్రిక్ భాషా కుటుంబానికి చెందిన బాల్టిక్ ఫిన్నిక్ శాఖకు బదులు, ఎస్టోనియన్, కరేబియన్ భాషలతో దగ్గరి సంబంధాన్ని కలిగి ఉంది. స్వీడన్ ఆరు శతాబ్దాలకుపైగా ఫిన్‌లాండ్‌ను పాలించింది. ఫలితంగా ఫిన్నిష్ సాహిత్యం, భాషాపరమైన తేడాలు ఉన్నప్పటికీ, స్వీడిష్ సాహిత్యంతో బలంగా ముడిబడి ఉంటుంది. స్కాండనేవియన్ సాహిత్యం రాతపూర్వకమైనదే కాకుండా, మౌఖికంగానూ ఉంటుంది. భిన్న భాష ల మాదిరిగానే, భిన్న సంస్కృతులు, భిన్న సంప్రదాయాలు ఈ సాహిత్యంతో కలిసిపోయాయి. అందుకే, చాలా ప్రాంతాల్లోని సాహిత్యానికి ఉన్న ట్టు ప్రత్యేక లక్షణాలు స్కాండనేవియన్ సాహిత్యంలో కనిపించవు. ఇది ఏ కొన్ని ప్రాంతాలకో... భాషలకో చెందింది కాదు. సార్వజనీన సామాజిక, సాంస్కృతిక జీవన దర్పణం.

# ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

## కోదాడ ఎంఎల్ఎ పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/మునగాల:** సీత రామచంద్రస్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోదాడ ఎంఎల్ఎ పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కలకోవ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన దేవాలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కలకోవ గ్రామంలో ప్రజలంతా ఏకతాటిపై ఉండి సీతరామ చంద్రస్వామి దేవాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం చాల సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యలక బిందు నరేందర్‌రెడ్డి, వైస్ ఎంపిపి కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మునగాల, మోతె మండలాల మండల అధ్యక్షులు కొప్పుల జైపాల్‌రెడ్డి, కీసర సంతోష్, వేనేపల్లి వీరబాబు, పనస విజయ్, దేవాలయ గుడి చైర్మన్ జుకూరి అంజయ్య పాల్గొన్నారు.

# ఇంటర్వ్యూలను ఎత్తివేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సివిల్స్ పరీక్షల్లో ఇంటర్వ్యూ విధానాన్ని ఎత్తివేయాలని, దీనివల్ల ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన సివిల్స్ పరీక్షా ఫలితాల్లో అనన్యరెడ్డికి రాత పరీక్షలో 875 మార్కులు రాగా ఇంటర్వ్యూలో 190 మార్కులు వేశారని, ఆమె జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించిందన్నారు. అదే ఓబీసీ వర్గాలకు చెందిన ఐశ్వర్యం ప్రజాపతి అనే విద్యార్థికి రాత పరీక్షలో 890 మార్కులు వచ్చాయని, కాని ఇంటర్వ్యూలో కేవలం 154 మార్కులు మాత్రమే శారని, బీసీల పట్ల పక్షపాతి ధోరణి స్పష్టంగా కనపడుతుందన్నారు. ఇలా ఎంతోమంది ఓబీసీలు రాత పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబ రుస్తు న్నా కావాలనే ఓబీసీలకు ఇంటర్వ్యూలో తక్కువ మార్కులు వేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, జానపాటి రవి, శేఖర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

# ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు చైతన్యవంతంగా ఆలోచించి ఓటు వేయాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు.ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవకాశవాద రాజకీయాలు పెరిగిపోతున్నాయని సంతలో సరుకులాగా ఓట్లు కొనుగోలు చేస్తున్నారని, వీటన్నంటిని ప్రజలు గమనించి ప్రజల కోసం పనిచేసే వారు సమాజ అభివృద్ధి కోసం పాటుపడే లౌకికవాదులను ఎన్నుకోవాలని ఆయన అన్నారు. ఎన్నికల్లో పోటీచేసే వారు అత్యధికులు కోటీశ్వరులని ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లను దండుకోవడానికి కార్పోరేట్లరు పయనమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, సిపిఎం హుజూర్‌నగర్,మేళ్లచెర్వు మండల కార్యదర్శులు పోసనబోయిన హుస్సేన్, వట్టెపు సైదులు, పాశం వెంకటనారాయణ పాల్గొన్నారు.

# ప్రభుత్వమే విద్యార్థిని బలి తీసుకుంది

## సిపిఐ(ఎం) పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్ ఆరోపణ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్లో ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన ప్రశాంత్ మృతికి కారణం మొత్తం ప్రభుత్వ యంత్రాంగమేనని ప్రశాంత్ మృతి అందరి హృదయాలను కలిచి వేసిందని అధికారులు పోలీసులు మొత్తం మానవ హక్కులను ఉల్లంఘించారని సిపిఎం పార్లమెంట్ అభ్యర్థి యండి జహంగీర్ ఆరోపించారు. ఆ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. ఆదివారం పోచంపల్లి మండలం పరిధిలోని జుబ్లక్ పల్లి గ్రామంలో ప్రచార కార్యక్రమంలో ఆయన అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. అలాగే ఇటీవలే చనిపోయిన హాస్టల్ విద్యార్థి కుటుంబాన్ని వద్దకు వెళ్లి తల్లిదండ్రులను ఓదార్చి జరిగిన ఘటన గురించి తెలుసుకున్నారు. మొత్తం ఈ ఘటన పైన సమగ్ర విచారణ జరపాలని దీనికి జిల్లా కలెక్టర్ పూర్తిగా బాధ్యత వహించాలని సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఉన్న అధికారులందరినీ సస్పెండ్ చేయాలని అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా, జగదీష్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, సిపిఎం మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రారెడ్డి ఉన్నారు.

# సమాజంలో సంత్ నిరంకారి సేవా కార్యక్రమాలు అభినందనీయం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సమాజంలో సంత్ నిరంకారి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎంఎల్ఎ జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంత్ నిరంకారి ఆధ్వర్యంలో మానవ ఐక్యత దినోత్సవం పురస్కరించుకుని ఆ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంత్ నిరంకారి ఆధ్వర్యంలో సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత బలోపేతం చేయాలని, తనవంతు సహాయ సహకారాలు కూడా ఎల్లప్పుడు ఉంటాయన్నారు. సంత్ నిరంకారి ముఖి కడారు సరళదేవి మాట్లాడుతూ బాబా బలిదానం సందర్భంగా మానవ ఐక్యత దినోత్సవంలో భాగంగా సంత్ నిరంకార ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు కడారు నర్సింహరెడ్డి, విద్యాసాగర్, రమాదేవి, శోభ, నిర్మల, అంజలి, రాజేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి పరులను ఓడిద్దాం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించి రామన్నపేట పట్టణ సమస్యలను పరిష్కారం చేసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నియోజకవర్గ కేంద్రమైన రామన్నపేటను పునర్నిర్మించుకోని దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కారం చేసుకోవాలంటే జహంగీర్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు వనం ఉపేందర్, బోయిని ఆనంద్, మామిడి వెంకట్‌రెడ్డి, బల్గూరి అంజయ్య, కందుల హనుమంతు, కల్గూరి నగేష్, గొరిగె సోములు పాల్గొన్నారు.

# ట్యాంకుల ద్వారా గృహాలకు నీటి సరఫరా

ప్రజాపక్షం ఎఫెక్ట్







**ప్రజాపక్షం/నందికొండ :** నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్ కాలనీ లో గత వారం రోజులుగా కాలనీలో నీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు అని శనివారం 'ప్రజాపక్షం' పత్రికలో కథనం రావడం, దానితో అధికారులు వెంటనే అప్రమత్తమై మున్సిపాలిటీ నీటి ట్యాంకుల ద్వారా తాత్కాలికంగా ఇంటికి వెళ్లి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ ట్యాంకుల ద్వారా సరఫరా చేసిన నీరు అన్ని ఇళ్లకు వెళ్లి సరఫరా చేయడం లేదని కేవలం నామ మాత్రంగా కొన్ని ఇళ్లకు మాత్రమే వెళ్లి మిగతా నీటిని పరపతి పలుకుబడి ఉన్న వాళ్లకు సరఫరా చేస్తున్నారని కాలనీవాసులు తమ గోడును వెళ్ళబోస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి నీటిని అందచేయవలసిన బాధ్యత అధికారులపై ఉందని కాలనీవాసులు అంటున్నారు.
ప్రారంభించిన పంపింగ్ వాల్వ్ మరమ్మతు పనులు ... వారం రోజులుగా పట్టించుకోని మెయిన్ పంపింగ్ వాల్వ్ మరమ్మతు పనులను ఎట్టకేలకు ఆదివారం ప్రారంభించారు. ఆదివారం ఉదయం మొదలుపెట్టిన మరమ్మతు పనులు మధ్యాహ్నానికి ఒక కొలిక్కి రావటంతో వెంటనే పంపింగ్ వాల్వ్‌ను తిప్పి పైపుల ద్వారా నీటిని పంపింగ్ చేసే ప్రయ త్నంలో ఆ నీటి ప్రవాహానికి మెయిన్ వాల్వ్ కు ఉన్న వాచర్ పగిలి నీరు లీక్ కావటంతో మళ్లీ పని మొదలుకు వచ్చిందని తల పట్టుకోవడం అక్కడ ఉన్న టెక్నీషియన్ల వంతైయింది. అయితే దానిని వెల్డింగ్ చేసి మళ్లీ బిగించినా ఆ నీటి ప్రవాహానికి అది ఆగదని కొత్తది తెచ్చి వేయాల్సి ఉంటుందని అక్కడ ఉన్న అధికారులు తెలిపారు. మరి ఆ పని ఎప్పుడు పూర్తవు తుందో మరి కాలనీలోకి నీటి సరఫరా ఎప్పుడు జరుగుతుం దో అని కాలనీ వాసులు ఎదురుచూస్తున్నారు.

# ఎంపి అభ్యర్థుల నామినేషన్లకు భారీగా తరలిరండి

## ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు



**ప్రజాపక్షం/పెగడపల్లి :** కాంగ్రెస్ పార్టీ నుంచి నిజామాబాద్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాటిపర్తి జీవన్ రెడ్డి, పెద్దపల్లి ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణ నామినేషన్ల దాఖలకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ సమావేశమయ్యారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి నిజామాబాద్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాటిపర్తి జీవన్ రెడ్డి సోమవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్‌ను దాఖలు చేయడం జరుగుతుందని, కాంగ్రెస్ నుంచి పెద్దపల్లి ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణ పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 24న బుధవారం నామినేషన్ దాఖలు చేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలలో నాలుగు గ్యారెంటీలను అమలు చేయడం జరిగిందని, మిగిలిన వాటిని త్వరలోనే అమలు చేస్తామన్నారు. బిఆర్‌ఎస్, బిజెపిలు తప్పుడు హామీలను చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, రాష్ట్ర మహిళా కార్యదర్శి తాటిపర్తి శోభారాణి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారి శ్రీనివాస్, చాట్ల విజయభాస్కర్, తడగొండ రాజు, సంది మల్లారెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.



# కొత్త పాత తేడా లేకుండా పని చేద్దాం

## ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/మునుగోడు:** కాంగ్రెస్ బలోపేతానికి కొత్త పాత తేడా లేకుండా పార్టీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపుకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఆదివారం మునుగోడు ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్ టిఆర్‌ఎస్ మండల నాయకుడు పాల్వాయి గోవర్ధన్ రెడ్డి తోపాటు మరికొంతమంది టీఆర్‌ఎస్ నాయకులు టిఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస నేత,డిసిసిబి డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, బూడిద లింగ యాదవ్,జాల వెంకన్న యాదవ్, సాగర్ల లింగస్వామి,జక్కల లింగస్వామి,బొల్ల వెంకన్న,మేకల మల్లయ్య,పందుల సంపత్,జిట్టగోని సైదులు పాల్గొన్నారు.

# గడపగడపకూ సంక్షేమ పథకాలు

## ఎంఎల్ఎ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ పట్టణ కేంద్రంలోని ఎంఎల్ఎ బాలునాయక్ నివాసంలో ఆదివారం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నియోజకవర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్థానిక ఎంఎల్ఎ నేనావత్ బాలునాయక్ పాల్గొని ఐదు సూత్రాలతో కూడిన మేనిఫెస్టో కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడుతూ ప్రతి గడప గడపకు వెళ్ళి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించి రాబోయే ఎన్నికల్లో ఎంపి అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించేలా ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో పాటు కేంద్రంలో కూడా సోనియమ్మ ప్రభుత్వం ఉంటే మరింత రాష్ట్రాన్ని దేశాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడం సులభం అని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధానిగా ఉంటే ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు పరుస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్గొండ పార్లమెంట్ ఇంచార్జీ కొర్ర రాంసింగ్, రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్ష్మీ , జిల్లా ఉపాధ్యక్షులు జయంత్‌రెడ్డి, విజయ్, సతీష్, నియోజక వర్గ ప్రధాన కార్యదర్శులు జిల్లా నియోజకవర్గ ఉపాధ్యక్షులు, పలు మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.





# యువత సివిల్ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకోవాలి

## రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** యువత సివిల్ సర్వీసెస్ ర్యాంకర్లను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. సివిల్ సర్వీసెస్ డేను పురస్కరించుకుని కరీంనగర్ మంకమ్మతోటలోని తన నివాసంలో ఆదివారం సివిల్ ర్యాంకర్లకు ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు హాజరైన నందాల సాయికిరణ్(27వ), కొలనుపాక సహన(729)లను ఆయన అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఇవి వేణుగోపాల్ ర్యాంకు సాధించేందుకు దోహదపడ్డ అంశాలపై ఇష్టాగోష్టిగా వారితో చర్చించారు. రాజ్యాంగానికి లోబడి ఉద్యోగ వృత్తిని కొనసాగిస్తూనే సమాజంలో అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలని సూచించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నేటి యువత సన్మార్గంలో పయనిస్తూ తమ జీవితల లక్ష్యాలను చేరుకుని కీర్తి, ప్రతిష్టలను పొందాలన్నారు. గొప్ప వ్యక్తులను, సివిల్ ర్యాంకర్లను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి గల్లీ నుంచి సివిల్ ర్యాంకులు సాధించి ఎదగాలని ఆకాంక్షించారు. పుట్టిన గడ్డ గర్వపడేలా మరో పది మందికి ఆదర్శంగా నిలుస్తూ పేరు, ప్రతిష్టలు సంపాదించాలని తెలిపారు. ర్యాంకర్ల లక్ష్యసాధన అంశాలపై, వాళ్ల కుటుంబ స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. పేద కుటుంబాల నుంచి వచ్చిన వారు అయినప్పటికీ మొక్కవోని దీక్షతో వీరు ర్యాంకులు సాధించడం అభినందనీయమని కొనియాడారు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు సైతం నిరాశ చెందకుండా ఉన్నత విద్యాభ్యాసం చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా డియల్‌ఎస్‌ఏ సెక్రటరీ వెంకటేష్, 14వ డివిజన్ కార్పోరేటర్ దిండిగాల మహేష్, న్యాయవాదులు ఉప్పుల అంజనీప్రసాద్, ఏవి రమణ, ఎ.కిరణ్ కుమార్, పెంచాల లక్ష్మణ్‌రావు, కొత్త ప్రకాష్, ర్యాంకర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంపిగా గెలిస్తే డబుల్ ఇంజిన్‌లా పనిచేస్తాం

## బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి వినోద్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ బిఆర్‌ఎస్ ఎంపిగా గెలిస్తే రాష్ట్రంలో ఎమ్మెల్యేగా గంగులతో పాటు కేంద్రంలో తాను కొట్లాడి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయగలుగుతామని ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బిఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ కొత్తపల్లిలో బిఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో బిఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ ఎంపిగా బండి సంజయ్ బడి తేలేదు.. గుడి తేలేదన్నారు. ఐదేళ్లుగా ఎంపిగా నియోజకవర్గం అభివృద్ధి మాట దేవుడెరుగు ఆలయాల అభివృద్ధి కోసం ఐదు రూపాయలు తేలేదని విమర్శించారు. తెలంగాణకు 23 నవోదయ పాఠశాలలు రావాల్సి ఉంటే పదేళ్ల బిజెపి పాలనలో ఒకటంటే ఒక్క నవోదయ పాఠశాల కూడా రాలేదన్నారు. నవోదయ పాఠశాల ఎందుకు తీసుకురాలేదంటూ ఓట్ల కోసం వచ్చే బండి సంజయ్‌ను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎంపి పదవి ఏమైనా బండి సంజయ్ కోసం తీసుకువచ్చారా? ఎమ్మెల్యేగా ఓడిపోతే ఎంపిగా పోటీ చేసేందుకని ఎద్దేవా చేశారు. కరీంనగర్ ఎంపి పదవి పునరావాసమా అంటూ నిలదీశారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత హక్కుల గురించి పార్లమెంటులో గళమెత్తి ప్రశ్నించే గొంతుక కావాలన్నారు. కరీంనగర్ ఎంపిగా వినోద్ కుమార్ స్మార్ట్ సిటీ, ట్రిపుల్ ఐటి తీసుకువచ్చాడన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జమీలుద్దీన్, సీనియర్ నాయకులు బండ గోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు , నాయకులు పాల్గొన్నారు.

# నల్లగొండలో కురిసిన వర్షం



**ప్రజాపక్షం/నల్లగొండ :** పొద్దతంతా తీవ్రమైన ఎండలు.. బయటికి వెళ్లాలంటేనే భయపడిపోయిన ప్రజలకు ఆదివారం సాయంత్రం ఒకేసారి మబ్బులు కమ్ముకొచ్చి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. గత కొద్ది రోజులుగా విపరీతమైన ఎండలతో విల విలలాడుతున్న ప్రజలకు వచ్చిన వర్షంతో కొంత ఉపశమనం లభించింది. అయితే అకాల వర్షంతో నల్లగొండ పట్టణంతో చుట్టుపక్కల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయానికి ఉంచిన వరి ధాన్యం తడవడంతో రైతులు కొంత ఇబ్బందులు పడ్డారు. ఒకేసారి వర్షం రావడంతో ధాన్యంపై టార్పాలిన్లు కప్పడానికి ప్రయత్నించినప్పటికీ భారీ వర్షం రావడంతో కొంతమేరకు ధాన్యం తడిసింది. ఏదేమైనా వర్షం పడటంతో చల్లదనం వచ్చిందని ప్రజలంతా ఉపశమనం పొందుతున్నారు.

# 24న రఘువీర్ రెడ్డి నామినేషన్ ర్యాలీ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్ రెడ్డి నామినేషన్ సందర్భంగా ఈ నెల 24న నల్లగొండలో నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో నామినేషన్ సందర్భంగా నల్లగొండ నియోజకవర్గ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా ఈ నెల 24న ఉదయం 10 గంటలకు పట్టణంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ మనిమద్దె సుమన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్ పాల్గొన్నారు.

# నాలుగైదు గ్రూపులకే ఉపాధి పనులు

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండలంలోని వాయిలసింగారం గ్రామంలో 25 గ్రూపులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనికోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం నాలుగైదు గ్రూపులకు మాత్రమే పని కల్పిస్తున్నారని ఉపాధి కూలీలు ఆరోపణలు చేస్తున్నారు.ఏదైనా అంటే అధికారులు ఎన్నికల కోడ్ ఉంటూ సాకు చెబుతున్నారని మరి ఎలక్షన్ కోడ్ ఉన్నప్పుడు అన్ని గ్రామాలలో పనులు ఎలా చేయిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం నీటి సమస్యతో పూర్తి స్థాయిలో పంటలు పండక పోవడంతో గ్రామాలలో ఉపాధిహామీ పని కోసం గ్రామస్తులు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ అధికారులు అలసత్వం కారణంగా పనిలేకుండా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఒక్క వాయిలసింగారం మాత్రమే కాదు దాదాపు మండలంలోని అన్ని గ్రామాలలో ఇదే తంతు జరుగుతుంది. ఉపాధి హామీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌లు గ్రామాల్లో రాజ్యమేలుతున్నారు. గతంలో మాదిరిగానే భారీ స్థాయిలో ప్రభుత్వ ధనాన్ని పక్కదారి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామాల్లో ఫీల్డ్‌కు వెళ్లి కూలీలు చేసిన పనికి కొలతలను వేసి ఎంబిలు చేయాల్సి ఉంది కానీ ఇవేమీ లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్స్ వారే టెక్నికల్ అసిస్టెంట్ అవతారం ఎత్తి కొలతలను వేసి టెక్నికల్ అసిస్టెంట్లకు పంపిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు వేసిన కొలతలను బేరిజు వేసుకుని ఎంబి చేయడం జరుగుతుంది. ఏపివో టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ ఉన్నతాదికారులకు రిపోర్టు ఇచ్చేందుకు మాత్రమే వెళ్లి ఫోటోలు పంపిస్తున్నారు. కానీ పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదు. దీని ద్వారా అర్హులు ఉపాధిహామీ పథకాన్ని ఉపయోగించుకోలేకపోతున్నారు. గత రెండు సోషల్ ఆడిట్లో అనేక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. అయినా వీరి వైఖరి మారడం లేదు.ఎంపిడివో, పిడి,జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం అనంతగిరి మండలంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

## బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి : సిపిఐ



**ప్రజాపక్షం/గుండాల :** భువనగిరి ప్రభుత్వ ఎస్సి గురుకుల హాస్టల్లో మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ నాయకులు బద్దుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి ప్రభుత్వ ఎస్సి హాస్టల్లో కలుషిత ఆహారం తిని మృతి చెందిన ప్రశాంత్ అలాగే రెండు నెలల క్రితం ఎస్సి హాస్టల్లో మరణించిన భవ్య, వైష్ణవి, సంవత్సరం క్రితం చనిపోయిన మనోహర్ ఇలా జిల్లాలో మూడు సంవత్సరాల వ్యవధిలో 9 మంది విద్యార్థుల మరణాలపై విచారణ జరిపి బా ధ్యులపై చట్టపరరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఎస్సి సంక్షేమ శాఖ నిర్లక్ష్యం వల్లనే విద్యార్థుల ప్రాణాలు కోల్పోయారని విద్యార్థుల ప్రాణాలంటే అధికారులకు నిర్లక్ష్యమా అని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో విద్యా సంస్థలు పూర్తిగా నీరుగారిపోతున్నాయని, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఇదే పరిస్థితి కొనసాగుతుందని మృతి చెందిన విద్యార్థి కుటుంబాలకు ఒక్కక్కరికి రూ. 20లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని, రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# అభివృద్ధి ఘనత బిఆర్‌ఎస్‌దే : రవిచంద్ర





**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం సంక్షేమం నుంచి సంక్షోభం వైపు తిరోగమనంలో పయనిస్తుందని బిఆర్‌ఎస్ నేతలు ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ముఖ్యమంత్రి తిట్ల దండకం మొదలుపెడితే మిగిలిన వారు ప్రజలను ఏమార్చి అసత్య ప్రచారాలతో రాజకీయాలను పక్కదారి పట్టిస్తున్నారని వారు ఆరోపించారు. ఆదివారం స్థానిక తెలంగాణ భవన్‌లో ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పార్లమెంటు బిఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వర రావు, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయాలను పక్కదారి పట్టించేందుకు వ్యక్తిత్వ హననానికి పూనుకున్నారని ఆరోపించారు. సుఫారి కల్చర్ ఖమ్మంజిల్లాలో ఉందా అని ఆయన ప్రశ్నించారు. శాంతియుతంగా పదేళ్లు పాలన సాగించిన చరిత్ర బిఆర్‌ఎస్‌ది అని హామీలు అమలు చేయకుండా ప్రజలను ఏమార్చేందుకు ఒక్కోసారి ఒక్కో కథను సృష్టిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో దాడి చేస్తే సానుభూతి ఎవరికి వస్తుందో ప్రజలకు తెలుసునని, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించే ముసుగు వీరులు త్వరలోనే బయటకు వస్తారని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో నగర అధ్యక్షులు పగడాల నాగరాజు పాల్గొన్నారు.

## జూన్ 1 వరకు ఎగ్జిట్ పోల్స్ నిషేధం

### జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ క్రాంతి వల్లూరి



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** ఈ నెల 19 నుండి జూన్ 1 సాయంత్రం ఆరున్నర గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ జాతీయ ఎన్నికల సంఘం నిషేదించినట్లు జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి వల్లూరి తెలిపారు. నిబంధనల విరుద్ధంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన పత్రికల్లో ప్రచురించిన టీవీ ఇతర ప్రసాద మాధ్యమాలో ప్రసారం చేసిన సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన చట్ట ప్రకారం చర్యలు తీసుకునున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. నిబందనలకు లోబడి జూన్ 1 సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ ఎవరు నిర్వమించవద్దని తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 126(ఎ) ప్రకారం శిక్షార్ములన తెలిపారు.

## వాహనాలు తనిఖీలు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రమైన పాపన్నపేటలోని ప్రధాన చౌరస్తా వద్ద ఏఎస్ఐ సంగన్న ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాలతో పాటు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ కూడా పరీక్షించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా మద్యాన్ని గాని, డబ్బులు కానీ తరలించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా ప్రతి వాహనాన్ని తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని ఏఎస్ఐ సంగన్న సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పలువురి చేరిక

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భూపాలపల్లి టౌన్ :** భూపాలపల్లి నియోజకవర్గం కొత్తపల్లి గోరి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ చిగురుమామిడి రజిత రాజు దంపతులు వారితో పాటు మరికొందరు బిఆర్ఎస్ సీనియర్ ముఖ్య నాయకులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లిలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. కాగా, వారందరికీ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత ఎన్ఎస్ఆర్, ఉమ్మడి రేగొండ మండల ఎంపిపి పున్నం లక్ష్మీ రవి, సీనియర్ నేత గూటోజు కిష్టయ్య, రేగొండ మండల మాజీ జడ్పిటిసి పత్తి వినోద ప్రభాకర్, జిల్లా సీనియర్ నాయకుడు పుల్లూరి బాపురావు, వెంకటేశ్వర్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కాడవేన వెంకటేష్, మాజీ ఎంపీటిసి చిగురుమామిడి కుమారస్వామి తదితరులు ఉన్నారు.

## కడియం కావ్యను భారీ మోజారిటీతో గెలిపించాలి

### 24న జరిగే సిఎం సభకు తరలిరండి

### ఎంఎల్ఎ నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్:** ఈనెల 24న మడికొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే వరంగల్ జన జాతర సభను విజయవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి సమావేశం ఎంఎల్ఏ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని డివిజన్ అధ్యక్షులు ప్రతి డివిజన నుండి వెయ్యిమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ముఖ్యమంత్రి సభలో పాల్గొనేలా చేయాలని అన్నారు. బిజెపి లాంటి మతతత్వ పార్టీ నుండి దేశాన్ని కాపాడుకోవాలని, పదేళ్ల పాలనలో బిజెపి తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. అన్ని కులాలు, మతాలతో కూడుకున్న సెక్యులర్ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో పాంచ్ న్యాయ్‌తో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ఎంపి అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ కడియం కావ్యను భారీ మోజారిటీతో గెలిపించాలని కోరారు. 24న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ పార్లమెంట్ జన జాతర సభలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎ త్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు కూచన రవళి, సీనియర్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ మొహమ్మద్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సభను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/తొర్రూరు :** ఈనెల 24న ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను జయప్రదం చేయాలని తొర్రూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సోమ రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అథిధిగా పాల్గొని మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, 100 రోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారంటీలలో 5 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని ఆయన అన్నారు. రాబోయే రోజులలో ప్రజల అభివృద్ధికి మరింత పాటుపడే విధంగా కాంగ్రెస్ పాలన ఉంటుందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత మెజార్టీ వచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ఎంఎల్ఏల యశస్వినీ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీరెడ్డి నాయకత్వంలో ముందుకు సాగాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ రామచంద్రయ్య, సురేందర్ రెడ్డి, దొంగరి శంకర్, కల్లూరి కుషాల్, బిజ్జాల అనిల్, ముద్దసాని సురేష్, మనోహర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# చేరికలతో కాంగ్రెస్‌కు లాభమా? నష్టమా?

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇతర పార్టీల నుండి కాంగ్రెస్‌లోకి వలసులు పెరిగాయి. గత కొద్ది రోజులుగా లోక్‌సభ ఎన్నికల నేపధ్యంలో ఈ చేరికలు ఊపందుకున్నాయి. కానీ చిక్కంతా ఇక్కడే వచ్చి పడింది. మొన్నటి వరకు అధికార పార్టీలో పదవులు, అధికారం అనుభవించిన వారంతా తిరిగి ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీలోకి వరుస కడుతుండడంతో గడిచిన తొమ్మిదేళ్లపాటు అధికారానికి దూరంగ ఉండి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్న కాంగ్రెస్ కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు. పైగా పదేళ్లపాటు అధికారం అనుభవించి అక్రమాలకు, అవినీతికి, భూ కబ్జాలకు పాల్పడి ప్రజలలో తీవ్ర వ్యతిరేఖత ఏర్పడిన వారంతా కాంగ్రెస్‌లోకి వస్తుండడంతో వారి ప్రభవం భవిష్యత్‌లో కాంగ్రెస్‌పైనా పడే ప్రమాదం ఉందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవ చేస్తారని నమ్మిన నాయకులకు జనం ఓట్లు వేశారు. వాళ్లను మోసం చేసి ఐదు, పది సంవత్సరాలు అధికారం అనుభవించి మళ్లీ అదే నాయకులు స్వలాభం కోసం ప్రస్తుత అధికార పార్టీలో మారి ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని వారు వాపోతున్నారు. ఈ నేపధ్యంలో మంచి అభిప్రాయం ఉన్న అధికార పార్టీపై నమ్మకం సడలి అవి ఓట్ల రూపంలో బయటకు వస్తే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ మనుగడకే ప్రమాదంగా మారుతుందేమోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల బిఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కంగ్రెస్‌లో రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి వర కు భారీగా చేరుతున్నారు. గత ప్రభుత్వంలో నియంత పాలన నుంచి విముక్తి జరిగిందని భావించే ప్రజలకు, మేధావులకు, కవులకు, సమాజాన్ని ప్రభావితం చేయగలిగే జర్నలిస్టులు, విద్యావంతులు, విద్యార్థులు, కాంగ్రెస్, బిజెపిల్లో ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే గతంలో గాయాలకు ఉపశమనం కోసం చూస్తున్న మెజార్టీ బాధితులు గ్రామాల్లో కుప్పలు, తిప్పలుగా ఉన్నారు. వీరంతా నేటికి అప్పటి పాలనకు, నేటి కాంగ్రెస్ పాలనను పోల్చి చూస్తున్నారు. ఈ క్రమంలో నాడు అధికారంలో ఉండి భూ కబ్జాలకు, అవినీతికి పాల్పడిన వారంతా నేడు కండువాలు మార్చుకుని తిరిగి అధికార పార్టీలోనే కొనసాగుతుండడం మింగుడు పడని అంశంగా మారింది. సాదారణ ప్రజలతో పాటు తమ అవకాశాలను కొల్లగొట్టేందుకు వస్తున్న ఇతర పార్టీల నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ కర్యకర్తలు కోరుతున్నారు.

**చేరికలతో అధికార పార్టీలో అసమ్మతి**

గత పదేళ్లుగా బిఆర్ఎస్ అధికారంలో ఉంది. రాష్ట్రస్థాయి నుంచి గ్రామాల వరకు ఆ పార్టీ నాయకులపై అనేక అవినీతి, అక్రమాలు, భూ కబ్జాలు, నిధులు, కుంభకోణం, సంక్షేమ పథకాల్లో, కమీషన్ల, దోపిడీ, ప్రభుత్వ నిబంధనల ఉల్లంగణ లాంటి ఆరోపణలున్నాయి. ప్రజల ఆస్తులతో పాటు ప్రభుత్వ ఆస్తులకు ఎగనామం పెట్టారు. అవన్నీ ఇప్పుడు బయటకు రావడంతో చేసిన అక్రమాల శిక్షలు తప్పించుకోడానికి రక్షణ కోసం ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, బిజెపి పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. వాళ్లు అధికారంలో ఉన్నపుడు ప్రతిపక్ష పార్టీలుగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేసిన వారే ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. దాంతో కాంగ్రెస్ పట్టణ గ్రామస్థాయిలో అధికార పార్టీ కార్యకర్తలతో తీవ్ర అసంతృప్తి పెరుగుతున్నది. మమ్మల్ని కష్టాలు పెట్టిన వాళ్లను ఎలా పార్టీలోకి తీసుకుంటారని కార్యకర్తలు బాహాటంగానే నిలదీస్తున్నారు.

**క్లీన్ చీట్ ఉన్న వారిని చేర్చుకోవాలి**

ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకుల బ్యాక్ గ్రౌండ్ తెలుసుకోవాలని, ప్రజల్లో చెడ్డ పేరు తెచ్చుకున్న వారికి కండువాలు కప్పి తెచ్చుకొని నెత్తి మీద పెట్టుకోవద్దని కార్యకర్తలు కోరుతున్నారు. అలా పెట్టుకుంటే బీఆర్ఎస్ పార్టీకి ఈరోజు ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకతను రేపు కాంగ్రెస్ పార్టీ కూడా మూటకట్టుకునే అవకాశం ఉందంటున్నారు. దానితో భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని, ప్రజల్లో మంచి ఇమేజ్‌తోపాటు ఎలాంటి అవినీతి, అక్రమాలు, మరకలు లేనివారిని చేర్చుకుంటే ఆయా కాంగ్రెస్ కార్యకర్తలకు వారిపై నమ్మకం కలుగుతుందని చెబుతున్నారు.

## పార్లమెంట్ ఎన్నికల జాగ్రత్తలపై పోలీస్‌ల సమావేశం




**ప్రజాపక్షం / సంగారెడ్డి ప్రతినిధి :** కర్ణాటక బీదర్ పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలపై కర్ణాటక తెలంగాణ రాష్ట్ర పోలీసుల సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా తెలంగాణ కర్ణాటక రాష్ట్ర పోలీసుల తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని బీదర్ లో పార్లమెంటు ఎన్నికల దృష్ట్య రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడం వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన జహీరాబాద్ పోలీసు అధికారులు కర్ణాటకలోని బీదర్ సబ్ డివిజన్ పోలీసులు సమావేశం నిర్వహించి రెండు రాష్ట్రాల పోలీసులు , పార్లమెంటు న్నికల దృష్య నిబందనలు ఉల్లంఘించి ఎవరైన డబ్బు తదితరులు తీసుకుని వచ్చినచో చట్టమైన పరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ కర్ణాటక రాష్ట్ర పోలీసులు సమావేశంలో తీర్మానించారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్దిపేట ఎంఎల్ఎ, మాజీ మంత్రి హరీష్‌రావు ఆదివారం సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై రైతులతో ముచ్చటించారు. తాము 15 రోజులుగా ధాన్యం కొనుగోలు కోసం పడిగాపులు కాస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గం పెద్ద కోడురు గ్రామపరిధిలో మెట్టుబండలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ఆధైర్య పడి తొందరపడి తక్కువ ధరకు అమ్ముకోవద్దన్నారు. రైతులకు మద్దతు ధర 2203 రూపాయలు ఇప్పించేందుకు కృషిచేస్తానన్నారు. జిల్లా అదనపు కలెక్టర్, ఆర్‌డిఒ, డిఎం సివిల్ సప్లయ్, ఐకెపి అధికారులతో మాజీ మంత్రి హరీష్‌రావు ఫోన్‌లో మాట్లాడి వెంటనే వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. గత 15 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నరని, రైతులను ఆదుకోవలన్నారు. అకాల వర్షం మూలంగా ధాన్యం తడిసిందని, ప్రభుత్వమై పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే కరెంటు కోతలు, పంటలు ఎండిపోతున్నాయన్నారు. మోటర్లు సైతం కలిపోతున్నాయన్నారు. రైతుబంధు సైతం రైతులకు అందటం లేదన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు రాధకిషన్‌శర్మ, కాముని శ్రీనివాస్. ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిజెపి.. దొందుదొందే

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** అవినీతికి చిరునామాగా పేరొందిన కాంగ్రెస్ పార్టీని మతోన్మాదం పేరుతో ప్రజల మధ్య విభజన రాజకీయాలు చేస్తున్న బిజెపి పార్టీలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ప్రత్యేక తెలంగాణ సాధంచి దశాబ్ది కాలంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి, దీమా వ్యక్తం చేశారు. అమీన్పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో ఎంపీపీ దేవానందం గృహంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు కార్యకర్తలతో బిఆర్ఎస్ మెదక్ ఎంపి అభ్యర్థి వెంకటరామిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ విజయవంత అత్యంత అవశ్యకమని వెంకట్రామ్‌రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేసి భారీ మెజార్టీ అందించాలని వారికి సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు మించి ఓట్లు సాధించాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### 188 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

### వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** యాసంగిలో రైతులుసాగు చేసిన పంటలను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, రైతులు కొనుగోలు కేంద్రాలు అమ్మకాలు చేస్తూ మద్దతు ధర పొందాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 207 కొనుగోలు కేంద్రాలు ఉండగా ఇప్పటి వరకు 188 కేంద్రాలను ప్రారంభించడం జరిగిదని, అందులో 40 కేంద్రాల నుండి ధాన్యం సేకరించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 505 రైతుల నుండి 3131. 580 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం అన్ని చోట్ల అకాల వర్షాలు పడుతున్నాయని, అన్ని కేంద్రాల్లో సరిపడు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి జాప్యం లేకుండా కొనుగోలు జరిపి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని, ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, వందశాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని సూచించారు. డిఆర్‌డిఒ, డిసిఒ, మెప్మా, డిఎఒ 2 క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు పర్యవేక్షించుటకు మండల ప్రత్యేక అధికారులను, తహసీల్దార్‌లను నియమిస్తూ ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం ఎగుమతి ఎటువంటి జాప్యం లేకుండా వేగంగా జరగాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులను తరలించాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఈనెల 20న కురిసిన వర్షాలతో జిల్లాలో ఎక్కడ ధాన్యం ఎక్కువగా తడవలేదన్నారు. క్షేత్రస్థాయిలో అదనపు కలెక్టర్ , డిసిఎస్ఓ, డిఎంసిఎస్‌సి, డిఆర్‌డిఓ, డిఏఓ, డిసిఓ సిబ్బంది పర్యవేక్షించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాలలో ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, రైతులు దళారీల వద్ద మోసపోకుండా కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏదైనా సమస్యలు ఉంటే రైతులు కంట్రోల్ రూమ్ నెంబర్ 7995050785కు సంప్రదించాలని సూచించారు.

## ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేయాలి

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**ప్రజాపక్షం/రాయపర్తి :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను కచ్చితంగా అమలు చేసి తీరాలని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ కారు గుర్తుకే ఓటు వేసి భారీ మెజారిటీతో గెలుపించాలని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీకి ఒటింగ్ పెరిగిందిని, ఇప్పుడు ప్రజలు కాంగ్రెస్ పార్టీ నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు అయ్యే దిశగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి అని అన్నారు. నేడు వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ నామినేషన్ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఎన్నికల ఇంచార్జి గుడిపూడి గోపాల్ రావు,మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహా నాయక్, ఎంపిపి జినుగు అనిమి రెడ్డి, జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, జిల్లా పార్టీ నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ జక్కుల వెంకట్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడి దారుణ హత్య



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** బీహార్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు దారుణ హత్యకు గురైన సంఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన సర్విన్ కుమార్ యాంజి తన ఇద్దరు సోదరులతో కలిసి బతుకుతెరువు కొరకు ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి వచ్చి వివిఎం ఆగ్రో కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో అదే రాష్ట్రానికి చెందిన ఇద్దరు మిత్రులతో సంజయ్, ఓం ప్రకాష్‌తో కలిసి కిరాణా సరుకులు తేవడానికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత సంజయ్ రూమ్‌కి తిరిగి వచ్చేసాడు. సర్విన్ కుమార్ రూమ్ కి రాకపోవడంతో అతడిని వెతుకుతూ వారి సోదరులు ఇద్దరు వాళ్లు పనిచేసే వివిఎం ఆగ్రో కంపెనీ వద్దకు వెళ్లి చూడగా కంపెనీ సమీపంలో రక్తపు మడుగులో తల పగిలి సర్వింగ్ కుమార్ చనిపోయి ఉన్నాడు. పక్కనే బండరాయి రక్తంతో కనిపించింది. దీంతో ఓం ప్రకాష్ సర్విన్ కుమార్‌ని బండరాయితో తల పగలగొట్టి చంపి పారిపోయినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు.

# బిజెపి అబద్ధాలను ఎండగట్టాలి

### వరంగల్ ఎంపి అభ్యర్థి కడియం కావ్య



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** బిజెపి ప్రచారం చేస్తున్న అబద్దాలను ఎండగట్టాలని, ఆ పార్టీ అభ్యర్థి అరాచకాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. ఆదివారం హన్మకొండ పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సోషల్ మీడియా సన్నాహక సమావేశంలో కడియం కావ్య మట్లాడారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ డిసిసి అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రచార రథాలను లోక్‌సభా నియోజకవర్గ అభ్యర్థి కడియం కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా ప్రజలలోకి తీసుకు వెళ్లాలని, బిజెపి వైఫల్యాలను ఎండగట్టాలని కోరారు. ప్రజల కష్ట సుఖాలలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, తనకు మద్దతివ్వాలని కోరారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా సైనికులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, నెగెటివ్ వార్తలపై కౌంటర్ ఇవ్వాలని అన్నారు. మీకు అండగా కాంగ్రెస్ ఉంటుందని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో సోషల్ మీడియా రాష్ట్ర ఇంచార్జీ నవీన్,రాష్ట్ర ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ ఆనంద్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** అకాల వర్షాలకు అధైర్యపడవద్దని.. ప్రతి గింజను కొనుగోలు చేస్తామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి చెప్పారు. ఆదివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుండి యాసంగి 2023–24 వరి పంట ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో టెలికాన్ఫరేన్స్ నిర్వహించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిచించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 11.305 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 2.365 రైతుల నుండి కొనుగోలు చేసినట్లు తెలిపారు. అన్ని కేంద్రాలకు సరిపడు టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంతో అవసరమగుప్రాంతాల్లో టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎటువంటి జాప్యం లేకుండ ధాన్యం కొనుగోలు జరిపి రైస్‌మిల్లులకు తరిలించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వందశాతం ట్యాబ్ ఎంట్రీ చేయాలని డిఆర్డిఓ, జయదేవ్, డిసిఓ తనుజ, పిడిమెప్మా హన్మంత్‌రెడ్డిని ఆదేశించారు. రైతులు దళారుల వద్ద మోసపోకుండ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో డిఎం సివిల్ సప్లయ్ హరీష్, డిసిఎస్ తనుజ, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా ముడి పదార్థాల పట్టివేత



**ప్రజాపక్షం/నెక్కొండ :** బల్లార్షా నుండి మానుకోట జిల్లా కేవ్లతండాకు అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పట్టిక, గుడుంబాకు ఉపయోగించే ముడి పదార్థాలను ఆదివారం నెక్కొండ రైల్వేస్టేషన్‌లో అనుమానంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారని ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మానుకోట జిల్లా కేవ్ల తండాకు చెందిన భూక్య సోమ్లు నుండి రూ.31,500 విలువ గల 75 కెజిల నల్లబెల్లం, 10 కెజిల పటిక స్వాధీనం చేసుకున్నామని సోమ్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### బేగంపేటలో ప్రారంభానికి నోచుకోని

# ధాన్యం కొనుగోలు కేంద్రం



**ప్రజాపక్షం/బెజ్జంకి :** మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎప్పుడు ప్రారంభిస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారు. గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కోసి వ్యవసాయ బావుల వద్ద కల్లాల్లో రాశులుగా పోసి కొనుగోలు కేంద్రం కోసం ఎదురు చూస్తున్నామని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో కొంత మంది దళారులు కల్లాల్లోనే వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తు తాలు తరుగు పేరుతో కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు స్పందించి ప్రత్యేక చొరవ తీసుకోని గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

## అభద్రతా భావానికి లోనుకావొద్దు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** విద్యార్థులు పరీక్షల్లో ఫయిల్ అయితే అభద్రతా భావానికి లోనుకావొద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిహెచ్ మధుసూదన్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సందర్భంగా డిఎం అండ్ హెచ్ ఓ మాట్లాడుతూ, మరో రెండు రోజుల్లో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలి తాలు వెలువడనున్న నేపథ్యంలో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకావొద్దని చెప్పారు. ఒక వేళ ఫయిల్ అయితే పట్టుదలతో చదివి సప్లిమెంటరీ పరీక్షలు రాసి పాస్ కావాలే తప్ప ఆత్మహ త్యలకు పాల్పడ వద్దన్నా రు. మానసిక సమస్యలు ఉంటే టెలిమానస్ టోల్ ఫ్రీ నంబర్ (14416)కు కాల్ చేయాలని, వైద్యులు ఉచితంగా కౌన్సిలింగ్ ఇస్తారని చెప్పారు. ప్రత్యేకం గా కౌన్సిలింగ్ అవసరమని గుర్తిస్తే కుటుంబ సభ్య లు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మానసిక ఆరోగ్య విభాగాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.



## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/కడెం :** ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కడం మండల జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి,తో పాటు లక్ష్మీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ విజయ రాజన్న కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ కడం మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్,గోళ్ల వెంకటేష్,మాజీ సర్పంచ్ లచ్చన్న ఉన్నారు.

## గీతకార్మికులను ఆదుకోవాలి

కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వినోద్ కుమార్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** తంగళ్లపల్లి మండలం తాడూర్ ఎల్లమ్మ దేవాలయం వద్ద తాటివనం దగ్ధమైన ప్రదేశాన్ని బిఆర్ఎస్ నాయకులు, గీతకార్మికులతో కలిసి కరీంనగర్ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ పరిశీలించారు. కాలిన తాటి చెట్లను పరిశీలించి వెంటనే హార్టికల్చర్ వైస్ చాన్సలర్ నీరజతో ఫోన్లో మాట్లాడుతూ కాలిన తాటి చెట్లను ఏ మేరకు రక్షించవచ్చు,వెంటనే శాస్త్రవేత్తలను పంపించి కాలిన తాటి చెట్లను పరిశీలించే విధంగా చూడాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతూ తాటి చెట్లు దగ్ధమై గీతకార్మికుల ఉపాధి పోయిందని వెంటనే వారిని ఆదుకోవాలన్నారు. కాలిన తాటిచెట్లు వర్షాకాలంలోగా చిగురించకుంటే గతంలో తాను బీహార్ రాష్ట్రంలోని పాట్నా నుంచి పొట్టి తాటి విత్తనాలు తెప్పించి కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని గీతకార్మికులకు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఇప్పుడు కూడా పొట్టి తాటి విత్తనాలను నా సొంత ఖర్చులతో తీసుకురావడంతో పాటు ఒక వేళ నర్సరీలలో పొట్టి తాటి మొక్కలు దొరికిన కూడా కాలిన తాటి చెట్ల ప్రదేశంలో నాటించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మానస రాజు, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీలు, గీతకార్మికులు పాల్గొన్నారు.

## భద్రత బలగాలతో ఫ్లాగ్ మార్చ్

**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జిల్లా ఎస్ పి కె. సురేష్ కుమార్ ఆదేశాల మేరకు పెంచికల్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో డి.ఎస్.పి కరుణాకర్ ఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్ భద్రతా బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించడం జరిగింది. ఆదివారం ఈ ఫ్లాగ్ మార్చ్ ను డి.ఎస్.పి కరుణాకర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిఎస్పి మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు అందరూ సహకరించాలని, ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అల్లర్లు జరుగకుండా వుండాలని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి సాధించడం జరుగుతుందని, ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ రూరల్ సిఐ అల్లం రాంబాబు, ఎస్ఐ కొమురయ్య, కేంద్ర బలగాలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డిబిఎల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జాతీయ రహదారి గుండా బస్టాండ్లను నిర్మించడంలో విఫలమైన డిబిఎల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రెబ్బెన ఆసిఫాబాద్ వాంకిడి మండలాల మీదుగా ఎన్‌హెచ్ఎఐ జాతీయ నాలుగు వరుసల రహదారి 2019 సంవత్సరంలో రెబ్బెన మండలం తక్కలపల్లి గ్రామం నుంచి వాంకిడి మండలం గోయగాం వరకు మంజూరై 2024 సంవత్సరంలో పూర్తి కావస్తుందన్నారు. కానీ రహదారి పూర్తి కాకముందే డిబిఎల్ కంపెనీ యాజమాన్యం టోల్ గేట్లు ఏర్పాటు చేసి వాహనదారుల వద్ద నుంచి రాకపోకలకు టోల్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా అధ్యక్షులు గెడం టీకానంద్, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ చాపిడి పురుషోత్తం, జిల్లా సహాయ కార్యదర్శిలు దుర్గం రాజ్ కుమార్ వడ్లూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి యూత్ బాక్సింగ్ సెలక్షన్స్

**ప్రజాపక్షం / నస్పూర్ :** సిసి కార్నర్ లోని కుమార్ గన్నర్స్ అకాడమీలో జిల్లాస్థాయి యూత్ మెన్ అండ్ ఉమెన్స్ బాక్సింగ్ సెలక్షన్స్ ఆదివారం జరిగాయి. కుమార్ గన్నర్స్ అకాడమీ ఫౌండర్, ఆర్మీ రిటైర్డ్ అధికారి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని అన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ స్థాయిలో బాక్సింగ్ క్రీడలో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పాదం రవీందర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు 26 నుండి 28వ తేదీ వరకు జరగబోయే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బోయిని రాజ్ కుమార్ అభినందించారు. త్వరలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు కొట్టే దేవేందర్, రాజేష్, మహేష్, జగత్, సాయి, రమేష్ పాల్గొన్నారు.

## భరత్ మృతి పట్ల పువ్వాడ సంతాపం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సిపిఐ నాయకుడు పగడాల మల్లేష్ కుమారుడు పగడాల భరత్ మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఖమ్మం నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెంలోని వారి స్వగృహంకు వెళ్లి పగడాల మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించారు. భరత్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భరత్ మృతి అత్యంత బాధాకరమని, చిన్న వయస్సులోనే ఇలా జరగడం విచారకరమని పువ్వాడ తెలిపారు. భరత్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థించినట్లు పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. నివాళులర్పించిన వారిలో కార్పొరేటర్ కూరాకుల వలరాజు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

కాంగ్రెస్ అభ్యర్థి సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలి



**ప్రజాపక్షం/ముథోల్ :** పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కోరారు.ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి సుగుణతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో వచ్చిన నాటి నుండి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాభివృద్ధికి పెద్ద పీట వేస్తూ పథకాలను అందిస్తోందన్నారు. ఉచితంగా బస్సు ప్రయాణం, రూపాయలు 500లకే గ్యాస్ సిలెండర్,వృద్ధులకు,వితంతువులకు పెన్షన్ లతో పాటు, మహిళ సంఘ సభ్యులకు వడ్డీలేని రుణాలను అందిస్తోందని వివరించారు.రైతు రుణమాఫీని సైతం చేయనున్నదని ఇతర పార్టీల నాయకులు చెప్తున్న బూటకపు మాటలు నమ్మొద్దని తెలిపారు.కాంగ్రెస్ తోరు సాధ్యమని ప్రజలు గుర్తించాలని విన్నవించారు.గత పదేళ్లలో దేశంలోని బీజేపీ ప్రభుత్వం ఆదిలాబాద్ పార్లమెంట్‌కి ఇచ్చిన హామీలను ఎన్ని నెరవేర్చిందో తెలపాలన్నారు. అభివృద్ధి చేయక ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ఓట్లను పొందుతున్నారన్నారని ఆయా పార్టీలపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఒక ఉద్యమ మహిళను గుర్తించి టికెట్ అందించిందని తెలిపారు.ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగువవేసి అభివృద్ధి చేసుకుందామని వెల్లడించారు. స్థానిక గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఎన్నో ఏళ్లుగా తాము గ్రామానికి సేవలందిస్తుమని తమ సేవలను గుర్తించి తగు వేతన కల్పించి ఆదుకోవాలని మెమోరాండం తో సీతక్కను కోరారు.అనంతరం ఎంపీ అభ్యర్థి సుగుణ మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలకై పోరాడుతానని హామీ ఇచ్చారు.గత పదేళ్లలో గెలిచిన రెండు పార్టీలు చేయని అభివృద్ధి ఇప్పుడేం చేస్తారని ప్రశ్నించారు. జిల్లాకు రావాల్సిన ఆర్మూర్ రైల్వే లైన్,బాసరలో కేంద్రియ విద్యాలయం,మూతపడ్డ సిమెంట్ ఫ్యాక్టరీలకు పూర్వవైభవం తీసుకొచ్చేలా ప్రజల గొంతుకగా నిలుస్తానని హామీ ఇచ్చారు. పేదింటి ఆదివాసీ బిడ్డయిన తనను ప్రజలు ఆశీర్వదిస్తారని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల,విట్టల్ రెడ్డి,ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్,నాయకులు వాహజ్,అజీజ్,జమీల్,కిషన్ పటేల్,ప్రేంనాథ్ రెడ్డి,గోవింద్ పటేల్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ తోనే సుపరిపాలః మంత్రి సీతక్క**

**ప్రజాపక్షం/తానూర్ :** కాంగ్రెస్ తోనే దేశ అభివృద్ధి సాధ్యం మని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని సింగన్గావ్,గ్రామంలో అంబేద్కర్ జయంతిలో మంత్రి సీతక్క పాల్గొని జెండా ఆవిష్కరణ చేసి,అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జవుల(బి) గ్రామంలో మంత్రి సీతక్క రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మోడీ రైతులకు రుణాలు మాఫీ కూడా చేయలేదన్నారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్టమెంట్ అభ్యర్థి అత్రం సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించాలని,చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అత్రం సుగుణ,మాజీ ఎంఎల్ఏ లు నారాయణరావు పటేల్,విట్టల్ రెడ్డి,మాజీ సర్పంచ్ మాధవ్ రావు పటేల్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**బాసరలో మంత్రి సీతక్క విస్తృత పర్యటన..**

**ప్రజాపక్షం/బాసర :** నిర్మల్ జిల్లాలోని బాసర మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి,ఆదిలాబాద్ పార్లమెంటరీ ఇంచార్జి మంత్రి సీతక్క విస్తృతంగా పర్యటించారు. రాబోయే ఎంపీ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుగణక్కను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు..స్థానికంగా ఉన్న రవీంద్రాపూర్,శారదనగర్,అంబేద్కర్ కాలనీలలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు.

## కార్మికచట్టాల పునరుద్ధరణకు బిజెపిని ఓడిద్దాం

సింగరేణిలో 138 మే డేను జయప్రదం చేయండి

ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు ఉపేందర్



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ ప్రతినిధి :** సింగరేణిలోని అన్ని మైన్స్ లో 138వ మే డే ను ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షులు బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం రోజున ఎఐటియుసి ఆధ్వర్యంలో మే డే వాల్ పోస్టర్లను గోలేటి సిహెచ్‌పిలో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, కార్మిక చట్టాల పునరుద్ధరణకై దేశంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఓడించాలని దేశాన్ని రాజ్యాంగాన్ని ప్రజలను రక్షించుకోవాడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే సింగరేణిలో రోజురోజుకి ఎండ తీవ్రత ఎక్కువ ఉందని కావున కార్మికుల పని వేళలను మార్చాలని యాజమాన్యాన్ని కోరారు. ఉత్పత్తి సాధించిన కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని, కార్మిక పిల్లలకు సిబిఎస్ఇ సిలబస్ స్కూల్ ను ప్రారంభించాలని, సింగరేణిలో లాభాల వాటాను ప్రకటించాలని, కాంట్రాక్టు కార్మికులకు జీవో నెం 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో పౌర ప్రజాసామ్య పాలన అంతమైందని, పెట్టుబడిదారీ విధానం కొనసాగుతుందని, కార్మిక వర్గం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు 29 చట్టాలను సమూలంగా రద్దుచేసి పెట్టుబడుదారులకు అనుకూలంగా నాలుగు కోడ్ లను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తెచ్చిందని ఆరోపించారు. పెన్షన్ చట్టాలను అమలు చేయాలని, హమాలి, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలని, భవన నిర్మాణ కార్మికుల మరణానికి 10 లక్షలు చెల్లించాలని, ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని, సింగరేణి కాంటాక్ట్ కార్మికులను ఆర్‌టిసిలో పనిచేస్తున్న ప్రైవేట్ హైర్ బస్ డ్రైవర్లను పర్మనెంట్ చేయాలని, సింగరేణిలో గుర్తింపు పత్రం ఇవ్వాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల సిసిఎస్ డబ్బులను వెంటనే చెల్లించాలని అన్నారు. అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం కార్మికులకు 26,000 కనీస వేతనం చెల్లించాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ విధానాన్ని సవరించి పెండింగ్లో ఉన్న జీతాలను చెల్లించాలని, అన్ని రకాల కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు 600 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని కార్మికులు కర్షకులు అందరూ మే డే ఉత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కోల్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి గోలేటి బ్రాంచ్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, నాయకులు ఎం.సతీష్, కృష్ణ, సంతోష్, వేముర్ల స్వామి, రాజు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన ఇద్దరు ఆక్రమణదారుల అరెస్టు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి ఇదివరకే విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించినందుకు గాను నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. అందులో ఇద్దరు పరారీలో ఉండగా మిగిలిన ఇద్దరిని అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన తెల్ల రాజయ్య(54) పవర్‌లూమ్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని సర్వే నెంబర్ 233/ఇ లో ప్లాట్ నెంబర్ 16లో 293 గజాల స్థలాన్ని 2003లో మూల గౌరారెడ్డి వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఇదిలా ఉండగా మూల గౌరారెడ్డి మరణానంతరం అతని కొడుకైన ఏ1 మూల తిరుమల రెడ్డి గతంలో తమకు విక్రయించిన తమ ప్లాట్లకు గల 50 ఫీట్ల రోడ్డు వారికి చెందిందేనని, దానిని ఆక్రమించి రెండు ప్లాట్లుగా విభజించి తిరుమల రెడ్డి తల్లి ఏ4 మూల వీరమ్మ పేరిట తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి దానిని ఏ3 మూల సూర్యప్రకాష్ రెడ్డి, ఏ2 లంక శేఖర్‌లకు విక్రయించినట్లుగా తప్పుడు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సృష్టించడమే గాక వాటి ఆధారంగా గోడను సైతం సృష్టించారని, విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన కరీంనగర్ రూరల్ పోలీసులు బాధితుడి ఫిర్యాదులో తెలిపిన విషయాలు నిజమేనని తేలినందున నలుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అందులో ఏ1, ఏ2 గ ఆ ఉన్న మూల తిరుపతిరెడ్డి, లంక శేఖర్‌లను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా కేసును పరిశీలించిన మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించగా కరీంనగర్ జైలుకు తరలించినట్లు కరీంనగర్ రూరల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు.

## ఓటుహక్కు వినియోగంపై కళా ప్రదర్శనలు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఎడమల శ్రీధర్ రెడ్డి కళాబృందం చే ఓటు హక్కు వినియోగం పై కళ ప్రదర్శన రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇవ్వడం జరుగుతుంది. అందులో భాగంగా ఆదివారం రోజు సిరిసిల్ల పట్టణం లోని విద్యానగర్, గీతానగర్ చౌరస్థలో లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ కళా ప్రదర్శనను ప్రదర్శించారు. ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు మన అందరి హక్కు అని, రాజ్యాంగం ద్వార కల్పించిన ఓటు హక్కును భారత దేశంలోనీ పౌరులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓటర్లు విధిగా తమ ఓటు హక్కు వినియోగించుకొని రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాలని ఆట పాటల ద్వారా కళ ప్రదర్శనను ఇచ్చి ప్రజలలో ఓటు హక్కు పై ప్రజలకు అవగాహనను కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎడమల శ్రీదర్ రెడ్డి,ఉపాధ్యక్షులు శ్రీరాముల రామచంద్రం, గద్దం శ్రీనివాస్, వంతడుపుల గణేష్, గుగ్గిళ్ల పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు తరగతులకు తప్పనిసరిగా హాజరు కావాలి



**ప్రజాపక్షం/ బెల్లంపల్లి :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రం బెల్లంపల్లిలో ప్రతి ఆదివారం నిర్వహించే తరగతులకు విద్యార్థులు తప్పక హాజరు కావాలని కేంద్రం గౌరవ అధికారి టి.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రంలో ఆదివారం ఉదయం 11 గంటలకు విద్యార్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్రం గౌరవ అధికారి డాక్టర్ టి.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ కార్యకలాపాలతో పాటు విద్యార్థులకు తరగతులు, పరీక్షలు, ప్రాక్టికల్స్ తదితర విధి విధానాల గురించి విద్యార్థులకు వివరించారు. పరీక్షల నిర్వహణ, మోడల్ పేపర్లు, యూనివర్సిటీ యూట్యూబ్, వెబ్ రేడియోతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి తెలిపారు. విద్యార్థులందరూ ఈ సమావేశం ద్వారా అందిన విషయాలను దృష్టిలో పెట్టుకొని ఆదివారాల్లో నిర్వహించే తరగతులకు తప్పకుండా హాజరు కావాలని, బాగా చదువుకొని, కౌన్సిలర్ల సలహాలు సూచనలు తీసుకొని పరీక్షలు మంచిగా రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ డిగ్రీ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కౌన్సిలర్లు ఎన్. ఏకాంబరం, జి. మోహన్, డాక్టర్ కంబాల మురళీకృష్ణ, అల్లం తిరుపతి, కె. సమ్మక్క, కార్యాలయ సిబ్బంది రాజయ్య, సుధాకర్, ప్రథమ సంవత్సరం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## 150 మందికి పరీక్షలు, మందులు అందజేత

**ప్రజాపక్షం /పెద్దపల్లి :** పెద్దపెల్లి పట్టణంలోని అమర్చంద్ కళ్యాణ మండపంలో గాండ్ల సంఘం, వెలుగు స్వచ్ఛంద సంస్థ , గ్రీన్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ చెందిన డాక్టర్ రామనాథన్ మెడికవర్ హాస్పిటల్ బృందం సౌజన్యంతో మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో దాదాపు 150 మంది పైగా పాల్గొన్నారు , వీరికి ఈసీజీ , టూడీకో, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరిగింది,ఈ సందర్భంగా అధ్యక్షులు డాక్టర్ లెక్కల నగేష్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపైన శ్రద్ధ వహించాలని, మారుతున్న కాలానుగుణంగా నేటి యువతలో, పెద్దలలో అధిక రక్తపోటుతో గుండె వ్యాధులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని, వాటి నిర్మూలన కోసం ముందు జాగ్రత్త చర్యగా ఈ యొక్క శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు.ఈ సమావేశంలో గాండ్ల యువజన నాయకులు వెన్నంపల్లి శరత్, బొల్లం అనిల్, జక్కం మహేష్ , వేన్నంపల్లి శశిధర్, బొల్లం ఉమా శంకర్,సీనియర్ పాత్రికేయు లు జక్కం మారుతి, వెన్నపల్లి శ్రీనివాస్, మహిళా రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, జక్కం రమాదేవి ,వెన్నంపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

## మానసిక ధైర్యాన్ని నింపేందుకే మోడల్ ఎంసెట్

ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత ప్రవేశం

ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్, నిట్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించేందుకు మోడల్ ఎంసెట్, నిట్ పరీక్షలను అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో రేపు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా మోడల్ ఎంసెట్ మానసిక ధైర్యాన్ని కలిగిస్తుందన్నారు. 25 ఏళ్లుగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి మోడల్ ఎంసెట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే పరీక్షలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విద్యార్థుల సమయం వృధా కాకుండా పరీక్షలు ఎలా రాయాలి అనేది కూడా చాలా ఉపయోగమన్నారు. వీటన్నింటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ ఎంసెట్, నిట్ ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్ (ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయం)లో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 8106146993, 9666680674, 9398191241 నెంబర్లను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, వంశీ, రాహుల్, హరికృష్ణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సిఎ క్రికెట్ క్యాంప్‌కి సెంటినరీ కాలనీ విద్యార్థులు

**ప్రజాపక్షం /రామగిరి :** సెంటినరీ కాలనీ కి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు క్రికెట్ క్యాంప్‌కి ఆదివారం తరలి వెళ్ళారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్.సి.ఏ) ఆధ్వర్యంలో ప్రతి జిల్లా లో ఒక సమ్మర్ క్రికెట్ క్యాంప్ ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా పెద్దపల్లి జిల్లా కి చెందిన క్యాంప్ ని గోదావరిఖని జీఎం కాలనీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. హెచ్.సి.ఏ అధ్యక్షులు అర్షనపల్లి జగన్ మోహన్‌రావు, కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆగమరావు , ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు, ఆధ్వర్యంలో కోచ్ కిరణ్ కుమార్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. సెంటినరీ కాలనీకి చెందిన పల్లె సాక్షిత్ రావు, వరుణ్, హర్ష వర్ధన్, విన్ను, శశాంక్, అర్జున్ రాజ్,జాగృత్, లక్ష్మి రాజ్, సాత్విక్, ఆవేజ్ బేగ్ ఈ క్యాంప్‌లో శిక్షణకి వెళ్ళారు. మే 20 వరకు క్యాంప్‌ను గోదావరి ఖని లో నిర్వహిస్తారు.



## మోదీ పాలనలో దేశం ఆర్థిక పరిపుష్టి : నగేష్



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం ఆర్థిక పరిపుష్టి సాధించిందని అదిలాబాద్ బిజెపి ఎంపి అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. ఇటీవల బిజెపి పార్టీలో చేరిన ఆసిఫాబాద్ జెడ్‌పిటిసి అరిగెల నాగేశ్వరరావుతో కలిసి ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలోమాట్లాడారు. అరిగెల నాగేశ్వరరావు చేరికతో పార్టీ మరింత బలంగా మారిందని, వారి చేరికతో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో భారీ మెజారిటీ ఖాయమైందని తెలిపారు. భారతీయ జనతా పార్టీలో విలువలతో కూడిన, నిజాయితీ గల నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలు ఉన్నారని, ఆ కార్యకర్తల అకుంఠిత దీక్షతో కూడిన కృషితో భారీ మెజారిటీతో గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎంపిపి అరిగెల మల్లికార్జున్, పార్టీ జిల్లా బాధ్యులు, మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాద, నియంతృత్వ బిజెపిని ఓడిద్దాం : దిడ్డి సుధాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో మతోన్మాద, నియంత్రుత్వ బిజెపిని ఓడిద్దామని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని మగ్దూం భవన్‌లో ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావుతో సుధాకర్ నేతృత్వంలో ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి యమున గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు విజయ్ మల్లంగి, సోషల్ మీడియా ప్రతినిధులు మహమ్మద్ సోహెల్‌లతో భేటీ అయ్యారు. దేశంలో ప్రస్తుత రాజకీయాలపై చర్చలు జరిపారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ ఇరు పార్టీల నాయకత్వం రాష్ట్రంలో బిజెపిని ఓడించాలని నిర్ణయించాయని తెలిపారు. అందుకోసం ఇండియా కూటమిలోని అన్ని పార్టీలను ఒకే వేదికపై తీసువచ్చి లోక్‌సభ ఎన్నికలలో మతోన్మాద పార్టీలను మట్టి కరిపించాలన్నారు. విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, రైతాంగ, సంఘాలతో సమావేశాలను సదస్సులను ఏర్పాటు చేసి, ప్రజలను చైతన్య వంతులను చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద కుంభకోణం ఎలక్టోరల్ బాండ్లు అన్నారు. సుప్రీంకోర్టు కల్పించుకొని, ఎలక్టోరల్ బాండ్లు పెద్ద అవినీతి అని బయట పెట్టిన విషయాన్ని ప్రజలకు తెలియజెప్పాలన్నారు. మరోసారి బిజెపి గెలిస్తే ఈదేశంలో ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకం అవుతుందన్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికలలో మతతత్వ పార్టీలైన బిజెపి, ఎంఐఎంలను ఓడిస్తామన్నారు.

## దేశ భవిష్యత్తు కోసమే 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' : కిషన్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: దేశ భవిష్యత్తు కోసమే వన్ నేషన్, వన్ ఎలక్షన్ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో "బిజెపి మ్యానిఫెస్టో తెలుగు అనువాద" పత్రాన్ని బిజెపి ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్‌తో కలిసి కిషన్‌రెడ్డి ఆదివారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివృద్ధికి బిజెపి కట్టుబడి ఉందని,అనేక సమస్యలను మోదీ పరిష్కరించారని అన్నారు. మూడు దశాబ్దాల తరవాత ప్రధాని మోదీ నేతృత్వంలో స్థిరమైన, సమర్థవంతమైన ప్రభుత్వం ఈ దేశంలో ఏర్పాటైందన్నారు. నాణ్యమైన విద్య, అందరికీ అందుబాటులో వైద్యం, తినడానికి తిండి మోదీ గ్యారంటీ అన్నారు. ఉగ్రవాద దాడులు తగ్గిపోయాయని, నక్సలైట్ల భరతం పడుతున్నామని, అవినీతి పరులు జైళ్లలోకి పోయారని, అవినీతిపై ఉక్కు పాదం మోపడం మోదీ గ్యారంటీ అని అన్నారు. రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్ ప్రకారం దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి (యునిఫామ్ సివిల్ కోడ్) అమలు చేస్తామన్నారు. డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ మోదీ గ్యారంటీ అంటే బిజెపి ప్రవేశపెట్టిన సంకల్ప పత్రం అన్నారు. యువత, మహిళలు, రైతులు, పేదల సంక్షేమం, అభివృద్ధి ఎజెండాగా బిజెపి సంకల్ప పత్రాన్ని మోదీ గ్యారంటీగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు.

## హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎబివిపి మూకదాడులు

### దోషులను శిక్షించాలి : తమ్మినేని వీరభద్రం

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎబివిపి మూక దాడులను ఆపాలని, దీనిపైన విచారణ చేపట్టి, దోషులను శిక్షించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. సెంట్రల్ యూనివర్సిటీలో గత వారం రోజులుగా ఎబివిపి నాయకత్వంలో జరిగిన దాడులలో ఏడుగురు విద్యార్థినులతో సహా 20మంది విద్యార్థులు గాయపడ్డారని తెలిపారు. ఎన్నికల వాతావరణంలో సున్నితమైన అంశాలను ముందుకుతెచ్చి, రాజకీయ ప్రయోజనాల కోసం ఒక పథకం ప్రకారమే దాడులు చేస్తున్నారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులకు భద్రత కల్పించాలని, బాధితులపై బైండోవర్ కేసులను ఎత్తివేయాలని,, వేధింపులు ఆపాలని ఆయన కోరారు.

## ప్రమాణం చేసి ఓట్లు అడగడం ఎన్నికల కోడ్ ఉల్లంఘించడమే

### ఎంఎల్‌ఎ కె.పి.వివేకానంద



ప్రజాపక్షం/హైదరాబాద్: రుణమాఫీ అంశంలో సిఎం రేవంత్ రెడ్డి దేవునిపై ప్రమాణం చేశారని, ప్రమాణం చేసి ఓట్లు అడగడం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమేనని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.పి.వివేకానంద అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం పేరుతో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలను పిలిపించుకుని వారికి కాంగ్రెస్ కండువా కప్పే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, గడ్డం రంజిత్ రెడ్డిలపై కాంగ్రెస్ పార్టీ క్యాడర్ తిరుగుబాటు చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపి స్థానాలు గెలవకపోతే సిఎం కుర్చీ పోతుందని రేవంత్‌రెడ్డి భయపడుతున్నారన్నారు. హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ కుదేలైందన్నారు. కెసిఆర్ బస్సుయాత్రతో బిఆర్‌ఎస్‌కు మంచి ఫలితాలు వస్తాయని, హైదరాబాద్ నగరంలో కెటిఆర్ రోడ్‌షోలు నిర్వహిస్తారని వివేకానంద తెలిపారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపికి డిపాజిట్లు గల్లంతు

### మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలకు డిపాజిట్లు గల్లంతు అవుతాయని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని పార్టీ కార్యకర్తలు రక్తం ధార పోసి అధికారంలోకి తీసుకవచ్చారన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పదేళ్ల పాలనా కాలంలో ప్రజలు విసుగు చెందారన్నారు. మోదీ ప్రభుత్వం మీడియా స్వేచ్ఛను ఉల్లఘించిందన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలో వచ్చి రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. దేశ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపి అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. 25 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యే మాతో టచ్‌లో ఉన్నారని మాజీ సిఎం కేసీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నాలుగేళ్లలో కూలిపోయిందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం విధానాలతోనే కరువు ఏర్పడిందన్నారు.

### దేశానికి మరో స్వాతంత్ర్యం రావాల్సిన అవసరం ఉంది : కూనంనేని

దేశానికి మరో స్వాతంత్ర్యం రావాల్సిన అవసరం ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించాలన్నారు. మాజీ సిఎం కేసీఆర్ కమ్యూనిస్టులను మోసం చేశారని, కమ్యూనిస్టులను మోసం చేస్తే ఎన్నికల్లో ఓటమి, గెలుపులో ఎంతో ప్రభావం ఉంటుందన్నారు. నల్లగొండ ఎంపి అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపుకు సిపిఐ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కోదాడ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు ఉత్తమ్‌పద్మావతిరెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, మాజీమంత్రి కుందూరు జానారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, నల్లగొండ ఎంపి అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, నల్లగొండ డిసిసి అధ్యక్షుడు శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, ఐఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, పిసిసి సభ్యులు దొంగరి వెంకటేశ్వర్లు, తన్నీరు మల్లిఖార్జున్‌రావు, సాముల శివారెడ్డి, అల్లం ప్రభాకర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, ఎండి అజీజ్‌పాషా, ఈదప్పగంటి సుబ్బారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, యల్లావుల రాములు, కాంగ్రెస్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోదీని ఓడించడమే దేశానికి విముక్తి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికలో ప్రజలు ప్రధాని మోదీని ఓడించడంతోనే దేశానికి విముక్తి లభిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలు దేశంలో ప్రాధాన్యత ఎన్నికలన్నారు. మోడీ దేశ ఆచార సాంస్కృతి సాంప్రదాయాలకు, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. మోదీ ప్రభు త్వం గత ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగత యువతకు 2కోట్ల ఉద్యోగాలు, రైతు ఆదాయం రెట్టింపు, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు, ప్రతి ఒక్కరికి గృహం సదుపాయం కల్పిస్తామని వంటి హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో బిజెపి ప్రభుత్వానికి రూ.8 కోట్లు వచ్చాయన్నారు. మోదీ దేశంలో ఖరీదైన ఎన్నికలుగా మార్చారన్నారు. మోడీ తన పదవి కోసం ఏమైనా చేస్తాడన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రతిపక్షంలో ఉంటే సిబిఐ, ఇడి కేసులతో వేధింపులకు గురిచేశారన్నారు. మోదీ మతం పేరుతో రాజకీయాలను చేస్తున్నారన్నారు. ఎంపి ఎన్నికల్లో కేంద్రంలో ఇండియా కూటమికి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థుల గెలుపునకు సిపిఐ కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన బాగుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, ఉస్తేల సృజన, దేవరం మల్లీశ్వరీ, గుండు వెంకటేశ్వర్లు, ఉస్తేల నారాయణరెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, ధూళిపాళ ధనుంజయనాయుడు పాల్గొన్నారు.

# చదువుతో పాటు సమాజాన్ని చదవాలి

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : విద్యార్థులు చదువులతో పాటు సమాజాన్ని చదవాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలన్నారు. మోడల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల ఒక అవగాహన వస్తుందని, అదే విధంగా మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ నగర కేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మోడల్ ఎంసెట్, నీట్ పరీక్ష పత్రాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రాజేశంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నీట్ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఉండడానికి, ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి మోడల్ ఎంసెట్, నీట్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ పరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విద్యార్థులకు సమయం వృధా కాకుండా పరీక్ష ఎలా రాయాలో అనేది ఉపయోగమన్నారు. వీటన్నింటికై ఒక అవగాహన కల్పించేందుకు ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పరీక్షలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని మణికంఠరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నాయకులు కనకం సాగర్, కేశబోయిన రాము యాదవ్, అలువాల విష్ణు, నగర నాయకులు వినయ్ రెడ్డి, మచ్చ పవన్, బీరం అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యానికి వెళ్తే.. ప్రాణాలు తీస్తున్నారు

### రెనే ఆసుపత్రిని సీజ్ చేయాలి : ఎఐఎస్‌ఎఫ్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని, వైద్యానికి వెళితే ప్రాణాలు తీస్తున్నాయని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగంధర్ ఆరోపించారు. వైద్యం కోసం వస్తే ప్రాణాలు తీసిన జిల్లా కేంద్రంలోని రెనే ఆసుపత్రిని సీజ్ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం ఆస్పత్రి ఎదుట బాధితులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఈనెల 19న రామడుగు మండల కేంద్రానికి చెందిన చేత్రిక్‌ను జిల్లా కేంద్రంలోని రెనే ఆస్పత్రికి తీసుకురాగా అతనికి గుండెలోపల రంధ్రం ఉందని వెంటనే సర్జరీ చేయాలని డాక్టర్లు సూచించారు. రూ.1.70 లక్షలు ప్యాకేజీలో వైద్య చేస్తామని డాక్టర్లు చెప్పారు. దీంతో బాధిత కుటుంబం లక్ష రూపాయలు చెల్లించారు. శనివారం ఉదయం డాక్టర్లు సర్జరీ చేస్తుండగా ఆక్సిజన్ పూర్తిస్థాయిలో అందకపోవడంతో వైద్యుల నిర్లక్ష్యం కారణం గా తమ కుమారుడు చనిపోయాడని కుటుంబసభ్యులు ఆరోపించారు. ధనార్జనే ధ్యేయంగా రోగుల జీవితాలతో కార్పోరేట్ ప్రైవేట్ ఆసుపత్రులు చెలగాటమాడుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రోగులను వైద్యం పేర చంపటమే పనిగా వైద్యం చేస్తున్నారన్నారు. విచ్చలవిడిగా కార్పోరేట్ ప్రైవేట్ ఆస్పత్రులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అనుమతులిస్తున్నారన్నారు. ఇటీవల శ్రీలత హాస్పిటల్, నేడు రెనే హాస్పిటల్‌లో ఇలాంటి సంఘటనలు జరిగాయన్నారు. భవిష్యత్తులోనూ మరెన్నో సంఘటనలు జరిగే అవకాశాలు లేకపోలేదన్నారు. రెనే ఆసుప్రతిని వెంటనే సీజ్ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# సింగరేణి కార్మికులకు ప్రోత్సాహకాలివ్వండి

### సీతారామయ్య, రాజ్‌కుమార్ డిమాండ్



ప్రజాపక్షం /శ్రీరాంపూర్ : సింగరేణి అభివృద్ధి, ఉత్పత్తిలో భాగస్వామ్యమైన కార్మికులకు సంస్థ ప్రోత్సాహకాలను అందించాలని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణిలో కాలం చెల్లిన ఎస్‌డిఎల్ యంత్రాల స్థానంలో నూతన యంత్రాలను కొనుగోలు చేయాలని కోరారు. ఆదివారం నస్పూర్ పట్టణంలోని సింగరేణి గార్డెన్స్‌లో ఏఐటియుసి శ్రేణులకు ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్మికోద్యమము, నాయకత్వ లక్షణా లు, కార్మిక చట్టాలు, లేబర్ కోడ్‌లు, లౌకికవాదం, మతం మతోన్మాదం, బిజెపి కేంద్రంలో అమలు చేస్తున్న హిందుత్వ ఎజెండా, రిటైర్డ్ కార్మికులకు బెనిఫిట్స్, స్టాండింగ్ ఆర్డర్స్, మైన్స్ రూల్స్, వృత్తిపరమైన జబ్బుల నివారణ, గుండె జబ్బుల నివారణ, ఆరోగ్య సూత్రాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో రికార్డ్ స్థాయిలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిన సింగరేణి ఉద్యోగులకు బంగారు నాణెం బహుమతిగా ఇవ్వాలని, నూతన క్యాడర్ స్కీం అమలు చేయాలని, నూతన రక్షణ పరికరాలు ఇవ్వాలని సింగరేణి యాజమాన్యాన్ని అడిగినట్లు తెలిపారు. గత ఏడాది గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగినప్పటికీ ఇప్పటికీ తమకు గుర్తింపు పత్రం ఇవ్వలేదన్నారు. ఇదే విషయమై డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కలువగా తాము కేవలం ఎన్నికలు మాత్రమే నిర్వహిస్తామని, గుర్తింపు ధృవీకరణ పత్రం సింగరేణి యాజమాన్యమే ఇస్తుందని తెలిపారన్నారు. తమకు అలవెన్సులపై ఐటీ చెల్లిస్తామనే పార్టీ అభ్యర్థులనే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తామని సింగరేణి కార్మికులు డిమాండ్ చేయాలన్నారు. కొత్త గనుల వేలం పాటలో పాల్గొనడానికి రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యానికి అనుమతి ఇవ్వాలన్నారు. కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం, కారుణ్య నియామకాల్లో వారసుల వయస్సు పరిమితి 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ లు ముస్కె సమ్మయ్య, కె.వీరభద్రయ్య, షేక్‌బాజీ సైదా, ప్రసాద్‌రెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

## ఇసుక తోడేళ్లు (మొదటి పేజీ తరువాయి)

వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ ఈ ప్రాంత వనరులు దోచుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో వందలాది లారీలు అడవి మార్గం గుండా అధిక లోడుతో అతి వేగంగా వెళ్లడం ద్వారా మూగజీవాలు రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ కిందపడి మృత్యువాత పడుతున్నాయని పలువురు ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ ఎలాంటి ఇసుక మైనింగ్ తవ్వకాలు జరపవద్దని గత న్యాయస్థానాలు తీర్పునివ్వడంతో ఈ ప్రాంతంలో ఇలాంటి ఇసుక తవ్వకాలు మైనింగ్ తవ్వకాలు జరుపకూడదని జిల్లా అధికార యంత్రాంగం ఇసుక క్వారీలను మూసివేసింది. నాయస్థానం తీర్పుతో మూసి వేయబడిన క్వారీలకు మళ్లీ క్వారీలు నడపడానికి ఏ విధంగా న్యాయస్థానాలు తీర్పునివ్వడం జరిగిందని ప్రజలు చర్చించుకుంటూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. **కరకట్టకు పొంచి ఉన్న ప్రమాదం...** ఏటూరు నాగారం గ్రామానికి కరకట్ట ఆనుకుని ఉండడంతో గోదావరి నది నడిబొడ్డులో ఇసుకలో రహదారులు ఏర్పాటు చేసి భారీ యంత్రాలతో అట్టడుగులో నీరు వచ్చే విధంగా ఇసుకను తోడుతూ, ఇసుక అక్రమ రవాణా చేస్తుండడంతో గ్రామానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కరకట్ట కోతకు గురై గ్రామంలోకి పెద్ద ఎత్తున వరద నీరు చేరడంతో తమ ఇల్లు వదిలి ఖాళీ చేసి ప్రాణాలు అరచేతిలో పట్టుకొని రోజుల తరబడి పునరావాస కేంద్రాలలో తల దాచుకోవడం జరిగిందని, కరకట్ట పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక మైనింగ్ దందాను నిలిపివేయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## గాజాపై దాడులు (మొదటి పేజీ తరువాయి)

డాలర్ల సహాయక ప్యాకేజీని ఆమోదించగా, అందులో 9 బిలియన్ డాలర్లను గాజాకు మానవతా సాయంగా అందించనుంది. కాగా, పలు విడతలుగా జరిగిన దాడుల్లో రఫా నగరంలోని కొన్ని ప్రాంతాలు ధ్వంసమయ్యాయి. వరుస దాడులతో అల్లాడిపోతున్న గాజా స్ట్రిప్ నుంచి వేలాది మంది సుదూర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. రఫా నుంచి 80 శాతం మంది ఇళ్లు విడిచిపెట్టి, తీరప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. హమాస్ ఉగ్రవాదుల ఏరివేత పేరుతో పాలస్తీనాపై ఇజ్రాయెల్ మొదలుపెట్టిన యుద్ధం ఆరు నెలలుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఫలితంగా రఫాతోసహా, గాజా స్ట్రిప్‌లోని అనేక ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. ఎప్పుడు, ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. కనీస సౌకర్యాలు కూడా లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పటి వరకూ కనీసం 34,000 మంది పౌరులు మరణించినట్టు పాలస్తీనా వర్గాలు పేర్కొంటున్నాయి. హమాస్‌ను తుదముట్టించి, వారి వద్ద బందీలుగా ఉన్న తమ దేశ ప్రజలను విడుదల చేయిస్తానంటూ భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్న ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమిన్ నెతన్యాహు, ఒకవైపు ఎన్నికలకు సిద్ధమవుతూనే, మరోవైపు పాలస్తీనాతో యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. ఇరాన్‌పై తాజాగా దాడులు నిర్వహించి, మరో యుద్ధానికి తెరతీశారు. హమాస్, హౌతీ నుంచి ప్రమాదం పొంచి ఉందని విస్తృతంగా ప్రచారం చేసుకుంటూ, మరోసారి ఎన్నికల్లో గెలవాలన్నది నెతన్యాహు వ్యూహం.

## కరీంనగర్‌కు రాధాకిషన్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో హైదరాబాదులోని చెంచల్‌గూడ జైలు సిబ్బంది కట్టుదిట్టమైన భద్రత మధ్య కరీంనగర్‌కు తీసుకువచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితునిగా ఉన్న మాజీ డిసిపి రాధాకిషన్‌రావు జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. తన తల్లి సరోజిని దేవి (98) అనారోగ్యం బాధపడుతుండడంతో ఆమెను స్థానిక సాగర ఆసుపత్రిలో జాయిన్ చేశారు. మార్చి 12న అనారోగ్యం బారిన పడడంతో ఐసియులో చేర్చి చికిత్స అందిస్తున్నారు. రాధాకిషన్‌రావు తల్లి ఓ వ్యాధితో బాధపడుతోంది. తల్లి చికిత్స కోసం నాంపల్లి కోర్టు ప్రత్యేక అనుమతి మంజూరు చేసింది. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో కరీంనగర్ చేరుకున్న రాధాకిషన్ రావు తల్లిని పరామర్శించి చికిత్సకు సంబంధించిన పూర్తి ఏర్పాట్లను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్‌లోని ఆసుపత్రి వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న ఖైదా కావడంతో రాధాకిషన్‌రావుకు ఎస్కార్ట్, పాయిలెట్ వాహనాలను ఏర్పాటు చేసి కరీంనగర్‌కు తరలించారు. తల్లితో దాదాపు నాలుగు గంటల పాటు ఆసుపత్రిలో గడిపిన రాధాకిషన్‌రావును కోర్టు ఇచ్చిన సమయం ముగియడంతో తిరిగి హైదరాబాద్ చంచల్ గూడ జైలుకు తరలించారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ — రంగారెడ్డి
ఖమ్మం | సోమవారం | 22 ఏప్రిల్, 2024 | 9

## గిరిజనుల సంక్షేమానికి అధిక నిధులు



**ప్రజాపక్షం/కేశంపేట:** తెలంగాణ రాష్ట్ర గిరిజన చైర్మెన్ బెల్లయ్యనాయక్‌ను గిరిజన సంఘం నాయకుడు, మాజీ సర్పంచ్ రూప్లానాయక్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బెల్లయ్యనాయక్‌ను రూప్లా నాయక్ గజమాలతో సత్కరించారు. గిరిజన సంఘం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకువచ్చి వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌కు ఇవిఎం, వివి ప్యాక్‌లు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** షాద్‌నగర్ పట్టణంలోని మినిస్టేడియానికి భారీ బందోబస్తు మధ్య ఈవిఎం మిషన్లు, వివి ప్యాక్‌లను ఆదివారం ఎన్నికల అధికారులు భద్రపరిచారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్డిఒ) వెంకటమాధవరావు, ఫరూఖ్‌నగర్ తాసీల్దార్ పార్థసారథిల పర్యవేక్షణలో 328 ఈవిఎంలు, 368 వివిప్యాక్‌లు, 328 కంట్రోల్ యూనిట్లను అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి రూమ్‌లను సీజ్ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.

# నగర కీర్తి కిరీటంలో మరో కలికితురాయి

## నాంపల్లి మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్

### పూర్తికావొచ్చిన ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్

### హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ అధునిక పార్కింగ్ కాంప్లెక్స్ హైదరాబాద్ నగర కీర్తి కిరీటంలో మరో కలికితురాయిగా మారుతుందని హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ ఎండి. ఎన్‌విఎస్ రెడ్డి అన్నారు. దేశంలో నూతన పార్కింగ్ విప్లవానికి మల్టీలెవల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్(ఎంఎల్‌పి) ప్రాజెక్టు నాంది అవుతుందన్నారు. నాంపల్లిలో ఎంఎల్‌పి పనులు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. నాంపల్లిలో నిర్మాణంలో ఉన్న మల్టీలెవల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్ పనులను ఆదివారం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్‌విఎస్ రెడ్డి మాట్లాడుతూ పబ్లిక్ ప్రైవేట్ పర్టనర్‌షిప్(పిపిపి) విధానంలో ఈ ప్రాజెక్టుని రూ.80 కోట్ల ప్రైవేట్ పెట్టుబడితో నిర్మిస్తున్నామని చెప్పారు. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మన దేశంలో ప్రపథమంగా జర్మన్ పాలిస్ పార్కింగ్ విధానంలో, తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేసేలా ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు. నాంపల్లి మెట్రో రైల్ స్టేషన్‌కు సమీపంలో హెచ్‌ఎంఆర్‌కు చెందిన అర ఎకరం స్థలంలో 15 అంతస్తులుగా ఈ కాంప్లెక్స్ నిర్మాణం జరిగిందని చెప్పారు. ఇందులో 10 అంతస్తుల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం, ఐదు అంతస్తుల్లో కమర్షియల్ షాపులు, రెండు స్క్రీన్‌లతో కూడిన ఒక ఫిల్మ్ థియేటర్ ఉంటాయని వివరించారు. మొత్తం ఒక లక్ష, 44 వందల చదరపు అడుగుల నిర్మిత ఏరియాలో 68 శాతం పార్కింగ్ కోసం, మిగిలిన 32 శాతం వాణిజ్య సదుపాయాలకు కేటాయిస్తున్నామని వెల్లడించారు. పార్కింగ్ స్థలంలో 250 కార్లు, 200 ద్విచక్రవాహనాలు నిలిపేందుకు అవకాశం ఉందన్నారు. పిపిపివిధానంలో మెస్సర్స్ భారీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 50 సంవత్సరాల రాయితీ కాలంతో ఈ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టిందన్నారు. కోవిడ్ తీవ్రత, డెట్ ఫైనాన్సింగ్ సమస్యలు, గ్లోబల్ సప్లయ్ చైన్ అంతరాయాలు తదితర కారణాలతో ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. ఈ సమస్యలన్నింటిని అధిగమించామని తెలిపారు. అతిత్వరలో ఆధునిక పార్కింగ్ సౌకర్యం ప్రజలకు అందుబాటులోకి రానుందని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు.

### అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పార్కింగ్..




కాంప్లెక్స్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు లోపలకు, బయటకు(ఇన్ /అవుట్) టెర్మినల్స్, వాహనాల నిలుపుదల కోసం టర్న్ ఏర్పాట్లు ఉన్నాయి. వాహనదారుడు తమ వాహనాన్ని వదిలితే సరిపోతోంది. ఎంఎల్‌పి లోనికి వాహనం ప్రవేశించిన సమయంలో వాహనదారులకు స్మార్ట్ కార్డు జారీ అవుతుంది. తరచు ఎంఎల్‌పిని వినియోగించేవారికి ఆర్‌ఎఫ్‌ఐడి కార్డులు జారీ చేస్తారు. వాహనదారులకి ఏ టెర్మినల్ కేటాయించినది ముందుగానే తెలుపుతారు. వాహనం కొలతల ఆధారంగా కంప్యూటరైజ్డ్ పార్కింగ్ సిస్టమ్ ద్వారా వాహనాల వర్గీకరణ జరుగుతుంది. ఎస్‌యువి లేదా సెడాన్ వాహనానికి తగినట్లుగా పార్కింగ్ బేలు కేటాయిస్తారు. ఆతర్వాత ట్రాన్స్ పోర్టర్ షటిల్ ఆ వాహనాన్ని లిఫ్ట్ ద్వారా నిర్ణీత అంతస్తులో కేటాయించిన స్థలంలో పార్క్ చేస్తుంది. ఈ మేరకు విశాలమైన, సౌకర్యవంతమైన టర్న్ ఏర్పాటు చేశామని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. ముంబాయి, ఢిల్లీలో ఉన్న ఎంఎల్‌పి పార్కింగ్ వ్యవస్థలలో వాహనదారులు కొంత ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, ఆ పరిస్థితి ఇక్కడ ఉండదని ఆయన అన్నారు.

### రివర్స్ తిప్పాల్సిన అవసరం లేకుండానే..

పార్క్ చేసిన వాహనాన్ని తిరిగి పొందడానికి, డ్రైవర్ పార్కింగ్ రుసుం చెల్లించి, పార్కింగ్ టిక్కెట్‌ను కార్డ్ రీడర్‌కు చూపగానే, ట్రాన్స్ పోర్టర్‌షటిల్ ఆటోమేటిక్‌గా కారును వాహనదారునికి అందజేస్తుంది. డ్రైవర్ కారుని రివర్స్ తిప్పుకోవాల్సిన అవసరం లేకుండా వస్తుంది. పార్కింగ్ కోసం కేవలం ఒక నిమిషం కంటే తక్కువ సమయం, తిరిగి తీసుకెళ్లడానికి 2 నిమిషాలు మాత్రమే పడుతుందని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ఎంఎల్‌పి దేవలపర్ల డాక్టర్ హరికిషన్ రెడ్డి, భావనా రెడ్డిలను త్వరలో నెలలోగా ట్రయల్ రన్ ప్రారంభించాలని ఎన్‌విఎస్ రెడ్డి కోరారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలి : వర్రె వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/ఇబ్రహంపట్నం :** సమాచార హక్కు చట్టంపై ప్రజలందరూ అవగాహన పెంపొందించుకోవాలని సమాచారశాఖ మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మున్నూరు కాపు భవనంలో సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం అవగాహణ సదస్సుకు వర్రె వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రభుత్వ కార్యాలయాల్లో సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాలల్లో సమాచార హక్కు చట్టం బలోపేతం కావటానికి యువత నడుం బిగించి ఉద్యమివచాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యం పరిరక్షణ చెందాలంటే కాంగ్రెస్ వల్లె సాధ్యమతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుములా రేవంత్ రెడ్డి సమక్షంలో ఆరు గ్యారంటి సంక్షేమ పథకాలతో రాష్ట్రం అన్ని రంగాలల్లో అభివృద్ధి చెందన్నుదని అన్నారు.దేశంలో రాహుల్ గాంధి ప్రధాన మంత్రి కావలంటే భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని భారి మోజార్టితో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో ఎండి ఖుర్షిద్ పాష,కృష్ణ రెడ్డి, సామ రామ్మోహన్,సురేశ్,శంకర్ రాథోడ్,విద్యా సాగర్ రెడ్డి,కె సురేశ్,ఘని తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బండ మల్లన్న కల్యాణం



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** నందిగామ మండలం మామిడిపల్లిలో ఆదివారం బండ మల్లన్న కల్యాణోత్సవాన్ని భక్తులు ఘనంగా జరిపించారు. రెండు రోజులపాటు నిర్వహించిన వేడుకల్లో మొదటిరోజు పుట్టబంగారంతో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. రెండవరోజు బండ మల్లన్న కళ్యాణోత్సవాన్ని జరిపించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం కాంగ్రెస్ నాయకులు జినుకుంట్ల నవీన్‌కుమార్‌గౌడ్, సతీష్‌ముదిరాజ్‌లు అన్నదానం చేశారు. సాయంత్రం దేవాలయం వద్ద మల్లన్న, ఎల్లమ్మలకు గ్రామస్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రాజుగౌడ్, జగన్‌రెడ్డిలతో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** మాదాపూర్ లోని శిల్పారామంలో వారంతపు కార్యక్రమాలలో భాగాంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, భరతనాట్య నృత్య ప్రదర్శన, కూచిపూడీ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించి శిల్పారామం సందర్శకులను ఏంతగానో అలరించారు. కార్యక్రమంలో బెంగూళురు నుండి విచ్చేసిన భరతనట్య కళాకారిణి శ్రీమతి పార్వతి బాలకృష్ణన్ తన నృత్య ప్రదర్శనలో తోడియా మంగళం, శ్రీనగర లహరి, అన్నమాచార్య కీర్తన, జావాళి, తిల్లాన అంశాలను నృత్య రూపకం లో నృత్యించి శిల్పారామం కు విచ్చేసిన సందర్శకులను ఏంతగానో అలరించారు. తదుపరి హైద్రాబాద్‌కు చేందిన ప్రముఖ కూచిపూడీ నాట్య గురువు కిరణ్ శిష్య బృందంచే కూచీపూడీ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. నృత్య ప్రదర్శనలో వినాయక కౌతం,జతిపర్వం, మూషిక వాహన, రామ కోదండరామా,పుష్పాంజలి, జయలక్ష్మి ,హిమగిరి తనహ, దశావతారాలు, జయ జయ రామనాధ తిల్లాన అంశాలను సమన్వి, తన్వి, మీరు, రాగ, అక్షర, సౌగంధిక, అంజలి, పర్ణిక, లలిత మొదలైన కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నాట్య గురువర్యులు రోహిణి కందాల విచ్చేసి నాట్య కళకారులను అభినందించారు.

## ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కార్పొరేటర్ లచ్చిరెడ్డి ప్రచారం



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బిజేపి పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలుపించాలని బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్‌లోని ఎస్‌కేడి నగర్‌లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం కార్పొరేటర్ లచ్చిరెడ్డి నిర్వహించారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ దేశంలో మోడీ పాలనకు ప్రజలు తీరిగి స్వాతీస్తున్నారని, మోడీతోనే దేశం ముందుకు సాగుతుందన్నారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకోచ్చిన ప్రధాని మోడీ మాత్రమే అని మోడీ పాలనకు మూడో సారి ముచ్చటగా మోడీని స్వాగతం పలకాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలుపించాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో బిజేపి పార్టీ నాయకలు శ్రీధర్ రావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిజెపి మాటలు నమ్మొద్దు

### మహబూబ్‌నగర్ బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/కేశంపేట :** కాంగ్రెస్, బిజెపిల కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మవద్దని మహబూబ్‌నగర్ బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేశంపేట మండల కేంద్రంలోని శారద గార్డెన్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి సాధించిందని, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసగిస్తూ అస్థవ్యస్థ పాలనను సాగిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేని స్థితిలో ఉందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను భారీ మెజారిటితో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, కేశంపేట ఎంపిపి రవీందర్‌యాదవ్, బిఆర్‌ఎస్ నాయకులు లక్ష్మి నారాయణగౌడ్, రాంబల్‌నాయక్, రాజ్యలక్ష్మి , నర్సింగ్‌రావు, విశ్వనాథం, శేఖర్‌రెడ్డి, అంజిరెడ్డి, నారాయణరెడ్డి, జమాల్‌ఖాన్, నవీన్‌కుమార్, మల్లేష్‌యాదవ్, వెంకట్‌నారాయణరెడ్డి, శేఖర్‌పంతులు, యాదయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదమా..కంగారొద్దు!



**హైదరాబాద్ :** ప్రమాదాలు జరిగిన తర్వాత తీసుకునే చర్యలు కంటే అవి జరగకుండానే జాగ్రత్తలు తీసుకుంటే మేలంటున్నారు అగ్నిమాపక శాఖ అధికారులు. ఇందులో భాగంగానే అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆ శాఖ సిబ్బంది, అధికారులు హైదరాబాద్ మాదాపూర్‌లోని బహుళ అంతస్తుల భవనంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆయా భవనాల్లో ఉండే వారు ఎలా స్పందించాలి, తక్షణం చేయాల్సిన పనులేంటి? సమయస్ఫూర్తిగా ఎలా నడుచుకోవాలి తదితర అంశాలపై చైతన్యం కల్పించారు. భవనం పైఅంతస్తులో మంటల్లో చిక్కుకుంటే వారిని బ్రాంటో స్కైలిఫ్ట్ వాహనం ద్వారా సురక్షితంగా బయటకు తీసుకువచ్చే విధానాన్ని అగ్నిమాపక శాఖ కళ్లకుకట్టింది. మంటల్ని నియంత్రించేందుకు ఉపయోగించే పరికరాలను పరిచయం చేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో అన్ని జిల్లాల్లో కలిపి 40 వేల మంది సిబ్బంది పాల్గొన్నారు. ప్రధానంగా పరిశ్రమలు, పెట్రోల్ బంక్‌లు, ఆసుపత్రులు, ఎల్పీజీ గోదాములు, బహుళ అంతస్తుల భవనాలు, షాపింగ్ మాల్స్‌లో అగ్నిప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు అగ్నిమాపక సిబ్బంది, అధికారులు సిద్ధంగా ఉండాలని ఆ శాఖ డీజీ నాగిరెడ్డి సూచించారు. అగ్నిప్రమాదాల నివారణపై తగిన అవగాహన కలిగి ఉంటే ప్రమాద తీవ్రత పెరగకుండా అరికట్టవచ్చని అగ్నిమాపక శాఖ చెబుతోంది. 'ఏప్రిల్ 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. వారోత్సవాల్లో బాగంగా అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నాం. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిపై అందరికీ అవగాహన కల్పించాలనేదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రతి బిల్డింగ్‌లో స్మోక్ డిటెక్టర్ ఉంటాయి. మంటలు రాగానే అలారం మోగుతుంది. సెక్యూరిటీ సిబ్బంది స్పందించి మంటలను అదుపు చేస్తారు' అని అగ్నిమాపక శాఖ డిజి నాగిరెడ్డి అన్నారు. ఏటా జరుగుతున్న అగ్నిప్రమాదాల్లో ప్రాణ, ఆస్తి నష్టాలు భారీగా చోటుచేసుకుంటున్నాయి. 2021లో 85 భారీ అగ్నిప్రమాదాలు జరిగాయి. 2022లో వీటి సంఖ్య 104కు చేరింది. 2021లో జరిగిన ప్రమాదాల్లో 25 మంది మృతి చెందగా, 2022లో 45 మంది మృతి చెందారు. 2021లో రూ.996.75 కోట్లు, 2022లో రూ.723.14 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను ప్రమాదాల్లో కాపాడారు. అదే ఏడాది సికింద్రాబాద్ క్లబ్‌లో రూ.15 కోట్లకుపైగా ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదాలు పునరావృతం కావొద్దంటే ప్రజల్లో అవగాహన ముఖ్యమని అధికారులు చెబుతున్నారు.

## మల్కాజిగిరిలో కాంగ్రెస్‌దే విజయం

### ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురట ఖాయమని ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ నివాసంలో వివిధ పార్టీలకు చెందిన 1500 మంది పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనకు ప్రజలు స్వాగతం పలుకుతున్నారని ఆయన తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలుపించాలని పార్టీ నాయకులను, కార్యకర్తలను సూచించారు. డివిజన్‌లో బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు జోగురాములు, కోటగిరి ఉషారాణి, మనీష్ గౌడ్‌తో పాటు దాదాపు 1500 మందిని మహేందర్‌రెడ్డి కండువ కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఎన్‌రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్, జూపల్లి అంజయ్య, బచన్, రషీద్, మౌలానా బాష, జువ్వగాని రాజు గౌడ్, పాశం శ్రీకాంత్, శేఖర్, కార్తీక్, జితేందర్, కార్తీక్, పాటి రాంబాబు గౌడ్, వరలక్ష్మి , సరస్వతి, పద్మ, అమృత, మాధవి, రేణుక, గణపతి నాయక్, గోవర్ధన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యారంటీలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

### కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మోదీ ప్రభుత్వాన్ని మరొకసారి గెలిపించి కేంద్రంలో మూడవసారి అధికారం అందించాలని చేవెళ్ళ బిజెపి ఎంపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం ప్రచారంలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం లో చేవెళ్ళ బిజెపి ఎంపి అభ్యర్థి అయిన తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ డివిజన్ పరిధీలోని గంగారం స్వాగత్ హోటల్ వద్ద నుంచి దీప్తిశ్రీ నగర్, ఏంఏ నగర్, ప్రశాంత్ నగర్, జెపి నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్, మయూరి నగర్, మియాపూర్, అల్విన్ చౌరస్తా, మంజీర రోడ్డు మదిన గూడ చెరువు, హాఫిజ్‌పేట్, ఆర్‌టిసి కాలనీలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎదయం కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో వాకర్స్‌తో కలసి వ్యాయమం చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే13న భారీసంఖ్యలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, కమలం పువ్వు గుర్తు కు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని, ఇప్పుడు అదే గ్యారెంటీల పేరు తో దేశ ప్రజలను మోసం చేయాలని చూస్తుందని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ మోసపూరిత గ్యారెంటీలను నమ్మరని, దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నరేంద్రమోదీని గెలిపిస్తారని అశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో సమస్యలు పరిష్కరిస్తా

### చేవెళ్ళ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి రంజిత్‌రెడ్డి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** చేవెళ్ళ పార్లమెంట్‌లోని అన్ని నియోజక వర్గాలలో గల కాలనీలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి రంజిత్‌రెడ్డి తెలిపారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మాదాపూర్ డివిజన్ పరిధీలోని మైహోం భుజలో గల కాలనీలలో ఎంపి అభ్యర్థి రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జగదీశ్వర్‌గౌడ్ కలసి పర్యటించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి చేవెళ్ళ ఎంపి అభ్యర్థి రంజిత్ రెడ్డిని భారీ మెజారీటీతో గెలిపించాలని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తరుపున కాలనీలలో నెలకొన్న అన్ని రకాల సమస్యలను పరిష్కారిస్తనన్నారు. పదేళ్ళ బిజెపి పాలనలో దేశంలో అభివృద్ధి లేకుండా పోయిందని, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి కేవలం కార్పొరేట్ శక్తుల కోసమే బిజెపి పని చేస్తు ప్రజా ధనాన్ని వారికి దోచి పెట్టిందని ఆరోపించారు. సంక్షేమ పథకాలు కనుమరుగయ్యాయన్నారు. ప్రజల కోసమే పని చేసే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## మోసపూరిత మాటలు నమ్మొద్దు

### మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/అడ్డాకుల :** మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన మహబూబ్‌నగర్ లోక్ సభ (పార్లమెంట్) ఎన్నికల సందర్భంగా అడ్డాకుల,మూసాపేట బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం మండల కేంద్రములోని మాతృ శ్రీ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మళ్లీ ఒకసారి ఓటు వేస్తే కరువుతో కటకటాల పాలు అవుతుంది. మన జిల్లా పచ్చబడలంటే బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలి. వేయించాలని కార్యకర్తలకు చూసించారు. మళ్లీ రాష్ట్రంలో పూర్వ వైభవం తెస్తాం మన టీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 24 గంటల కరెంటు ఇస్తూ రైతుల కష్టాలు తీర్చిన ఘనత మన కెసిఆర్ ది కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కష్టాలు మొదలు చేసింది. కరువుతో రైతులను నష్టపరుస్తుంది. మళ్లీ ఈ దుస్థితి పోవాలంటే టిఆర్ఎస్ పార్టీకి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కూడా పార్లమెంటు అభ్యర్థి మన్నెం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులు పండించిన పంట కొనుగోలు చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు ప్రజలకు అందుబాటులో లేవు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కెసిఆర్ తీసుకొచ్చాడు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం మేము తెచ్చామని గొప్పలు చెప్పుకోవడం ఇంతవరకు సరైంది ప్రజలు గమనించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు బంధు, తాగు నీరు, సాగునీరు, అందించలేని దుస్థితిలో ఉందని వారు వెల్లడించారు. మన్నె శ్రీనివాస్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే డా.సి అక్కామ్మరెడ్డి మాజీ మంత్రి వర్యులు డా.వి శ్రీనివాస్ గౌడ్, పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు మండల అధ్యక్షులు టి శ్రీనివాస్ రెడ్డి,జెడ్పిటిసి రాజశేఖర్ రెడ్డి,ఎంపీటీసీలు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి చేయూత

**ప్రజాపక్షం / అడ్డాకుల :** ఊపిరి రామచంద్రయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు ఆపదలో నేనున్నానంటు ఆర్థిక సహాయం చేసిన బిజెపి నాయకులు రమేష్ మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలము కందూర్ గ్రామ వాస్తవ్యులు స్వర్గయ ఊపిరి రామచంద్రయ్య ఆనారోగ్యముతో ప్రభుత్వ ఆసుపత్రిలో స్వర్గస్తులైనారు.గ్రామ స్థానిక పార్టీ నాయకులు ద్వార సమాచారం తెలుసుకున్న బిజెపి నాయకులు రమేష్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు వారి కుటుంబ సభ్యులకు 5000 రూపాయల ఆర్థిక సాయం చేశారు స్థానిక నాయకుల ద్వారా సానుభూతి వ్యక్తపరుస్తూ పాల్గొన్నా వారిలో వెంకటయ్య మాదిగ మహేష్,నాగరాజు, మంది పేట ఆనంద్,ఊపిరి నాగరాజు,మాసన్న,కాటారం వెంకట ఎర్రన్న,గ్రామస్తులు కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం /అడ్డాకుల :** అడ్డాకుల మండలం కందూరు గ్రామానికి చెందిన విలేకరి కందూరు నక్క బాలస్వామి మాతృమూర్తి (తల్లి) నక్క చెన్నమ్మ ఆదివారం గుండె పోటు వచ్చి ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆలా వెంకటేశ్వర్‌రెడ్డి మృత దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. బాలస్వామి కి మనోధైర్యాన్ని ఇచ్చారు ఆయనతో పాటు ముసపేట జడ్పిటిసి ఇంద్రయ్య సాగర్,మండల అధ్యక్షులు టి శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



## అభిమన్యురెడ్డి సేవా గుణాన్ని అర్థం చేసుకోవాలి

**ప్రజాపక్షం/బాలానగర్ :** సమాజ హితం కోసం సామాజిక సేవా శివ కార్యక్రమాలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ యువ నేత చించోడ్ అభిమాన్యురెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరాభిమానాలను చూసి ఓర్వలేకనే అర్థం పర్థం లేకుండా రాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య మాట్లాడుతున్నారని, అభిమాన్యురెడ్డి కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని పలువురు దొండ్లపల్లి గ్రామస్తులు హెచ్చరించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మెప్పుకోసం ప్రెస్ మీట్ పెట్టి మరీ చించోడు అభిమాన్యురెడ్డి కుటుంబంపై వ్యక్తిగత దూషణలు చేశారని మండిపడ్డారు. కృష్ణయ్య మాటలు మాట్లాడే ముందు జాగ్రత్తగా మాట్లాడాలని, హత్య రాజకీయాలు ఎవరు చేశారో చెప్పాలని డిమాండు చేశారు. అభిమాన్యురెడ్డి పేదలకు సాయం చేయడం తప్పా అని నిలదీశారు. అభిమాన్యురెడ్డిపై కుటుంబంపై చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, చెప్పకపోతే కత్తెర కృష్ణయ్య దాడి చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో దొర్లపల్లి గ్రామస్తులు సేవ్యనాయక్, కృష్ణయ్య , వెంకటయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విజ్ఞానక్షేత్ర పర్యటన



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కొల్లాపూర్ ప్రభుత్వడిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ శివరామరాజు ఆధ్వర్యంలో విజ్ఞానక్షేత్ర పర్యటనలో భాగంగా తెలంగాణరాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ ప్రైవేట్‌లిమిటెడ్ శ్రీశైలండ్యాం పడమర విభాగాన్ని సందర్శించారు. విద్యుత్‌ను ఉత్పత్తిచేసే విధానం , విద్యుత్‌ను నిల్వచేసే పంపిణీచేసే విధానాలను, విద్యుత్ మిషన్ పనితీరు, విద్యుత్ మొత్తం సామర్థ్యాన్ని మెగావాట్ల లెక్కలో విద్యార్థులకు విద్యుత్ ఇంజనీర్లు వివరించారని ప్రిన్సిపాల్ శివరామరాజు తెలిపారు. విద్యుత్ మిషన్లపనితీరును విద్యార్థులు ప్రత్యక్షంగా చూసి ఎంతో అనుభూతితో అవగాహన చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, అధ్యాపకులు రమేష్‌కుమార్, స్వామిసాగర్, శివుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



**ప్రజాపక్షం / కొత్తకోట :** ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలోని 4వ వార్డులో కాంగ్రెస్ పార్టీ పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డి చేతి గుర్తుకు ఓటు వేయాలని కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమానికి కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి. మేస్త్రీ శ్రీనన్న ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పల్లెపాగు ప్రశాంత్ , పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీ చందర్‌రెడ్డిని చేతి గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎన్‌జె. బోయజ్ , ఎక్స్ జడ్పీటీసీ పిజే బాబు, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, కొత్తకోట మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మీషేక్, రాంమోహన్‌రెడ్డి, వెంకటేష్ , లక్ష్మ య్య, రవీందర్‌రెడ్డి, లక్ష్మ య్య, క్రాంతికుమార్ , శ్యాం, రాజు, భాస్కర్, సాయిలు యాదవ్ , కృష్ణయ్య, భాస్కర్ , కురుపన్న, సాయిలు, జాన్ , ఈజాబ్ అలీ, కొమ్ము సుజ్ఞానం, అజన్న, నాగరాజు, శ్రీకాంత్, నవీన్‌రెడ్డి, దిలీప్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

# మంచి చేయండి... సహకరిస్తాం

### విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/బాలానగర్:** జడ్చర్ల ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి పెద్దెత్తున నిధులు తీసుకొచ్చి నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడితే తప్పకుండా సహకరిస్తామని ప్రజాపాలనను గాలికి వదిలేసి ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తే సహించేది లేదని బాలానగర్, రాజాపూర్ మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం ఈ మేరకు బాలానగర్ మండల కేంద్రంలోని వైస్ ఎంపీపీ వెంకటాచారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ప్రెస్ మీట్‌లు పెట్టి కొంతమంది మండల కాంగ్రెస్ నాయకులకు ఏమాత్రం అవగాహన లేకుండా అభిమాన్యురెడ్డిపై అసత్యప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేగా ఉన్న నాయకుడిని ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యంలో ఉంటదని పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న అభిమాన్యుడిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అనిరుద్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రతిపక్షాలపై బురద జల్లుతూ టాపిక్‌ను డైవర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఏదో మంచి చేస్తారని తాము కూడా ఆశించామని అందుకు భిన్నంగా ఎమ్మెల్యే వ్యవహార శైలి ఉందని పేర్కొన్నారు. పరిపాలన విషయాలు పక్కన పెట్టి అనవసర విషయాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మోసపోయి ఓట్లు వేశారని, ఎమ్మెల్యేగా ఉన్నారు. కాబట్టి జడ్చర్ల నియోజకవర్గానికి మంచి పని చేయండి సహకరిస్తామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ బాలానగర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, రాజాపూర్ యూత్ వింగ్ అధ్యక్షుడు బంగారు వెంకటేశ్, బాలానగర్ అధ్యక్షుడు సుప్ప ప్రకాశ్, కుచరకల్ వెంకటయ్య, మాజీ సర్పంచులు సేవ్యనాయక్, కృష్ణయ్య, గోపి నాయక్, మంజునాయక్, చిరంజీవి పాల్గొన్నారు.

# నేటినుంచి సలేశ్వరం జాతర

**ప్రజాపక్షం/అచ్చంపేట :** తెలంగాణ అమర్‌నాథ్‌గా పిలవబడుతున్న సలేశ్వరం జాతర ఈనెల 22నుంచి 24వరకు నిర్వహించబడుతుంది. నల్లమల అడవిలో అత్యంత రమణీయంగా చూపరులకు ఆనందంగా కనబడే ఈసోయగం తెలంగాణ అమర్‌నాథ్‌యాత్రగా ప్రసద్ధిగాంచింది. అచ్చంపేట నియోజకవర్గం లింగాల మండలం రాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో సలేశ్వరం అడవిలో నీటి ప్రవాహంతో అత్యంత సుందరంగా కనిపిస్తుంది. ఇక్కడ శివాలయం యాదృచ్ఛికంగా వెలిసినట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఇక్కడ రమణీయతతోపాటు భక్తితోకూడా ఎంతో ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ పిల్లలుకానివారికి పెళ్లి కానివారు అత్యధికంగా వస్తారు. అక్కడ తమ మొక్కుబడులు పూర్తికావడంతో ఇక్కడి ప్రాంతీయులు వ్రతాలు నిర్వహిస్తారు. ఇక్కడ పుట్టినపిల్లలకు గతంలో కలేమ్మ, సలేశ్వరం, కలేయ అనే పేర్లు పెట్టేవారు ఇప్పుడు కాలం మారడంతో సదానందం, సుదర్శన్‌అనే పేర్లతో కొత్తరకంగా పిలవడబుతున్నారు. వేసవికాలంలో నీటి ఇబ్బందులు ఉన్నప్పటికి అడవిలో 600లమీటర్ల ఎత్తు నుండి ఇప్పటికి జాలువారే నీరు ఇక్కడి భక్తులకు సాక్ష్యంగా నిలస్తుంది. ఈ దేవాలయంలో మూడురోజుల ప్రక్రియ చెంచులే పూజారులుగా ఉండటం విశేషం. లక్షలాదిమంది ఒకేరోజు వచ్చినప్పటికి దైవదర్శనం అందిరికి అవుతుంది. ఈరెండు రాత్రుళ్లు నిద్రించేవారికి తమకు కళలో దైవదర్శనం అవుతుందని ప్రజలు చెబుతుంటారు. అదేవిధంగా ఎలాంటి రుసుము లేకుండా నిబంధనలు లేకుండా1600లమీటర్ల లోతుకు నడుచుకుంటూ వెళ్లి దర్శనం చేసుకొని వస్తారు. కనీసం మెట్లుకూడా లేవు. ఈమూడు రోజులు అటవీశాఖ అధికారులు అనుమతించినట్లు డిఎఫ్ఓ రమేష్ గోపిడియా తెలిపారు. అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ సాయంత్రం 6గంటల వరకే దర్శనం చేసుకోవాలని ఆతర్వాత దర్శనం ఉండదన్నారు. ప్లాస్టిక్ వస్తువులు అటవీప్రాంతంలో మద్యపానం చేసేవారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాత్రికులు వచ్చేప్రాంతంలో తమ నిఘా ఉంటుందని తెలిపారు. లక్షలాదిమంది భక్తులు ఈమూడురోజుల్లో వస్తారని తెలిపారు. కొందరు ఉచిత అన్నదానం ఏర్పాటుచేసేవారు ఈసారి అటవీశాఖ అధికారుల ఆదేశంప్రకారం నల్లమల అడవి బయటిప్రాంతంలో బోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. రమణీయప్రాంతంతోపాటు భక్తిశ్రద్ధలతో ఈక్షేత్రం విరాజిల్లడం నల్లమల ప్రాంతానికే ఒక అందం.



## కల్వకుర్తి మల్లమ్మ తల్లి ఆశీస్సులు పొందాలి : ఎంఎల్ఎ కసిరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** శ్రీశ్రీశ్రీ మల్లమ్మతల్లికృపకు ప్రతి ఒక్కరూ పాత్రులుకావాలని ఎంఎల్ఎ కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీశ్రీమల్లలమ్మ తల్లి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేదరి సంఘానికి చెందిన దేవాలయ కమిటి సభ్యులు ఇటీవల కైలాసంగుట్టపై వారికులదైవమైన మల్లలమ్మ తల్లిగుడిని నిర్మించి ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. శ్రీశ్రీమల్లలమ్మ తల్లి దేవాలయ సమితి అధ్యక్షులు పిన్నంశెట్టి లక్ష్మ ణ్ మేదర సంఘం మండల అధ్యక్షులు పిన్నంశెట్టి శివకుమార్, పిన్నంశెట్టి సంజీవన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ కసిరెడ్డినారాయణరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి నియోజకవర్గ మేదర సంఘం ప్రజల అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్‌చైర్మన్ బాలాజిసింగ్, కల్వకుర్తి మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మేదరిసంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి పారసాని రమాకాంత్, రాష్ట్రనాయకులు జర్నలిస్టు యాదగిరి, జడ్చర్ల కృష్ణయ్య, తహసీల్దార్ వెంకటేష్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పిన్నంశెట్టి పరమేశ్వర్, మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాఘవేంద్ర, ప్రశాంత్, కోశాధికారి బాలనర్సింహ్మా, ప్రచార కార్యదర్శి పిన్నంశెట్టి రాము, సీనియర్ నాయకులు పిన్నంశెట్టి లక్ష్మ య్య, రాజలింగం, రాములు, తిరుపతయ్య, పిన్నంశెట్టి సత్యనారాయణ, మల్లేష్, వెంకటేష్, సైదులు, రాజు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టాన్ని పరిరక్షించాలి

### సామాజిక కార్యకర్త సంతోష్‌కుమార్



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** భారత దేశమంతటా అక్టోబర్ 2005లో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలులోకి వచ్చిన సమాచార హక్కు చట్టం 2005ను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సామాజిక కార్యకర్త సంతోష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రాథమిక లక్ష్యం పౌరులకు సాధికారత కల్పించడం, ప్రభుత్వ పనిలో పారదర్శకత , జవాబుదారీతన్నాని ప్రోత్సహించడం అవినీతిని అరికట్టడం, మన ప్రజాస్వామ్యాన్ని నిజమైన అర్థంలో ప్రజల కోసం పని చేసేలా చేయడం, ప్రభుత్వ కార్యకలాపాల గురించి పౌరులకు తెలియజేయడానికి ఈ చట్టం ఒక అస్త్రం అని ఆయన అన్నారు. నిబంధనల ప్రచారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలలో సమాచార హక్కు బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయడంతో పాటు నిర్ణీత గడువులో దరఖాస్తుదారులు అడిగిన సమాచారంను ఇచ్చేలా అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కొంత మంది అధికారులు తమ తమ కార్యాలయాలలో అందుబాటులో ఉన్న సమాచారంను ఇవ్వడానికి కూడ కాలయాపన చేస్తూ దరఖాస్తుదారులకు గందరగోళానికి గురిచేస్తూ స.హ. చట్టం లక్ష్యాన్ని నీరుగార్చే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా స.హ చట్టం నిబందనలు పాటించని అధికారులపై గవర్నర్‌కు రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, జిల్లాలో గతంలో జరిగిన అవినీతి అక్రమాలను సమాచార హక్కు చట్టం ద్వారా బయటికి తీసి ప్రజల ముందు ఉంచుతామని స.హ. చట్టం లక్ష్యాన్ని కాపాడటానికి ముందుంటామని ఆయన అన్నారు.

## గుడి నిర్మాణానికి విరాళం

### కెఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కళ్యాణ్‌కుమార్



**ప్రజాపక్షం / చిన్నంబావి :** మండల పరిధిలోని గడ్డబస్వాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జగదీశ్వరాలయానికి గ్రామ ప్రజల కోరిక మేరకు తనవంతు సహయం రూ. 50వేలు అందించిన కెఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కళ్యాణ్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ , చిదంబరరెడ్డి, ఈదన్నయాదవ్, గడ్డబస్వాపూర్ , మాజీ సర్పంచ్ సత్యారాణి, జగదీష్ , రాజేష్ , ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** వనపర్తి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణలు వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాల్టీ మున్సిపల్ చైర్మన్‌గా పుట్టపాకల మహేష్ , వైస్ చైర్మన్‌గా పాకనాటి కృష్ణ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శాలువ వేసి సత్కరించారు. అనంతరం వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కిచ్చారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్ , మున్సిపల్ పట్టణ కౌన్సిలర్లు , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పార్లమెంట్ ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలకేంద్రంలో బిజెపిపార్టీని గెలిపించాలని బిజెపి రాష్ట్ర ఓబిసిమోర్చా కార్యవర్గసభ్యులు ఇంద్రకంటి శేఖర్ అధ్యక్షతన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంద్రకంటిశేఖర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటిభరత్‌ప్రసాద్‌ను గెలిపించి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోగల ఏడు నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. కేంద్రప్రభుత్వ అభివృద్ధి సంక్షేమపథకాలు ప్రతి గడపకు చేరవేసినవ్యక్తి ప్రధానమంత్రి నరేంద్రమోడి అన్నారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి గ్రామబిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న జెడ్‌పిటిసి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలంలోని మారేడ్‌మాన్‌దిన్నె గ్రామానికిచెందిన జెట్టిశేఖర్ ఆహ్వానంమేరకు వారి కుమార్తె వివాహవేడుకలో జడ్పిటిసి మేకలగౌరమ్మచంద్రయ్యయాదవ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేగ్రామానికిచెందిన వీరపాగవెంకటయ్య ఆహ్వానంమేరకు వారి కుమారుడు భాస్కర్ వివాహవేడుకలో జడ్పిటిసిగౌరమ్మ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ వీరపాగ అరవింద్, చెటమోని రాముడు, జెట్టిశంకర్ పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌పాలన ప్రజలవద్దకే

### మంత్రి జూపల్లికృష్ణారావు

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ప్రజలవద్దకే పరిపాలన విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్పుతెచ్చిందని ఎక్సైజ్ టూరిజంశాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి, జట్‌ప్రోల్, కొండూరు గ్రామాలలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. అనంతరం గ్రామ ప్రజాప్రతినిధులతో, గ్రామప్రజలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే కొన్ని పథకాలు అమలుచేసిందని రాబోయే రోజుల్లో మిగతా హామీలను నెరవేర్చుతామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ మరోకసారి కాంగ్రెస్‌పార్టీకి ఓటువేసి డాక్టర్ మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మేడే గోడపత్రికలు విడుదల

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** మే1న నిర్వహించే మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్ గ్రామంలో 138వ మేడే దినోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికానగరం హేమార్కెట్‌లో 1886 మే 1న సమ్మెచేయాలని నిర్ణయించిన ప్రపంచకార్మిక సంఘాల సమైక్య సోషలిస్టు కార్మికసంఘాల సమ్మె హేమార్కెట్‌లో జరిగిన నిరసన ప్రదర్శనల సందర్భంగా 8గంటల పనిదినానికై కార్మికులు కదంతొక్కారన్నారు. ఆనాడు జరిగిన కాల్పుల్లో ఎంతోమంది కార్మికులు ఎంతో మంది చనిపోయారన్నారు. అమరవీరుల మరణానికి శ్రద్ధాంజలిఘటిస్తూ భారతదేశంలో పెట్టుబడిదారుల పాలనను అంతంచేసి ఎర్రకోటపై ఎర్రజెండాను ఎగరవేయడమే కార్మికవర్గం యొక్క ప్రధానమైన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, వెంకటేష్, కృష్ణయ్య, బాలయ్య, ఈశ్వరయ్య, నారాయణ, హరిచంద్ర, వెంకటయ్య పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం మాజీ ఎంపీటీసీ, మాజీ ఉప సర్పంచ్ కావలి కురుమన్న కుమారుడు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్ , శఅరీరంగాపురం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరిరాజు, పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ , మాజీ సర్పంచ్ రవీందర్ , జిల్లెల్ల వెంకటరామిరెడ్డి, కురుమన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారం చేపట్టిన బిజెపి



**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోటలో బీజేపీ డోర్ టూ డోర్ ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. నరేంద్ర మోడీ మూడోసారి ప్రధాని కావాలంటే డి.కె. అరుణను పెద్ద మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేయడం జరిగింది. 1వ వార్డు అధ్యక్షుడు శక్తి కేంద్రం ఇంచార్జీ రాఘవేంద్ర, సబిరెడ్డి, వెంకట్‌రెడ్డి , రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు దాబా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరిః** కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు ప్రజలు భవిష్యత్తుకు గ్యారంటీ అని పలువురు కాంగ్రెస్ నేతలు అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డికి మద్దతుగా కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని వసంతపురి కాలనీ, వెంకటేశ్వర నగర్ ప్రాంతాలలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఆదివారం నాడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల గురించి వివరించి ఓట్లు అడగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ఏ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, సిఎల్ యాదగిరి, ఉమేష్ సింగ్, బికె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ఖైదీ కడుపులో మేకులు



**ప్రజాపక్షం/చర్లపల్లిః** చర్లపల్లి జైలు ఖైదీ కడుపులో తొమ్మిది మేకులు అని కొన్ని పత్రికల్లో ఆదివారం ప్రచురించిన వార్త సరియైందని కాదని కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్ అన్నారు. కడుపులో మేకులు ఉన్న సదరు ఖైదీ మహమ్మద్ షేక్ చర్లపల్లి ఖైదీ కాదని, సంగారెడ్డి కేంద్ర కారాగారం రిమాండ్ ఖైదీ అని తెలిపారు.సంగారెడ్డి కేంద్రకారాగారం నుండి చికిత్స కోసం గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాడని ఇట్టి విషయాన్ని గమనించగలరని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## శామీర్‌పేటలో బిఆర్‌ఎస్ పని ఖతం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండల కేంద్రంలో బిఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా నాయకులు చేరారు. మేడ్చల్ నియోజవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వంగ నర్సింహారెడ్డి, కెసిఆర్ సేవా దళం రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ ఉద్యకారుడు మహ్మద్ అఫ్జల్‌ఖాన్, బిఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు దేశం శ్రీకాంత్‌గౌడ్, మాజీ వార్డు సభ్యుడు రవి, మేడి బాస్కర్, రాజు, సుధాకర్, నరేష్‌గౌడ్, నీరుడి మధులతో పాటు సుమారు 500 మంది మాజీ ఎంఎల్‌ఎ మలిపెద్ది సుదీర్‌రెడ్డి కాంగ్రెస్ కండవా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి చేరుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల ప్రసిడెంట్ శంకర్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ముజుబుద్దిన్, ఎంపిటిసి సాయిబాబు, మాజి సర్పంచ్ బత్తుల కిషోర్‌యాదవ్, సీనియర్ నాయకుడు మహేందర్‌యాదవ్, కట్టమైసమ్మ చైర్మన్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు

### పట్టించుకోని మున్సిపల్ అధికారులు



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** ఎన్నికల కోడ్ వచ్చిందంటే వికారాబాద్ మున్సిపల్ అధికారులకు పండుగే పండుగా, అక్రమదారులకు ఇండ్లు కట్టుకోవడానికి పూర్తి సహకరం అందిస్తారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మున్సిపల్ అధికారులు పత్తా లేకుండా పోయారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు, భారీ మొత్తంలో మూడుపులు తీసుకోని అండగా నిలుస్తున్నారని స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన స్థానిక మార్కెట్‌లోఉన్న భావిని పుడ్చి వేసి అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారు. మున్సిపల్‌లోని అధికార పార్టీ నాయకులు ఈ అక్రమ నిర్మాణానికి అండగా ఉన్నారు అని తెలుస్తుంది. మున్సిపల్ పరిధిలో అనేక మంది ప్రధాన రోడ్డు వెంబడి ఉన్న అండర్ డ్రైనిజ్‌పై అక్రమంగా షెడ్లు, గోడలు, నిర్మించిన పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. ఎలాంటి అనుమతులు లేకుండా అనేక అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి కాని మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. వికారాబాద్ మున్సిపల్‌లో జరుగుతున్న అక్రమలపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వికారాబాద్ మున్సిపల్ లోని ప్రజలు కోరుతున్నారు.

## న్యాయం, ధర్మం కోసం పోరాడే ఈటలను గెలిపించాలి : జమున



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** న్యాయం, ధర్మం కోసం ఎల్లప్పుడూ పోరాడే ఈటల రాజేందర్‌ను గెలిపించి ప్రజా సేవ చేసుకునే అవకాశం ఇవ్వాల్సిందిగా మల్కాజ్‌గిరి పార్లమెంటు బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున అన్నారు. మౌలాలీ డివిజన్‌లోని పూలపల్లి బాలయ్య కాలనీలో ఈటల రాజేందర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ జమున బిజెపి నాయకులతో కలిసి ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రేక్‌ఫాస్ట్ చిట్ చాట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పూలపల్లి బాలయ్య కాలనీ, సూర్యానగర్, రాక్ హిల్స్, సుధానగర్, ద్వారకామయ కాలనీ, శంకరయ్య కాలనీ, బృందావన్ కాలనీల నుంచి అనేక మంది ప్రజలు హాజరై చిట్ చాట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు అనిపెద్ది సాయిబాబు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వికె మహేష్, మల్కాజ్‌గిరి బిజెపి సీనియర్ నాయకులు చంద్రశేఖర్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగారావు తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో బిజెపి భారీ బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/తాండూరుః** చేవెళ్ళ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా తాండూరు పట్టణంలో బిజెపి ఆధ్వర్యన భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం తాండూరు పట్టణంలో చేవెళ్ళ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డికి మద్దుతుగా తాండూరు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో కొండ విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజీత్‌రెడ్డి పాల్గొన్నారు. తాండూరు పట్టణంలోని విలేమూన్ చౌరస్తా నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఇందిరాచౌక్, శాంతిమహల్ చౌరస్తా, బసవణకట్ట మీదుగా శివాజీ చౌక్, ఇందిరాచౌక్‌కు చేరుకుంది. అక్కడి నుండి నేహ్రుగంజ్ తదితర ప్రాంతాల గుండా బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ తనయుడు కొండ విశ్వజీత్‌రెడ్డి రెడ్డి మాట్లాడుతూ రామ రాజ్యం రావాలంటే బిజెపికి ఓటు వేయాలని కోరారు. దేశ ప్రధాని నరేంద్రమోడి ఆధ్వర్యాన పార్లమెంట్ ఎన్నికలలో రాష్ట్రంలో అత్యాధిక ఎంపి స్థానాలను బిజెపి కైవసం చేసుకుంటుందన్నారు. కావున చేవెళ్ళ బిజెపి అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డికి అత్యాధిక మేజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, పట్టణ అధ్యక్షులు మల్లేశం, జిల్లా మహిళ మోర్చ అధ్యక్షురాలు సాహు శ్రీలత,కౌన్సిలర్ బాలప్ప, నాయకులు భద్రేశ్వర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌స్పెక్టర్‌కు ప్రశంసాపత్రం అందజేత



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి :** గతంలో 2018 నుంచి 2020 వరకు నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన నరసింహాస్వామి ఇన్‌వెస్టిగేషన్ ఆఫీసర్‌గా పరిశోధన చేసి కేసులను చేధించడంలో విజయవంతంమైనందుకు రాచకొండ సిపి తరుణ్‌జోషి ప్రశంసాపత్రాన్ని ఆదివారం అందజేశారు. ప్రస్తుతం ట్రాన్స్‌కో డిపార్టుమెంట్‌లో నరసింహాస్వామి ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు.

# నేడు అంతాయిపల్లికి సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపాలిటిలోని అంతాయిపల్లికి సిఎం రేవంత్‌రెడ్డి జనజాతర కార్యక్రమానికి నేడు విచ్చేస్తున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. జనజాతర సభకు జరుగుతున్న ఏర్పాట్లను మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, పార్లమెంట్ ఇన్‌చార్జ్, మల్కాజ్‌గిరి మాజీ ఎంఎల్‌ఎ మైనంపల్లి హన్మంతరావు, మేడ్చల్ మాజీ ఎంఎల్‌ఎ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌లు సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎంపి అభ్యర్థి స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తారని అన్నారు. నామినేషన్ అనంతరం నిర్వహిస్తున్న జనజాతర సభకు సిఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఈ సభకు సుమారు లక్ష మంది కాంగ్రెస్ కార్యకర్తలను మేడ్చల్ నియోజకవర్గం నుంచి తరలివస్తున్నారని అన్నారు. సభకు వచ్చే కార్యకర్తలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. సాయంత్రం రెండు గంటలకు సభ ప్రారంబిస్తామని అన్నారు. ఎంపి అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డిని ఆశీర్వదించడానికి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు తరలిరావాలని, సభను జయప్రధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజి జడ్‌పిటిసి బాలేష్, మూడుచింతలపల్లి మండల ప్రసిడెంట్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, శామీర్‌పేట ప్రసిడెంట్ శంకర్‌గౌడ్, జవహార్‌నగర్ అద్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### కొలను శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరు పనిచేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 1కు చెందిన రజక సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానం పలికారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలంతా సమిష్టిగా పాటుపడాలని సూచించారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తలకు కాంగ్రెస్‌లో తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గురుమూర్తి, అప్పారావు, శ్రీనివాసులు, వెంకన్న, సూరిబాబు, సురేశ్ పాల్గొన్నారు.

# హరీష్‌రావు కుంభకోణాలను బయటకు తీస్తాం

### మాజీ ఎంఎల్‌ఎ మైనంపల్లి హన్మంతరావు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పార్లమెంట్ ఎన్నికల అనంతరం బిఆర్‌ఎస్ అవినీతి మంత్రులను జైలుకు పంపడం ఖాయమని, మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన భూకుంబకోణాలను బయటకు తీస్తామని మల్కాజ్‌గిరి మాజీ ఎంఎల్‌ఎ, పార్లమెంట్ ఇన్‌చార్జ్ మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనజాతర కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సభా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పట్నం సునీతమహేందర్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టికెట్ కేటాయించడం జరిగిందన్నారు. పార్లమెంట్‌లో మహిళా సభ్యురాళ్లు లేరని మనందరం కష్టపడి ప్రతి ఒక్కరు కాంగ్రెస్‌కు ఓటు వేసి సునితారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో పేదలకు డబుల్‌బెడ్ రూమ్‌లు ఇస్తామని మాట ఇచ్చి తప్పిన ప్రభుత్వం బిఆర్‌ఎస్ అని విమర్శించారు. ట్రంక్ పెట్టె, రబ్బరు చెప్పులతో వచ్చిన హరీష్‌రావుకు లక్షల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయని అవినీతితో అక్రమంగా సంపాదించిన డబ్బులని ఆరోపించారు. ఖచ్చితంగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 15 స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ మలిపెద్ది సుదీర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ జడ్‌పిటిసి బాలేష్, తదితరులు పాల్గొన్నారు.

## అష్ఫాక్ సేవలు దేశానికి ఎంతో అవసరం

### తాండూరు ఎంఎల్‌ఎ బిఎంఆర్



**ప్రజాపక్షం/తాండూరుః** యుపిఎస్‌సి సివిల్స్‌లో ర్యాంక్‌ను సాధించిన గొట్లపల్లి గ్రామానికి చెందిన అష్ఫాక్‌ను తాండూరు ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆదివారం పెద్దేముల్ మండల పరిధి గొట్లపల్లి గ్రామంలో సివిల్స్ ర్యాంకర్ అష్ఫాక్ నివాసానికి వెళ్ళిన ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి శాలువతో సన్మానించడంతో పాటు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సివిల్స్ సాధించిన అష్ఫాక్ పూర్తి శక్తి సార్ధ్యలను వినియోగించి దేశ భవిష్యత్ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు అష్ఫాక్ యుపిఎస్‌సి పరిక్షలో 770 ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. స్థానిక నాయకులు లొంక నర్సిములు, కరణం పురుషోత్తమ రావు, కొమ్ముగోపాల్‌రెడ్డి, పట్లోల్ల నర్సిములు తదితరులు ఉన్నారు.

## సునీత మహేందర్‌రెడ్డిని గెలిపిద్దాం

### ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** జగద్గిరిగుట్ట డివిజన్ లోని నాయకులు కార్యకర్తలు అందరూ ఐక్యమత్యంగా పనిచేసి మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి గెలుపు కోసం పని చేద్దాం అని ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మద్దుమ్ నగర్ లోని మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కాంటెస్ట్ కార్పోరేటర్ గూడవరమ్మ కార్యాలయంలో మద్దుమ్ నగర్ కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల్లో సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని, మతోన్మాద బిజెపిని అవినీతి బిఆర్‌ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి, యువసేన సాయి, ప్రవీణ్ గౌడ్, భరత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు యాదగిరి, డివిజన్ మైనార్టీ అధ్యక్షులు ఎంఏ హమీద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెట్టింపు అభివృద్ధి జరగాలంటే బిఆర్‌ఎస్‌ను గెలిపించాలి

### ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** అభివృద్ధి రెట్టింపు స్థాయిలో జరగాలంటే బిఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం కాలనీ డివిజన్ టిఎస్‌ఐఐసి కాలనీలో బిఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి మరింతగా వేగవంతంగా జరగాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అనేక విధాలుగా అభివృద్ధి చేశామని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి లక్ష్మారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణ, నాయకులు సిద్ధిక్, భాస్కర్, సురేష్ బాబు, సాయిబాబా, రోషన్, రెహమాన్, సాంబశివరావు, జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

**సీనియర్‌ల అనుభవాలు భావి తరాలకు బంగారు బాటలు**

సీనియర్ సిటిజన్స్ అనుభవాలు భావి తరాలకు బంగారు బాటలు వేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం కాలనీ డివిజన్ టీఎస్‌ఐఐసి కాలనీ సీనియర్ సిటిజన్స్ భవనంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఫోరం నూతన కమిటీ నియామకం అనంతరం జరిగిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ విచ్చేసి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సభ్యులను కుటుంబ సభ్యులు భారంగా కాకుండా వారితో సఖ్యతగా, ప్రేమగా ఉండాలని, రానున్న తరాలు సైతం మనతో ప్రేమగా ఉంటారని అన్నారు. సీనియర్ సిటిజన్స్ సభ్యుల అనుభవాలు భావి తరాలకు మంచి బాటలుగా ఉండాలని చెప్పారు. అనంతరం ఫోరం కమిటీని ప్రకటించారు. ఫోరం కమిటీ అధ్యక్షులుగా భాస్కర్ రాజు, ప్రధాన కార్యదర్శిగా సాయిబాబా, కోశాధికారిగా సాగర్, ఉపాధ్యక్షులుగా సూర్యనారాయణ, కెవి సుబ్బయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మామిలయ్య, జాయింట్ సెక్రెటరీగా బసవ పున్నయ్య, సుజాత, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సత్యనారాయణ, నాయకులు భాస్కర్, సిద్దిక్, సురేష్ బాబు, సాయిబాబా, రోషన్, రెహమాన్, సాంబశివరావు, జనార్ధన్ రెడ్డి, సాజిద్ పాల్గొన్నారు.

**విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో ప్రత్యేక పూజలు**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఈశ్వర్ విల్లాస్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వినాయక స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దన్‌రాజ్, నాయకులు రంగరాయ ప్రసాద్, మధుసూదన్, వెంకటేశ్వర రావు, రవి కాంత్, ఈశ్వర్ విల్లాస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా బాలాజీ బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/తాండూరు/బంటారంః** బంటారం మండల పరిధి తోరమామిడి గ్రామంలో వెలసిన బాలాజీ జాతర బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతన్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగవ రోజు హనుమ ద్వానంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా వెంకటేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహోత్సవాలలో భాగంగా హనుమాన్ పల్లకి సేవా, అశ్వవాహన సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పలు వీదుల గుండ స్వామి వారి పల్లకి సేవా కార్యక్రమాన్ని భజన భక్తుల ఆటపాటల మధ్య ఘనంగా నిర్వహించారు. శ్రీవారి బ్రహోత్సవాలను పురష్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు వీరేశం, శంకర్ రెడ్డి తదితరులు ముందు ఉండి జాతర ఉత్సవాలను ఏర్పాట్లును పరిశీలిస్తున్నారు.జాతర ఉత్సవాలలో భాగంగా ఈ నెల 23న శ్రీదేవి, భూదేవ సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం, రథోత్సవం, ఈ నెల 24 పెరుగు బసంతం ఉత్సవాలను నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను పురష్కరించుకుని నిర్వహిస్తున్న జాతర ఉత్సవాలకు చుట్టపక్కల గ్రామాల ప్రజలు భక్తులు పెద్దఎత్తున్న హాజరైన స్వామి వారిని దర్శించుకోనున్నారు.



## శుభ కార్యక్రమాలకు హాజరైన ఎంఎల్‌ఎ

**ప్రజాపక్షం/తాండూరుః** తాండూరు నియోజకవర్గంలో జరిగిన పలు వివాహా శుభ కార్యక్రమాలకు స్థానిక ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరైనారు. ఆదివారం జరిగిన పలు వివాహా వేడుకలకు హాజరైన ఎంఎల్‌ఎ వధువరులను ఆశీర్వదించారు. తాండూరు పట్టణంలోని పంక్షన్ హాల్‌లో నిర్వహించిన వివాహాది వేడుకలకు ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి హాజరైనారు. ఎంఎల్‌ఎ మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, వెంట పార్టీ సీనియర్ నాయకులు పట్లోల బాల్ రెడ్డి, పట్లోల నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

**నేడు పెద్దేముల్ మండలంలో ఎంపి, ఎంఎల్‌ఎ పర్యాటన**

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్ రెడ్డి, చేవెళ్ళ ఎంపి గడ్డం రంజిత్‌రెడ్డిలు పెద్దేముల్ మండలంలో పర్యాటించున్నారు. మండలంలోని బాయిమీది తాండ, ఊరెంటి తాండ, ఆడ్కిచర్ల, ఓమ్లానాయక్ తాండ, పాషాపూర్, తట్టేపల్లి, బండమీదిపల్లి, సిద్ధమదుగు తాండ, ఎర్రగడ్డ తండా, ఆత్కూర్, ఇందూర్, హన్మాపూర్, గొట్లాపల్లి తదితర గ్రామాలలో పర్యాటించనున్నారు.

# పంట నష్టంపై వ్యవసాయ శాఖ దృష్టి

### నిధుల విడుదలకు సిద్ధమన్న మంత్రి తుమ్మల

**న్యూఢిల్లీ :** రాష్ట్రంలో అకాల వర్షాలు రైతుల నడ్డీ విరుస్తున్నాయి. మొన్నటివరకు తగినంత నీరు లేక పంటలు ఎండిపోవడంతో నష్టపోయిన రైతు, తాజాగా పండిన పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో నష్టపోతున్నాడు. ఈనేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం పంటనష్టంపై దృష్టి సారించింది. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు దెబ్బతిన్న పంట వివరాలను సేకరిస్తున్నారు. తాజాగా కురిసిన అకాల వర్షం, వడగండ్ల వానలతో దెబ్బతిన్న పంటనష్టం వివరాల సేకరణలో వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు మేరకు అధికారులు పంట నష్టం వివరాల సేకరణకు ఉపక్రమించారు. ఇప్పటికే పేర్కొన్న 2200 ఎకరాలకు అదనంగా, నిన్న కురిసిన అకాల వర్షాలకు ఇంకొక 920 ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్లు అధికారులు మంత్రితో పేర్కొన్నారు. రంగారెడ్డి, జనగామ, నిర్మల్ జిల్లాలలో కొత్తగా పంట నష్టం నమోదైనట్లు, అధికారులు మంత్రికి తెలియజేశారు. ఇప్పటికే మార్చి నెలలో కురిసిన వడగండ్ల వానలకు పంట నష్ట పరిహారం విడుదల చేసేందుకు ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆమోదం కోసంకు విజ్ఞప్తి చేసిన సంగతి విదితమే. దానికి సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా, ఎన్నికల సంఘాన్ని మరొసారి సంప్రదించి నిధుల విడుదలకు అనుమతులు పొందేలా విజ్ఞప్తి చేయమని సూచించింది. వాటితో పాటే ఇప్పుడు జరిగిన నష్టాన్ని కూడా తొందరగా మదింపు చేసి, నివేదిక సమర్పించాలని మంత్రి తుమ్మల అధికారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టానికి సంబంధించిన నివేదికలు అందిన వెంటనే రైతులకు పరిహార నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. అంతేకాకుండా వరి పంట కోతలు ఊపందుకున్న నేపథ్యంలో వచ్చే రెండు, మూడు వారాల పాటు అన్నదాతలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇలాంటి అకాల వర్షాలు సంభవించే సందర్భంలో పంట నష్టం తగ్గించే విధంగా ముందుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కర్షకులకు సూచించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వానాకాలం ముందు సరఫరా చేసే పచ్చి రొట్ట విత్తనాల సేకరణ కోసం టెండర్ల ప్రక్రియను నిర్వహించుటకు అనుమతి ఇచ్చినందుకు గానూ, రాష్ట్ర ఎన్నికల సంఘానికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలియజేశారు.



## జ్ఞానమాల కార్యక్రమం

**ప్రజాపక్షం/దమ్మాయిగూడః** కీసర మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి ఆదివారం అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన దమ్మాయిగూడ కాంగ్రెస్ నాయకురాలు గుజ్జుక పరశురాంలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, రామిడి స్వప్నరెడ్డి,బొట్టు రమేష్,జూపల్లి రవీందర్,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ

# ఆర్‌సిబి ప్లే ఆఫ్ ఆశలు గల్లంతు



ఒక్క పరుగు తేడాతో బెంగళూరుపై కోల్‌కతా విజయం

**కోల్‌కతా :** ఐపిఎల్ సీజన్ 17లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఒక్క పరుగు తేడాతో విజయం సాధించింది. బెంగళూరు ప్లేయర్లు విల్ జాక్స్ (55), రజత్ పటీదార్ (52) లాంటి స్టార్స్ రాణించినప్పటికీ కోల్‌కతా నిర్దేశించిన 223 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమయ్యారు. ఇక కోహ్లీ(18), డుప్లెసిస్(7), గ్రీన్(6), లమ్రార్(4) నిరాశపర్చారు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో 221 పరుగులకే ఆ జట్టు ఆలౌటైంది. చివరిలో దినేశ్(25), కర్ణ్‌శర్మ(20) పరుగులు చేసినప్పటికీ ఆ ఇన్నింగ్స్ వృథా అయిపోయింది. ఇక కోల్‌కతా బౌలర్లలో రసెల్ 3 వికెట్లు పడ గొట్టగా, హర్షిత్ రాణా, సునీల్ నరైన్ చెరో 2, వరుణ్ చక్రవర్తి, స్టార్క్ తలో ఒక వికెట్ పడగొ ట్టారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 222 పరుగులు సాధించింది. ఓపెనర్ సాల్ట్ (48); చెలరేగాడు. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్ (50) కూడా అర్ధశతకంతో రాణించాడు. రింకూ సింగ్ (24), రసెల్ (27), రమణ్‌దీప్ (24) ఫర్వాలేద నిపించారు. ఇక నరైన్ (10), రఘువంశీ (3), వెంకటేశ్ అయ్యర్ (16) నిరాశపరిచారు. బెంగళూరు బౌలర్లలో యశ్ దయాల్, గ్రీన్ చెరో 2 వికెట్లు పడగొట్టగా.. సిరాజ్, ఫెర్గూసన్ తలో వికెట్ తీశారు.

**థర్డ్ అంపైర్ ఫెయిర్ రివ్యూ - కాంట్రవర్సీగా విరాట్ ఔట్!**

ఇక ఈ మ్యాచ్ వేదికగా ఓ వివాదాస్పద ఘటన జరిగింది. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ(18) ఔట్ అయినతీరు కాస్త కాంట్రవర్సీగా మారింది. హర్షిత్ రాణా వేసిన మూడో ఓవర్ తొలి బంతికి అతనికే క్యాచ్ ఇచ్చాడు. అయితే, ఆ బాల్‌ను ఫుల్ టాస్ రూపంలో కాస్త ఎత్తులో రావడం వల్ల అసలు గొడవ మొదలైంది. నో బాల్ కోసం కోహ్లీ రివ్యూ తీసుకున్నప్పటికీ, నిర్ణయం అతనికి వ్యతిరేకంగానే వచ్చింది. అయితే థర్డ్ అంపైర్ ఆ బంతిని ఫెయిర్ డెలివరిగా నిర్ణయిస్తూ, కోహ్లీని ఔట్‌గా డిక్లేర్ చేశారు. థర్డ్ అంపైర్ నిర్ణయంపై విరాట్, డుప్లెసిస్ ఆన్‌ఫీల్డ్ అంపైర్లతో చర్చించిప్పటికీ, ఫలితం లేకుండా పోయింది.

## ధోనీ కోసం గట్టిగా అరుస్తా

**చెన్నై :** చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయర్, టీమ్ ఇండియా ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సామాన్య ప్రజల నుంచి సెలబ్రిటీల వరకు చాలా మంది ధోనీకి వీరాభిమానులుగా ఉన్నారు. తాజాగా చెన్నై జట్టు ప్లేయర్ శివమ్ దూబె భార్య అంజుమ్ ఖాన్ కూడా ఇదే విషయంపై నెట్టింట షేర్ చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. 'మహీ టీమ్‌ఇండియాకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రోజులవి. మొదటిసారి నేను ఓ న్యూస్ ఛానెల్‌లో ఆయన పేరు విన్నాను. ఆయన గురించి తెలియనంత వరకు నాకు క్రికెట్ అంటే ఇష్టం మాత్రమే ఉండేది. కానీ, నాకు తెలియకుండానే ఆ రోజు ఆ ఇంటర్వ్యూ మొత్తాన్ని ఎందుకు చూశానో తెలియదు. అది నాకు సాధారణంగా అనిపించలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు క్రికెట్ మ్యాచ్‌లన్నింటినీ చూస్తాను. ధోనీ ఆడే మ్యాచ్‌లను మాత్రం అసలు మిస్సవ్వను. జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో మహీ ఉంటే గెలిపిస్తారన్న ధైర్యం ఉంటుంది. ధోనీ అంటే క్రికెట్, క్రికెట్ అంటే ధోనీ' అంటూ ఎమోషనలయ్యారు. ఇక ఇదే పోస్ట్‌లో ఆమె మరిన్ని ఆసక్తికరమైన విషయాల గురించి చెప్పారు. 'మొదటి సారి ధోనీని చూసినప్పుడు పొడవాటి హెయిర్ స్టైల్‌తో కనిపించారు.

## తెవాటియా, గిల్ మెరుపులు

పంజాబ్‌పై మూడు వికెట్ల తేడాతో గుజరాత్ గెలుపు



**చండీగఢ్ :** చండీగఢ్‌లోని మహారాజా యద్వీందర్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన పోరులో గుజరాత్‌దే పైచేయిగా నిలిచింది. నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ జట్టు, నిర్ణీత 20 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసి ఆలౌటైంది. పంజాబ్ బ్యాటర్లలో ప్రభ్‌సిమ్రాన్ (35), బ్రార్(29), కరన్(20) ఫర్వాలేదనిపించారు. రొస్సోవ్(9), జితేశ్(13), లివింగ్‌స్టన్ (6), శశాంక్(8), అశుతోష్(3), భాటియా(13), రబాడ(1*) విఫలమయ్యారు. ఇక గుజరాత్ బౌలర్లలో సాయి కిశోర్ 4 వికెట్లు తీయగా, మోహిత్ శర్మ, నూర్ రెండేసి, అలాగే రషీద్ ఒక వికెట్ పడగొట్టారు. ఆ తర్వాత పంజాబ్ నిర్దేశించిన 143 పరుగుల లక్ష్యాన్ని ఛేధించేందుకు గుజరాత్ బరిలోకి దిగింది. తొలి బంతి నుంచి ఆచితూచి ఆడూతూ వచ్చింది. ఓపెనర్‌గా వచ్చిన శుభ్‌మన్ గిల్ 35 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అయితే అర్ధసెంచరీ చేస్తాడనుకుంటున్న సమయంలో లివింగ్‌స్టన్ వేసిన మూడో బంతికి భారీ షాట్ ఆడబోయి రబాడకు చిక్కాడు. దీంతో అనూహ్యంగా పెవిలియన్ బాట పట్టాడు. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్ కూడా జట్టుకు కీలక పరుగులు అందించాడు. అయితే 31 పరుగులతో దూసుకెళ్తున్న సమయంలో సామ్ కరణ్ చేతికి చిక్కాడు. దీంతో అజ్మతుల్లా ఒమర్జాయ్ కాస్త జాగ్రత్తగా ఆడాడు. కానీ జితేశ్ శర్మ అతడ్ని పెవిలియన్ బాట పట్టించాడు. ఆ తర్వాత వచ్చిన రాహుల్ తెవాటియా రాణించాడు.

**గుజరాత్ టైటాన్స్ (తుది జట్టు) :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), డేవిడ్ మిల్లర్, అజ్మతుల్లా ఒమర్జాయ్, షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా, వృద్ధిమాన్ సాహా(వికెట్ కీపర్), రషీద్ ఖాన్, రవిశ్రీనివాసన్ సాయి కిషోర్, నూర్ అహ్మద్, సందీప్ వారియర్, మోహిత్ శర్మ.

**పంజాబ్ కింగ్స్ (తుది జట్టు):** సామ్ కరన్(కెప్టెన్), ప్రభ్‌సిమ్రాన్ సింగ్, రిలీ రోసోవ్, లియామ్ లివింగ్‌స్టోన్, శశాంక్ సింగ్, జితేష్ శర్మ(వికెట్ కీపర్), అశుతోష్ శర్మ, హర్‌ప్రీత్ బ్రార్, హర్షల్ పటేల్, కగిసో రబాడ, అర్ష్‌దీప్ సింగ్.

## రీల్



## భారీ కాంబినేషన్‌కు ఓకే చెప్పిన నాగ్?

మన టాలీవుడ్ మన్మథుడు కింగ్ నాగార్జున హీరోగా నటించిన రీసెంట్ చిత్రం నా సామిరంగతో మళ్ళీ తాను ట్రాక్‌లోకి వచ్చేయగా ఈ సినిమా తర్వాత నాగార్జున మరిన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌లు చేస్తున్నారు. అయితే నాగార్జున హీరోగా మాత్రమే కాకుండా పలు భారీ చిత్రాల్లో గెస్ట్ లేదా క్యామియో పాత్రల్లో కూడా కనిపిస్తున్న సంగతి తెలిసిందే. మరి ఇలా బాలీవుడ్ నుంచి భారీ సినిమా బ్రహ్మాస్త్ర ఇప్పుడు ధనుష్, శేఖర్ కమ్ముల ప్రాజెక్ట్ కుబేర లో కూడా తాను కనిపించనున్నారు. అయితే వీటితో పాటుగా మరో భారీ కాంబినేషన్‌కి కింగ్ ఓకే చెప్పినట్టుగా తమిళ్ సినీవర్గాలు చెబుతున్నాయి. దీని ప్రకారం సౌత్ ఇండియా దగ్గర క్రేజీగా ఎదురు చూస్తున్న ప్రాజెక్ట్ సూపర్‌స్టార్ రజినీకాంత్ మరియు దర్శకుడు లోకేష్ కనగరాజ్‌ల సినిమాలో అక్కినేని నాగార్జున ఓ కీలక పాత్రలో కనిపించనున్నారని రూమర్స్ వినిపిస్తున్నాయి. దీనితో ఒకవేళ ఈ వార్త నిజమైతే మాత్రం సాలిడ్ ట్రీట్ ఆడియెన్స్‌కి ఉంటుంది అని చెప్పాలి. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.




## పోకిరి సినిమాకు మరో టైటిల్..

సూపర్‌స్టార్ నుంచి ఇప్పుడు గ్లోబల్ లెవెల్లోకి వెళ్ళబోతున్న స్టార్ హీరో సూపర్‌స్టార్ మహేష్ కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ అయిన పోకిరి కోసం తెలిసిందే. మాస్ అండ్ డాషింగ్ దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ సినిమా సౌత్ ఇండియా సినిమా రికార్డులు తిరగరాసి అప్పటివరకు తెలుగు సినిమా చూడని కనీ వినీ ఎరుగని బ్రహ్మాండమైన రన్‌ని కొనసాగించింది. అయితే ఈ సినిమా ఎంత పక్కా మాస్ గా మహేష్ పాత్ర కూడా ఎంత ఐకానిక్ గా ఉంటుందో తెలిసిందే. అలాగే పూరి జగన్నాథ్ సినిమాలు అంటే అప్పట్లో కూడా ఒక ట్రెండే.. ఆ మాస్ టైటిల్స్ కోసం కూడా బాగా మాట్లాడుకునేవారు. అలానే పోకిరి టైటిల్ కి ప్రస్తావన వచ్చింది. అయితే ఇది మీకు తెలుసా? పోకిరి సినిమాకి కానీ అందులో మహేష్ బాబు పేరు కూడా వేరే అట. ఈ చిత్రానికి ముందుగా ఉత్తమ్ సింగ్ సన్నాఫ్ సూర్య నారాయణ అనే టైటిల్ ని అనుకున్నారట. అంటే మనం చూసిన పోకిరి ప్లేస్ లో ఆ టైటిల్ అలాగే మహేష్ పేరు కూడా కృష్ణ మనోహర్ ప్లేస్ లో ఉత్తమ్ సింగ్ అని ఉండేది. కానీ తర్వాత కొన్ని మార్పులు చేర్పులు తర్వాత సినిమా పోకిరి గా రికార్డులు బద్దలు కొట్టింది.




## తేజ సజ్జ భారీ ప్రాజెక్ట్‌లో దుల్కర్ సల్మాన్!

ప్రస్తుతం టాలీవుడ్ రైజింగ్ హీరోస్ లో పాన్ ఇండియా వైడ్ గా హను మాన్ సాలిడ్ క్రేజ్ ని సొంతం చేసుకున్న యంగ్ హీరో తేజ సజ్జ కూడా ఒకడు. మరి ఇపుడు తాను చేస్తున్న సాలిడ్ చిత్రాల్లో దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని కాంబినేషన్ లో చేస్తున్న భారీ చిత్రమే మిరాయ్. మరి హను మాన్ లో సూపర్ హీరోగా కనిపించిన తేజ ఈసారి సూపర్ యోధ గా కనిపించనున్నాడు. అయితే ఈ క్రేజీ ప్రాజెక్ట్ లో మళయాళ స్టార్ యంగ్ నటుడు దుల్కర్ సల్మాన్ కూడా కనిపించనున్నాడని తెలుస్తుంది. మరి తనకి కార్తీక్ ఒక కీలక పాత్రకి గాను ఇంట్రెస్టింగ్ క్యామియో రోల్ ని డిజైన్ చేసాడట. అందుకు తాను ఓకే కూడా చెప్పినట్టుగా తెలుస్తుంది. మరి దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి కూడా హను మాన్ సంగీత దర్శకుడు గౌర హరీష్ సంగీతం అందిస్తుండగా యంగ్ హీరోయిన్ రితిక నటిస్తుంది. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు భారీ బడ్జెట్ తో నిర్మాణం వహిస్తుండగా వచ్చే ఏడాది ఏప్రిల్ 18న మొత్తం 7 భాషల్లో రిలీజ్ కానుంది.

## బీజాపూర్‌లో ఎదురుకాల్పులు.. మావోయిస్టు మృతి

**బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. ఇటీవల కాంకేర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 29 మంది మరణించగా, తాజాగా బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒకరు చనిపోయారు. ఆదివారం ఉదయం బీజాపూర్ జిల్లాలోని కేస్కుతుల్ అడవుల్లో మావోయిస్టులకు పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. దీంతో ఓ మావోయిస్టు మరణించాడని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నదని చెప్పారు. ఈ నెల 16న కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత శంకర్ రావు సహా 29 మంది మరణించిన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనపై ఆ పార్టీ ఉత్తర్ బస్తర్ జోనల్ కమిటీ బ్యూరో మంగ్లీ పేరుతో మూడు పేజీల లేఖ విడుదలైంది. ఈ ఎన్‌కౌంటర్ పూర్తిగా అమానవీయమైనదని, నమ్మకద్రోహానికి తమ పార్టీ పిఎల్‌జిఎ సభ్యులు వీరమరణం పొందారని మావోయిస్టు పార్టీ పేర్కొన్నది. తమ పార్టీ గురించి పూర్తి వివరాలు తెలిసిన వాళ్ల నుంచి సమాచారం తెలుసుకొన్న భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని నాలుగు వైపుల నుంచి చుట్టుముట్టి దాడి చేశాయని తెలిపింది. కాల్పుల్లో 12 మంది బుల్లెట్ గాయాలతో మృతిచెందారని, మిగతా 17 మందిని పోలీస్ బలగాలు పలు విధాలుగా హింసించి, తుపాకులతో కాల్చి హత మార్చారని ఆరోపించింది. ఆదివాసీ సిఎం అయిన విష్ణుదేవ్ సాయి ఆదేశాలతోనే ఆదివాసీలు మరణించారని, ఈ నరమేధానికి ఛత్తీస్‌గఢ్‌లోని ప్రతి బిజెపి నేతా జవాబుదారీనని పేర్కొన్నది. ప్రజా కోర్టులో వారికి తప్పక శిక్ష పడుతుందని హెచ్చరించింది. కాంకేర్ ఎన్‌కౌంటర్ ఘటనపై ప్రజా సంఘాలు నోరు విప్పాలని మావోయిస్టు పార్టీ తమ లేఖలో కోరింది. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టులకు నివాళిగా ఈ నెల 25వ తేదీన నారాయణ్‌పూర్, కాంకేర్, మాన్‌పూర్‌మోహ్లా జిల్లాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ప్రకటించింది.

## 'నాకు, నా మేనల్లుడికి రక్షణ లేదు'

మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు



**కోల్‌కతా :** తనకు, తన మేనల్లుడు, టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి భద్రత లేదని పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కుమార్ గంజ్ టిఎంసి అభ్యర్థి, రాష్ట్ర మంత్రి బిప్లబ్ మిత్రా తరుపున ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దీదీ మాట్లాడుతూ.. బిజెపి తనను, తన మేనల్లుడిని టార్గెట్ చేస్తోందన్నారు. రాష్ట్రంలో తమకు భద్రత లేదన్నారు. సోమవారం ఓ అంశం టిఎంసిని, ఆ పార్టీ అగ్రనేతల్ని కుదిపేస్తుందంటూ ప్రతిపక్ష బిజెపి నేత సువేందు అధికారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలపై మమతా బెనర్జీ తాజాగా స్పందించారు. 'బిజెపి నన్ను, అభిషేక్‌ను టార్గెట్ చేస్తోంది. మేము సురక్షితంగా లేము. అయితే కాషాయపార్టీ కుట్రలకు మేం బయపడం. టిఎంసి నాయకులు.. రాష్ట్ర ప్రజలపై కుట్ర జరగకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నాము' అని ఆమె అన్నారు. సువేందు అధికారి వ్యాఖ్యలపై స్పందించిన మమతా బెనర్జీ 'తన కుటుంబాన్ని అక్రమ సంపదను కాపాడుకోవడానికి బిజెపిలో చేరిన ఒక దేశద్రోహి ఉన్నాడు. అతని తాటాకు చప్పుళ్లకు మేం బెదరం' అని స్పష్టం చేశారు.

# ప్రజాహక్కులను కాలరాసే యత్నం

కేంద్ర సర్కార్‌పై ప్రియాంక మండిపాటు



**రాయ్‌పూర్ :** మన రాజ్యాంగాన్ని మార్చి, ప్రజల హక్కులను హరించాలని బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ మండిపడ్డారు. ఛత్తీస్‌గడ్ బలోడ్‌లోని కాంకేర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న బీరేష్ ఠాకూర్‌కు మద్దతు నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంకాగాంధీ పాల్గొని ప్రసంగించారు. రాజకీయాల్లో మతాన్ని వాడుకుంటున్నారని, ఇది దేశ సంప్రదాయం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు వేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అదే విధంగా రిజర్వేషన్లు, గిరిజన సంస్కృతికి రక్షణ కల్పించిందని, దళితుల అభివృద్ధిని సులభతరం చేసిందన్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ రాజ్యాంగాన్ని మార్చాలని, ప్రజల హక్కులను కాలరాయాలని చూస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగంలో ఏదైనా మార్పు ప్రతి ఒక్కరిపై ప్రభావం చూపుతుందని, ప్రజలు హక్కుల కోల్పోవడం వల్ల గౌరవప్రదమైన జీవితాన్ని గడపలేరని, ప్రశ్నలు అడిగే హక్కును కూడా కోల్పోతారన్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్రం ఉద్దేశం సరైనది కాదని కాంగ్రెస్ సీనియర్ నేత ఆరోపించారు. 'రాజకీయాలు చూపించడం' దేశంలో బాగా ప్రాచుర్యం పొందిందని, ఒక నాయకుడు పూజ చేస్తే కెమెరా ఉండాలి, అది టెలివిజన్‌లో కనిపించాలి అని ఎద్దేవా చేశారు. 'ఇందిరాజీకి (మాజీ ప్రధాని ఇందిరాగాంధీ) పూజా గది ఉంది, కానీ ఆమె ఏకాంతంగా ఆ పని చేసింది. అది చూపించడానికి కాదు. మతం మన సంప్రదాయం కాదు కాబట్టి రాజకీయాల్లో ఉపయోగించకూడదని హితవు పలికారు. మతం అంటే సత్యం, సేవ అని, ఒక నాయకుడు వేదికపై నుండి తప్పుడు వాగ్దానాలు చేస్తే, వారు మతం లేదా సత్య మార్గంలో ఉండరన్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోదీకి చెందిన కొంతమంది పారిశ్రామికవేత్తల కోసం మాత్రమే పనిచేస్తోందని, అదే ప్రజల కోసం పనిచేసి ఉంటే సమస్యలు పరిష్కారమయ్యేవన్నారు. మోదీజీ ప్రభుత్వం 10 ఏళ్లుగా అధికారంలో ఉందని, జీవితాలు ఏమైనా మారాయా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ ప్రపంచంలోనే శక్తివంతమైన నాయకుడయ్యారని బిజెపి నేతలు చెబుతున్నారని, అదే జరిగితే నిరుద్యోగాన్ని ఎందుకు తగ్గించలేదని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించలేదని ప్రియాంక నిలదీశారు. పారిశ్రామికవేత్తల స్నేహితులకు 16 లక్షల కోట్ల రూపాయల రుణాలను ప్రధాని మాఫీ చేశారని దుయ్యబట్టారు.

# మోదీ-షా సర్కార్ మళ్లీ వస్తే ప్రజాస్వామ్యం అంతం

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



**సాట్నా :** 'మోదీ-షా సర్కార్' మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం అంతమైపోతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్‌పై మండిపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని సాట్నా జిల్లాలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారన్నారు.బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ చూస్తోందని, మహిళలు, కూలీలు, రైతులకు ఓటు అడిగే హక్కును సజీవంగా ఉంచుకోవాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి సిద్ధార్థ్ కుష్వాహాకు మద్దతుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఖర్గే మాట్లాడుతూ, మోదీ-షా ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం అంతమవుతోందన్నారు. ప్రధాని మోదీ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించిన ఖర్గే, ప్రధాని తన పార్టీ పేరు తీసుకోకుండా 'మోదీ కి గ్యారంటీ' గురించి మాట్లాడుతున్నారని అన్నారు. తాను ప్రధాని అయితే విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి రప్పించి ప్రతి ఒక్కరికీ రూ.15 లక్షలు ఇస్తామని చెప్పారు అని మరి తెచ్చారా అని నిలదీశారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు వస్తాయని మోదీ ఈ దేశ యువతకు చెప్పారని ఖర్గే ప్రధానిపై విమర్శలను కొనసాగించారు. అయితే పదేళ్లు గడిచాయి... మీ అందరికీ 20 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా... వాటి గురించి బిజెపిని నిలదీయాలన్నారు. ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు రూ. 15 లక్షలు ఏవీ అని అడగాలన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మోదీ హామీ ఇచ్చారని, అది కూడా జరగలేదని ఖర్గే మండిపడ్డారు. 2014కు ముందు కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ అధికారంలో ఉన్నప్పుడు వంటగ్యాస్ సిలిండర్లు, పాలు, పిండి, పప్పుల ధరలను జాబితాను చూపిస్తూ గత పదేళ్లలో ఈ వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఇవీ మోదీ అచ్చే దిన్ (మంచి రోజులు) అని వ్యంగ్యానించారు. మోదీ ఎప్పుడూ అచ్చే దిన్ తెస్తాను అంటూ అబద్ధాలు చెబుతాడని, అందుకే ఆయనను 'ఝూఠోన్ కా సర్దార్' అని పిలుస్తాను' అని ఖర్గే వ్యాఖ్యానించారు. దేశంలో నిరుద్యోగిత రేటు గత 45 ఏళ్లలో అత్యధికంగా ఉందని, అయితే దానికి సంబంధించిన లెక్కలు లేవని ఆయన అన్నారు. దేశంలోని విమానాశ్రయాలు, రోడ్లు, భూమి, ప్రభుత్వ రంగ సంస్థలు, పెద్ద కర్మాగారాలు వంటి ఆస్తులను 'ఇద్దరు కొనుగోలుదారులకు' విక్రయిస్తున్నారని ఖర్గే పేర్కొన్నారు. ఆ ఇద్దరు అదానీ, అంబానీలేనన్నారు. ధనవంతులకు రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసినా పేద రైతుల రుణాలు మాఫీ కాలేదన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ నేతృత్వంలో రూ.72 వేల కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ అయ్యాయి. అవినీతికి పాల్పడిన వారిని బిజెపిలోకి తీసుకున్నందుకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి షాపై ఖర్గే మండిపడ్డారు.

## రైల్వేలను నిర్వీర్యం చేసి స్నేహితులకు కట్టబెట్టేందుకు మోదీ స్కెచ్ : రాహుల్



**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ ప్రభుత్వం రైల్వేలను నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో రైలు ప్రయాణం శిక్షగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికులు తమ రైలు ప్రయాణంలో అసౌకర్యానికి గురైన వీడియో క్లిప్‌ను రాహుల్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో షేర్ చేశారు. విలాసవంతమైన రైళ్లను ప్రోత్సహించేందుకు మోదీ ప్రభుత్వం సామాన్యులు ప్రయాణించే రైళ్లలోని జనరల్ కోచ్‌ల సంఖ్యను తగ్గించడంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని రాహుల్ గాంధీ ఈ పోస్ట్‌లో రాసుకొచ్చారు. టికెట్లు కన్‌ఫాం అయిన ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య ప్రయాణికులు రైలు ఫ్లోర్‌పై కూర్చోవడంతో పాటు టాయ్‌లెట్స్‌లో బలవంతంగా ప్రయాణించాల్సి వస్తోందని అన్నారు. టికెట్స్ కన్‌ఫాం అయిన ప్రయాణికులు సైతం తమ సీట్లలో కూర్చోలేకపోతున్నారని అన్నారు. రైల్వేలను బలహీనపరిచి దాన్ని తన స్నేహితులకు విక్రయించాలని బిజెపి కోరుకుంటోందని దుయ్యబట్టారు. సామాన్య ప్రయాణికులను కాపాడాలంటే రైల్వేలను దోచుకుంటున్న మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాలని రాహుల్ గాంధీ ప్రజలను కోరారు.

## చిరాగ్ పాశ్వాన్‌కు షాక్.. ఆర్‌జెడిలో చేరిన మెహబూబ్



**పాట్నా :** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీహార్ లోక్‌జనశక్తి పార్టీ (ఎల్‌జెపి)కి భారీ షాక్ తగిలింది. పాట్నా ఎల్‌జెపి ఎంపీ మెహబూబ్ అలీ కైసర్ రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)లో చేరారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి ముఖ్యనేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ..పార్టీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌తో భేటీ తర్వాత మెహబూబ్ మాతో చేరుతున్నారు. అతని రాజకీయం అనుభవం రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు మేం చేస్తున్న పోరాటానికి అనుకూలంగా అధికార పార్టీ నుంచి ముప్పు నుంచి ధీటుగా ఎదుర్కొనేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. 2020లో ఎల్‌జెపి అధినేత రామ్ విలాస్ పాశ్వాన్ మరణంతో ఆ పార్టీలో చీలిక ఏర్పడింది. ఎల్‌జెపి నుంచి రామ్ విలాస్ పాశ్వాన్ సోదరుడు పసుపతి కుమార్ పరాస్ తనకు అండగా ఉన్న ఎంపిల సాయంతో సొంతంగా రాష్ట్రీయ లోక్‌జన శక్తి పార్టీని స్థాపించారు. ఆ సమయంలో పసుపతి పరాస్‌కు మొహబూబ్ అండగా నిలిచారు. అయితే ఈ సారి ఎన్నికల్లో చిరాగ్ పాశ్వాన్‌కు మద్దతు పలికారు. అయినప్పటికీ చిరాగ్ పాశ్వాన్ మొహబూబ్‌కు లోక్‌సభ సీటును తిరస్కరించారు. దీంతో తాజాగా మొహబూబ్ ఆర్‌జెడి తీర్థం పుచ్చుకున్నారు.